# 2013 మార్చితో ముగిసిన సంవత్సరానికి
# స్థానిక సంస్థలపై
# భారత కంప్ట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్ నివేదిక



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

*2014లో 6వ నివేదిక*

# 2013 మార్చితో ముగిసిన సంవత్సరానికి
# స్థానిక సంస్థలపై
# భారత కంప్ట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్ నివేదిక

**ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం**

***2014లో 6వ నివేదిక***

**www.cag.gov.in**

# విషయ సూచిక


| | పేరా | పేజీ |
|---|---|---|
| ముందుమాట | | iii |
| అవలోకనం | | v |
| ఈ నివేదిక గురించి | 1 | v |
| నేపథ్యం | 2 | v |
| సంస్థాగత నిర్మాణం | 3 | v |
| ముఖ్యమైన ఆడిట్ పరిశీలనలు | 4 | vii |
| అధ్యాయం 1 - స్థానిక సంస్థల ఆర్థిక స్థితిగతులు, పద్దుల నిర్వహణపై అవలోకనం | | |
| స్థానిక సంస్థల ఆర్థిక స్థితిగతులు | 1.1 | 1 |
| నిధులు, విధుల బదిలీ | 1.2 | 3 |
| పద్దుల నిర్వహణ | 1.3 | 3 |
| ఆడిట్ నిబంధన | 1.4 | 4 |
| ఆర్థికాంశాల నివేదన | 1.5 | 6 |
| ముగింపు | 1.6 | 8 |
| ఆడిట్ సమీక్షలు | | |
| పంచాయతీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ<br>అధ్యాయం 2 - ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన | 2.1 | 9 |
| అధ్యాయం 3 - సంపూర్ణ పారిశుధ్య పథకం/నిర్మల్ భారత్ అభియాన్ | 3.1 | 31 |
| నియమాల పాటింపుపై ఆడిట్ | | |
| మునిసిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ<br>అధ్యాయం 4 - సంగారెడ్డి పురపాలక సంఘంలో వసూళ్ళ దుర్వినియోగం | 4.1 | 51 |

# అనుబంధాలు


| అనుబంధం సంఖ్య | విషయం | పేరా | పేజీ |
|---|---|---|---|
| 1 | పంచాయతీరాజ్ సంస్థలలో స్థాయిలవారీగా బాధ్యతలు తెలిపే పట్టిక | అవలోకనం | 53 |
| 1.1 | పంచాయతీరాజ్ సంస్థలకు 2011-12 లో జిల్లాలవారీగా, విధులవారీగా వచ్చిన నిధుల వివరాలు | 1.2 | 55 |
| 1.2 | ముగిసిన పథకాల మిగులు నిధులను పట్టణ స్థానిక సంస్థలు అట్టిపెట్టుకున్న వివరాలు | 1.5.2 | 56 |
| 1.3 | సర్దుబాటుకాని అడ్వాన్సుల వివరాలు | 1.5.3 | 57 |
| 1.4 | పద్దులు రూపొందించని పట్టణ స్థానిక సంస్థల వివరాలు | 1.5.8 | 57 |
| 2.1 | ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజన నమూనా తనిఖీ వివరాలు | 2.9.1 | 59 |
| 3.1 | టీఎస్పీ/ఎన్‌బీఏ పనుల నమూనా తనిఖీ వివరాలు | 3.3.3 | 64 |
| | *పొడి అక్షరాల వివరణ* | | 65 |

# ముందుమాట

1. భారత రాజ్యాంగంలోని 151(2)వ అధికరణం, ఇంకా ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం, 2014లోని సెక్షన్ 45(1) అనుసరించి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల గవర్నర్లకు సమర్పించటం కోసం 2013 మార్చితో ముగిసిన సంవత్సరానికి సంబంధించి ఈ ఆడిట్ నివేదికను రూపొందించటం జరిగింది. ఈ నివేదిక ఒకప్పటి అవిభాజ్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సంబంధించినది.

2. అవిభాజ్య ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలోని సామాన్య మరియు సామాజిక రంగాలకు సంబంధించి పంచాయతీరాజ్ - గ్రామీణాభివృద్ధి శాఖ, మునిసిపల్ పరిపాలన - పట్టణాభివృద్ధి శాఖలలోని ముఖ్యమైన ఆడిట్ సమీక్షలు, నియమపాలనపట్ల ఆడిట్ పరిశీలనలు ఈ నివేదికలో ఉన్నాయి. ఈ రెండూకాక మిగతా ప్రభుత్వ శాఖలకు సంబంధించిన ఆడిట్ విశ్లేషణలు 'సామాన్య మరియు సామాజిక రంగాల ఆడిట్ నివేదికలో' ఉంటాయి.

3. 2012-13 సంతవ్సరం పద్దులను నమూనా తనిఖీ చేసినప్పుడు గుర్తించిన అంశాలతోపాటు అంతకు ముందు సంవత్సరాలలోనే గమనించినా అప్పటి నివేదికలలో చేర్చని అంశాలను కూడా ఈ నివేదికలో ప్రస్తావించటం జరిగింది; అంతేకాకుండా, 2012-13 తదుపరి చోటుచేసుకున్న విషయాలను సైతం సందర్భానుసారం ఈ నివేదికలో పొందుపర్చటం జరిగింది.

4. భారత కంప్ట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్ జారీ చేసిన ఆడిటింగ్ ప్రమాణాలకు అనుగుణంగా ఈ ఆడిట్ నిర్వహించటం జరిగింది.

5. ఈ తెలుగు నివేదికలో ఏవైనా సందేహాలుంటే అనువాదానికి ఆధారమైన ఆంగ్ల నివేదికను అధికారికంగా తీసుకోగలరు.

# అవలోకనం

## 1 ఈ నివేదిక గురించి

ఇది భారత కంప్ట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్ (సీఏజీ) నివేదిక. స్థానిక సంస్థల భాగస్వామ్యంతో పంచాయతీ రాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ, మునిసిపల్ పాలన మరియు పట్టణాభివృద్ధి శాఖలు చేపట్టిన వాటిలో ఎంపిక చేసిన కార్యక్రమాల అమలు తీరునూ, అలాగే స్థానిక సంస్థల నియమపాలననూ తనిఖీ చేయగా వెల్లడైన అంశాలు ఈ నివేదికలో ఉన్నాయి.

ఈ నివేదికలో స్థానిక సంస్థల ఆర్థిక స్థితిగతులు, పద్దులపై విశ్లేషణతోపాటు ఆర్థిక నివేదనాంశాలు కూడా ఉంటాయి.

## 2 నేపథ్యం

పంచాయతీరాజ్ సంస్థలు, పట్టణ స్థానిక సంస్థలవంటి ప్రాంతీయ స్వయంపాలక సంస్థలను బలోపేతం చేయటానికి భారత ప్రభుత్వం రాజ్యాంగానికి 73, 74వ సవరణలను చేసింది. అంతేకాక, కీలకమైన సామాజిక - ఆర్థిక కార్యక్రమాల అమలు బాధ్యతను ఈ పంచాయతీరాజ్ సంస్థలకూ, పట్టణ స్థానిక సంస్థలకూ అప్పగించింది.

స్వయంపాలక సంస్థలుగా వ్యవహరిస్తూ, ఆర్థికాభివృద్ధి, సామాజికన్యాయం, ఇంకా రాజ్యాంగంలోని పదకొండు, పన్నెండవ షెడ్యూళ్ళలో పేర్కొన్న పలు అంశాలను అమలు చేసేందుకు వీలుగా ఈ స్థానిక సంస్థలకు రాష్ట్రాలు సైతం తగు అధికారాలు, బాధ్యతలు అప్పగించవలసి ఉంది.


ఇందుకనుగుణంగా, రాష్ట్ర ప్రభుత్వం అప్పటి వరకూ ఉన్న పాత చట్టాలన్నింటినీ రద్దుచేస్తూ గ్రామ, మండల, జిల్లా స్థాయిలలో మూడంచెల వ్యవస్థను ఏర్పాటుచేస్తూ 1994లో ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చట్టాన్ని తీసుకువచ్చింది. రాష్ట్రంలో నగరపాలక సంస్థలను ఏర్పరచేందుకుగాను ఆంధ్రప్రదేశ్ మునిసిపల్ కార్పొరేషన్ల చట్టం-1994ను కూడా చేసింది. హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ చట్టం-1955లోని అన్ని అంశాలతోపాటు పన్నులు, రుసుములను విధించి వసూలు చేసుకోవటానికి సంబంధించిన అంశాలను రాష్ట్రంలోని అన్ని ఇతర నగర పాలక సంస్థలకూ వర్తింపచేసింది. అయితే, మున్సిపాలిటీలన్నీ ఆంధ్రప్రదేశ్ మున్సిపాలిటీల చట్టం-1965 కిందికే వస్తాయి.

ఆంధ్రప్రదేశ్‌లో 2013 మార్చి 31 నాటికి 22,711 పంచాయతీరాజ్ సంస్థలు ఉన్నాయి. వీటిలో 22 జిల్లా ప్రజాపరిషత్‌లు, 1097 మండల ప్రజా పరిషత్‌లు, 21,592 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇక 182 పట్టణ స్థానిక సంస్థలు ఉండగా అందులో 19 మున్సిపల్ కార్పొరేషన్లు, 117 మున్సిపాలిటీలు, 46 నగర పంచాయతీలు ఉన్నాయి.

## 3 సంస్థాగత నిర్మాణం

రాష్ట్రంలోని పంచాయతీరాజ్ సంస్థలు, పట్టణ స్థానిక సంస్థలలో ప్రభుత్వ యంత్రాంగం, ఎన్నికైన ప్రతినిధులతో కలుపుకుని సంస్థాగత నిర్మాణం ఈ విధంగా ఉంది ః

# పంచాయతీ రాజ్, పట్టణ స్థానిక సంస్థల స్వరూప చిత్రణ




* హైదరాబాదు మహా నగరపాలక సంస్థలో మాత్రం కమీషనరు, రాష్ట్ర పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి ప్రత్యక్ష నియంత్రణలోనే పనిచేస్తారు.

బిందు రేఖలు పాక్షిక పర్యవేక్షణను సూచిస్తాయి

పంచాయతీరాజ్ సంస్థలలో స్థాయిల వారీగా భూమికలు, బాధ్యతలు ***అనుబంధం - 1***లో విపులీకరించడమైంది.

పురపాలక సంఘాలు, నగరపాలక సంస్థలు సంబంధిత చట్టాల మేరకు తమ కార్యకలాపాలు నిర్వహిస్తాయి. నగరపాలక సంస్థలలో అన్ని వార్డు కమిటీల అధ్యక్షులతో కూడిన స్థాయీసంఘాలు నిర్ణీత కాలవ్యవధిలో సమావేశమౌతాయి. అలాగే, పురపాలక సంఘాల్లో వార్డు కమిటీలు నిర్ణీత వ్యవధిలో సమావేశమై కార్యకలాపాలు నిర్వహించడం, నిబంధనలను రూపొందించడం, మునిసిపల్ పద్దులను పరిశీలించడం చేస్తాయి. పురపాలక సంఘాలు, నగర పాలక సంస్థల వార్డు కమిటీల విధులలో పారిశుద్ధ్య ఏర్పాట్లు, నీటి సరఫరా, మురుగునీటి పారుదల, వీధి దీపాలు, రహదార్లు, మార్కెట్లు, ఆట స్థలాలు, పాఠశాలభవనాల నిర్వహణ, వసూళ్ల సమీక్ష వార్షిక బడ్జెటు రూపకల్పన, పనుల మంజూరు ప్రధానమైనవి. పట్టణ స్థానిక సంస్థల రోజువారీ పరిపాలనా వ్యవహారాలను కమీషనరు నిర్వహిస్తారు. వీరికి అదనపు/ఉప/సహాయ కమీనర్లు, పురపాలక ఇంజనీరు, వైద్యాధికారి, పద్దుల పరిశీలకుడు, పట్టణ ప్రణాళికాధికారి, ఇతర సిబ్బంది సహకరిస్తారు.

## 4 ముఖ్యమైన ఆడిట్ పరిశీలనలు

ఈ ఆడిట్ నివేదికలో పంచాయతీరాజ్ సంస్థలు, పట్టణ స్థానిక సంస్థల మీద రెండు పనితీరు సమీక్షలు, నియమపాలనమీద ఒక ఆడిట్ పేరాగ్రాఫ్ ఉన్నాయి. ముసాయిదా సమీక్షలు, పేరాగ్రాఫ్‌లను ప్రభుత్వానికి పంపి, వచ్చిన సమాధానాలను ఈ నివేదికలో పొందుపరచటం జరిగింది. ఈ సమీక్షలు, పేరాగ్రాఫ్‌లలోని ముఖ్యమైన ఆడిట్ పరిశీలనలను ఈ దిగువ విశదీకరించటం జరిగింది :

### 4.1 ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన అమలు

*ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన (పీఎమ్‌జీఎస్‌వై) పథకాన్ని కేంద్ర ప్రభుత్వం **2000** సంవత్సరంలో ఆరంభించింది. గ్రామీణ ప్రాంతాలలో అన్ని ఋతువులకు అనువైన రహదారి వ్యవస్థను సమకూర్చటం దీని ఉద్దేశం. జనాభా **1,000** పైబడిన గ్రామాలన్నింటికీ **2003** సంవత్సరంలోగా రహదారి వసతి కల్పించాలనీ, అదేవిధంగా **500** మందికి మించిన జనాభాకల ఆవాసాలను **2007** సంవత్సరం నాటికి దీని పరిధిలోకి తీసుకురావాలనీ లక్ష్యంగా పెట్టుకున్నారు.*

*ఆంధ్రప్రదేశ్‌లో పీఎమ్‌జీఎస్‌వై కార్యక్రమం అమలును ఇదివరకొకసారి **2005**లో సమీక్షించి, **2000-05** సంవత్సరాల నడుమ చేపట్టిన నిర్మాణ పనులను పరిశీలించటం జరిగింది. ఈ ఆడిట్ పరిశీలనలు **2005** మార్చి **31** తో ముగిసిన సంవత్సరపు సీఏజీ ఆడిట్ నివేదిక (సివిల్)లో చోటుచేసుకున్నాయి. పీఎమ్‌జీఎస్‌వై అమలుచేయటంలోని ప్రణాళిక, ఆర్థిక నిర్వహణ, నిర్మాణం పనులు చేపట్టటం, నాణ్యత నియంత్రణ, పర్యవేక్షణ వంటి అంశాలలోని పలు లోపాలను ఈ నివేదిక వెలుగులోకి తెచ్చింది. పీఎమ్‌జీఎస్‌వై కార్యక్రమం అమలును మెరుగుపరిచే దిశగా రాష్ట్ర ప్రభుత్వం తగు దిద్దుబాటు చర్యలు తీసుకున్నదీ లేనిదీ పరిశీలించేందుకు ఎనిమిది సంవత్సరాల తర్వాత ఈ కార్యక్రమం పై మరో సమీక్ష చేపట్టాలని నిర్ణయించటం జరిగింది. అయితే, గతంలో సీఏజీనివేదికలోప్రస్తావించిన లోపాలను పూర్తిగా సరిదిద్దలేదనీ, పలు అంతరాలు ఇంకా కొనసాగుతున్నాయనీ ప్రస్తుత పరిశీలనలో తెలిసింది. వివిధ అంశాలమీద ముఖ్యమైన ఆడిట్ పరిశీలనలు ఈ కింది విధంగా ఉన్నాయి :*

- *కేంద్ర ప్రభుత్వం **2010** సెప్టెంబరులో అనుమతించిన **298** వంతెన పనులలో **149** పనులు పూర్తయినా, రాష్ట్ర ప్రభుత్వం తన వంతు **₹210.73** కోట్లు విడుదల చేయలేదు. అంతేకాకుండా, **2012-13**లో ఆమోదం పొందిన పనుల తాలూకు తన వాటా **₹10.21** కోట్లు కూడా రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయలేదు.*

***(పేరా 2.6.2)***

- సమగ్ర ప్రాజెక్టు నివేదికలు (డీపీఆర్) రూపొందించే సమయంలో అవసరమైన అధ్యయనాలు, సర్వేలు, ట్రాన్సెక్ట్‌వాక్‌లు తగినంత శ్రద్ధగా చేయకపోవటం వలన అనేక పనులు అసంపూర్తిగా మిగిలిపోవటం, కొన్ని పనులు అప్పగించకపోవటం, కొన్ని అర్థంతరంగా రద్దు కావటం జరిగింది.

(పేరా 2.7.1)

- టెండరు ప్రక్రియలో అనేక లోపాలున్నాయి. పై అధికారుల నుంచి సాంకేతికపరమైన అనుమతి రాకముందే కొన్ని పనులకు టెండర్లు పిలిచారు.

(పేరా 2.8)

- రోడ్ల నిర్మాణం పూర్తయినాగానీ, వంతెనలు, పూర్తి నిడివి రోడ్లు వేయలేదు. కాంట్రాక్టర్లు పనులను ఆపేయటం, సరిగా పూర్తి చేయకపోవటం వలన గ్రామాలకు అన్ని ఋతువుల రోడ్డు అనుసంధానం ఒనగూరలేదు.

(పేరా 2.9)

- దారికి ఇరువైపులా నీరుపారేందుకు కాలువలు నిర్మించే విషయంలో కార్యక్రమ మార్గదర్శకాలు, నిబంధనలను పాటించలేదు. నిర్వహణ లోపం వలన రోడ్లు శిథిలమవుతున్నాయి

(పేరాలు 2.9.4, 2.11)

- రాష్ట్ర స్థాయిలో నాణ్యతా నియంత్రణ కట్టుదిట్టంగాలేదు. నాణ్యతా నియంత్రణ పరీక్షలు తగినన్ని సార్లు చేయలేదు.

(పేరా 2.10)

- ఆర్థిక నిర్వహణ కార్యసాధకంగా లేకపోవటంవలన రహదారుల మరమ్మతులకు తగినన్ని నిధులు ఇవ్వక పోవటం, అడ్వాన్సులు సర్దుబాటు చేయకపోవటం వంటివి చోటుచేసుకున్నాయి. కీలకమైన పలు రిజిస్టర్లు సక్రమంగా రాయకపోవటం, కొన్ని అసలే లేకపోవటం జరిగింది.

(పేరాలు 2.11, 2.12)

## 4.2 సంపూర్ణ పారిశుధ్య పథకం/నిర్మల్ భారత్ అభియాన్

సంపూర్ణ పారిశుధ్య పథకాన్ని (టీఎస్‌సీ) కేంద్ర ప్రభుత్వం 1999లో ప్రవేశపెట్టింది. గ్రామీణ పారిశుధ్య రంగంలో పటిష్టమైన సంస్కరణలు తీసుకురావటం దీని లక్ష్యం. ఆధునిక వ్యూహాలతో త్వరితగతిన, విస్తృత ప్రాతిపదికన పారిశుధ్య వసతులను కల్పించే తలంపుతో ప్రభుత్వం టీఎస్‌సీ పథకానికి 2012లో "నిర్మల్ భారత్ అభియాన్" (ఎన్‌బీఏ) అనిపేరు పెట్టింది. సంపూర్ణ పారిశుధ్య పథకం/నిర్మల్ భారత్ అభియాన్ అమలు మీద చేపట్టిన ఆడిట్ సమీక్షలో ఈ కింది విషయాలు తెలిశాయి.

- నిధులు సమృద్ధిగా అందుబాటులో ఉన్నాగానీ, 2010-13 సంవత్సరాలలో సంకల్పించిన ఐఈసీ కార్యకలాపాలను లక్ష్యాల మేర చేపట్టలేదు. ఐఈసీ కార్యకలాపాల కోసం 2008-13 సంవత్సరాల నడుమ ₹469.63 కోట్లు ఖర్చు చేయవలసి ఉండగా, ప్రభుత్వం ₹32.41 కోట్లు మాత్రమే వినియోగించుకుంది.

(పేరా 3.7.1)

- వ్యక్తిగత మరుగుదొడ్లు ఒక లబ్ధిదారునికి ఒకటికన్నా ఎక్కువ మంజూరు చేయటం, వేరువేరు లబ్ధిదారులకు ఒకే ఐడీ నెంబరును కేటాయించటం వంటివి చోటుచేసుకున్నాయి.

(పేరా 3.7.2)

- *పాఠశాలలకు మరుగుదొడ్ల నిర్మాణం విషయంలో మహబూబ్‌నగర్ జిల్లా నూరు శాతం లక్ష్యాలు సాధించినట్టు జిల్లా నీటి సరఫరా మరియు పారిశుధ్య మిషన్ (డీడబ్ల్యూఎస్ఎమ్) నివేదికలలో పేర్కొనగా, నమూనా తనిఖీ చేసిన యూనిట్లలో రికార్డులు పరిశీలించిన మీదట మరుగుదొడ్ల నిర్మాణ పనులలో కొరత ఉన్నట్టు తెలిసింది. దీనినిబట్టి జిల్లా స్థాయి సమాచారం అసమగ్రంగానూ అవాస్తవికంగాను ఉన్నట్టు తేలుతోంది. ఇక అనంతపురం జిల్లా విషయానికొస్తే, **2008-12** సంవత్సరాల మధ్య పాఠశాలలకు మరుగుదొడ్ల నిర్మాణాలేవీ చేపట్టలేదు.*

**(పేరా 3.7.3)**

- *ప్రత్యక్ష తనిఖీ చేపట్టిన వాటిలో **48** శాతం పాఠశాలల్లో బాలికలకు ప్రత్యేక వసతులు లేవు.*

**(పేరా 3.7.3)**

- *ఉత్పత్తి కేంద్రాలను నెలకొల్పటంలో ప్రభుత్వం తగిన చొరవ చూపకపోవటం వలన రివాల్వింగ్ ఫండ్‌ను వినియోగించుకోలేకపోవటమేకాక, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణానికి అవసరమయ్యే సామగ్రిని తక్కువ ధరకు తమ ఊళ్ళోనే పొందే అవకాశం లబ్ధిదారులకు కలగటంలేదు.*

**(పేరా 3.7.7)**

- *ఆర్థిక నిర్వహణ సరిగాలేనందున డీడబ్ల్యూఎస్ఎమ్ కార్యాలయాలకు నిధులు ఇవ్వకపోవటం, ఆలస్యంగా ఇవ్వటం, కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చిన **₹5.48** కోట్ల నిధులను రాష్ట్రం వాటాకు మళ్ళించటం, నిధులను కాలపరిమితి డిపాజిట్లలో పెట్టటంవంటివి జరిగాయి.*

**(పేరా 3.8)**

- *కార్యక్రమం అమలులో నిర్వాహకతను నిగ్గుతేల్చేందుకు ప్రభుత్వం తగు మూల్యనిర్ధారణ అధ్యయనం చేపట్టలేదు.*

**(పేరా 3.10)**

## 4.3 నియమపాలన తనిఖీ

- *ప్రభుత్వ నియమాలు పాటించకపోవటం, అంతర్గత నియంత్రణలు కొరవడటం వలన సంగారెడ్డి మున్సిపాలిటీలో **₹84.67** లక్షల మేర వసూళ్ళు దుర్వినియోగం అయ్యేందుకు ఆస్కారం ఏర్పడటమేకాక **₹36.43** లక్షల మొత్తం తాత్కాలికంగా దుర్వినియోగం అయింది.*

**(పేరా 4.1)**

# అధ్యాయం - 1

## స్థానిక సంస్థల ఆర్థిక స్థితిగతులు, పద్దుల నిర్వహణపై అవలోకనం

పేజీలు 1 - 8

# 1.1 స్థానిక సంస్థల ఆర్థిక స్థితిగతులు

## 1.1.1 నిధుల లభ్యత

పంచాయతీరాజ్ సంస్థలు, పట్టణ స్థానిక సంస్థల ఆదాయ వనరులలో పన్నులు[1], పన్నులుకాని ఇతర[2] వసూళ్ళ ద్వారా సమకూరే సొంతరాబడి, రాష్ట్ర ఆర్థిక సంఘం, కేంద్ర ఆర్థిక సంఘం సిఫార్సుల మేరకు సంక్రమించిన నిధులు, అభివృద్ధి పనులకూ నిర్వహణ పనులకుగాను రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలిచ్చే గ్రాంట్లు, ఇంకా ఇతర రాబడులు[3] ఉంటాయి. పంచాయతీరాజ్ సంస్థలలో నిధుల వినియోగం గురించి ఎప్పటికప్పుడు నివేదించే విషయమై జిల్లా ప్రజాపరిషత్తులో ముఖ్య కార్యనిర్వహణాధికారి, మండల ప్రజాపరిషత్తులో మండలాభివృద్ధి అధికారి, అలాగే గ్రామపంచాయతీలో పంచాయతీ కార్యదర్శి బాధ్యత వహిస్తారు. ఇక కార్పొరేషన్లు, మున్సిపాలిటీల విషయంలో సంబంధిత కమిషనరు ఈ బాధ్యత తీసుకుంటారు.

## 1.1.2 నిధుల లభ్యత, వినియోగం

పంచాయతీరాజ్ సంస్థల రాబడులు 2008-13 సంవత్సరాలలో ఈ విధంగా ఉన్నాయి :

**పట్టిక 1.1**

**(₹ కోట్లలో)**

| క్రమ సంఖ్య | రాబడులు | 2008-09 | 2009-10 | 2010-11 | 2011-12 | 2012-13 |
|---|---|---|---|---|---|---|
| పంచాయతీరాజ్ సంస్థలు | | | | | | |
| 1 | సొంత రాబడి | 1597.79 | 928.33 | 955.77 | 1009.24 | 976.50 |
| 2 | కేటాయించిన నిధులు[4] | 827.98 | 311.69 | 262.39 | 344.02 | 154.36 |
| 3 | రాష్ట్ర ప్రభుత్వ గ్రాంటులు | | 930.16 | 797.05 | 1185.85 | 343.97 |
| 4 | కేంద్ర ప్రభుత్వ గ్రాంటులు | | | | | |
| | బీఆర్‌జీఎఫ్[5] | 1534.07 | 3070.50 | 2245.85 | 1913.9 | 1083.15 |
| | పన్నెండు, పదమూడవ ఆర్థిక సంఘాలు | 518.01 | 491.31 | 393.52 | 428.29 | 117.88 |
| 5 | ఇతర రాబడులు | 1147.71 | 341.4 | 362.45 | 331.68 | 84.18 |
| | మొత్తం | **5625.56** | **6073.39** | **5017.03** | **5212.98** | **2760.04** |

*మూలం: పంచాయతీరాజ్ శాఖ కమిషనరు ఇచ్చిన సమాచారం*

మొత్తం రాబడిలో శాతంగా చూసినప్పుడు సొంత రాబడి మిశ్రమ ఆకృతి ప్రదర్శించగా, కేటాయించిన నిధులు 5 నుండి 7 శాతం మధ్యన, గ్రాంటులు 56 నుండి 76 శాతం మధ్యన మారుతున్నాయి.

పంచాయతీరాజ్ సంస్థలు 2009-13[6] సంవత్సరాల మధ్య చేసిన ఖర్చుల వివరాలు ఈ దిగువ పట్టిక 1.2లో ఉన్నాయి.

---

1 ఇంటిపన్ను, వ్యాపార ప్రకటనల పన్ను, నీటి పన్ను మొదలైనవి

2 దుకాణాల అద్దెలు, వేలం రుసుములు మొదలైనవి

3 విరాళాలుగా వచ్చినవి, డిపాజిట్లపై వడ్డీ మొదలైనవి

4 సీనరేజీ రుసుము, స్టాంపు సుంకంపై సర్ఛార్జిలను గనులశాఖ, స్టాంపులు-రిజిస్ట్రేషన్ల శాఖ వసూలుచేసి స్థానిక సంస్థలకు ఈ రూపేణా అందచేస్తాయి

5 వెనుకబడిన ప్రాంతాల గ్రాంటు నిధి

6 2008-09 వివరాలను ఆ శాఖ అందచేయలేదు

**పట్టిక 1.2**

(₹ కోట్లలో)

| క్రమ సంఖ్య | వ్యయం తరహా | 2009-10 | 2010-11 | 2011-12 | 2012-13 |
|---|---|---|---|---|---|
| 1 | రెవెన్యూ వ్యయం | 3054.78 | 3314.82 | 2968.77 | 1405.49 |
| 2 | క్యాపిటల్ వ్యయం | 1648.92 | 1545.84 | 1464.15 | 1033.47 |
| | మొత్తం | 4703.70 | 4860.66 | 4432.92 | 2438.96 |

*మూలం: పంచాయతీరాజ్ శాఖ కమిషనరు ఇచ్చిన సమాచారం*

రెవెన్యూ, క్యాపిటల్ వ్యయం రెండూ 2012-13 సంవత్సరంలో గణనీయంగా తగ్గిపోవటం పైపట్టిక చూస్తే తెలుస్తుంది. ఇందుకు కారణాలను మాత్రం ఎన్నిసార్లు అడిగినా ఆడిట్‌కు వివరించలేదు.

పట్టణ స్థానిక సంస్థల రాబడులు 2008-13 సంవత్సరాలలో ఈ కింది విధంగా ఉన్నాయి :

**పట్టిక 1.3**

(₹ కోట్లలో)

| క్రమ సంఖ్య | రాబడులు | 2008-09 | 2009-10 | 2010-11 | 2011-12 | 2012-13 |
|---|---|---|---|---|---|---|
| పట్టణ స్థానిక సంస్థలు | | | | | | |
| 1 | సొంత రాబడి | 2039.96 | 1809.72 | 2013.74 | 2297.17 | 2898.52 |
| 2 | కేటాయించిన రాబడి | 442.62 | 377.8 | 684.00 | 795.70 | 819.28 |
| 3 | రాష్ట్ర ప్రభుత్వ గ్రాంటులు | 313.60 | 350.00 | 430.00 | 608.00 | 921.00 |
| 4 | కేంద్ర ప్రభుత్వ గ్రాంటులు | | | | | |
| | పథకాల నిధులు | 998.92 | 1093.40 | 734.27 | 704.24 | 378.36 |
| | పన్నెండు, పదమూడవ ఆర్థిక సంఘాలు | 74.80 | 74.80 | 177.78 | 111.85 | శూన్యం |
| 5 | ఇతర రాబడులు | శూన్యం | శూన్యం | శూన్యం | శూన్యం | శూన్యం |
| | మొత్తం | 3869.90 | 3705.72 | 4039.79 | 4516.96 | 5017.16 |

*మూలం: మునిసిపల్ పరిపాలన శాఖ కమిషనరు మరియు డైరెక్టరు ఇచ్చిన సమాచారం*

ఈ సంస్థల సొంత ఆదాయం 2009-10 నుండి ఏటికేడాది పెరుగుతున్నా, మొత్తం రాబడిలో శాతంగా చూసినప్పుడు ఇది పతన ధోరణి కనబరుస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వ గ్రాంటులు మాత్రం 2009-13 సంవత్సరాల నడుమ క్రమంగా పెరిగాయి. ఎన్నికలు నిర్వహించని కారణంగా, 2012-13లో పదమూడవ ఆర్థిక సంఘం గ్రాంట్లు రాలేదని ప్రభుత్వం చెప్పింది.

పట్టణ స్థానిక సంస్థలు 2008-13 మధ్యకాలంలో చేసిన వ్యయం వివరాలు ఈ దిగువ పట్టిక 1.4లో ఉన్నాయి.

**పట్టిక 1.4**

(₹ కోట్లలో)

| క్రమ సంఖ్య | వ్యయం తరహా | 2008-09 | 2009-10 | 2010-11 | 2011-12 | 2012-13 |
|---|---|---|---|---|---|---|
| 1 | రెవెన్యూ వ్యయం | 2165.16 | 2181.79 | 2621.40 | 2941.85 | 3153.33 |
| 2 | క్యాపిటల్ వ్యయం | 1762.68 | 1313.38 | 1399.83 | 1253.08 | 1166.59 |
| | మొత్తం | 3927.84 | 3495.17 | 4021.23 | 4194.93 | 4319.92 |

*మూలం: మునిసిపల్ పరిపాలన కమిషనరు మరియు డైరెక్టరు ఇచ్చిన సమాచారం*

రెవెన్యూ వ్యయం 2008-13 సంవత్సరాల నడుమ క్రమంగా పెరుగుతుండగా, క్యాపిటల్ వ్యయం 2010-13 మధ్య క్రమంగా తగ్గిపోతూ ఆస్తుల కల్పనలో క్షీణతను సూచిస్తోంది.

## 1.2 నిధులు, విధుల బదిలీ

పంచాయతీరాజ్ సంస్థలను బలోపేతం చేసేందుకుగాను 73వ రాజ్యాంగ సవరణ చట్టం-1992లోని పదకొండవ షెడ్యూలు 29 అంశాలను ఈ సంస్థలకు సంక్రమింపచేయాలని నిర్దేశించింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2007-08లో పది[7] అంశాలను పంచాయతీరాజ్ సంస్థలకు బదిలీ చేసింది. ఆ తర్వాత మిగతా అంశాలను బదిలీ చేసేందుకు మాత్రం చొరవ చూపలేదు. ఇలా బదిలీ అయిన విధులకు సంబంధించిన నిధులను సంబంధిత శాఖల ద్వారానే ఇస్తున్నారు. పంచాయతీరాజ్ సంస్థలకు 2011-12[8] సంవత్సరంలో వ్యవసాయం, పశు సంవర్ధక, మత్స్య శాఖల నుంచి అన్ని జిల్లాలలోనూ నిధులు లభించగా బీసీ, సాంఘిక సంక్షేమ శాఖల నిధులు మాత్రం మూడు జిల్లాలలోని సంస్థలకు మాత్రమే అందాయి. విధులవారీగానూ, జిల్లాలవారీగానూ వచ్చిన నిధుల వివరాలు ***అనుబంధం-1.1***లో ఉన్నాయి.

రాజ్యాంగంలోని పన్నెండో షెడ్యూలులో పేర్కొన్న విధంగా పట్టణ స్థానిక సంస్థలకు బదిలీ చేయటంకోసం 74వ రాజ్యాంగ సవరణ చట్టం 1992లో 18 అంశాలను గుర్తించారు. '***అగ్నిమాపక సేవలు***' తప్ప పన్నెండవ షెడ్యూలులో చెప్పిన అన్ని అంశాలనూ రాష్ట్రంలోని పట్టణ స్థానిక సంస్థలకు బదిలీ చేశారు.

## 1.3 పద్దుల నిర్వహణ

పంచాయతీరాజ్ సంస్థలలో పద్దులను నగదు ప్రాతిపదికన నిర్వహిస్తారు. భారత కంప్ట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్‌ను (సీఏజీ) సంప్రదించి కేంద్ర ప్రభుత్వం పద్దుల నమూనా రూపొందించింది. నేషనల్ ఇన్ఫర్మాటిక్స్ సెంటర్ (ఎన్ఐసీ) రూపొందించిన పంచాయతీరాజ్ ఇన్‌స్టిట్యూషన్ అకౌంటింగ్ సాఫ్ట్‌వేర్ (ప్రియాసాఫ్ట్) ఉపయోగించి పద్దులను ఈ నమూనాలో నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం 2010 సెప్టెంబరులో ఆదేశించింది. మూడంచెలలో ఉన్న పంచాయతీరాజ్ సంస్థలన్నీ తమ పద్దులను ప్రియాసాఫ్ట్ ద్వారా ఆన్‌లైన్‌లో నిర్వహించేందుకు వీలుగా నిపుణులను సమకూర్చారు. అయితే, 2013 నవంబరు నాటికి మొత్తం 22 జిల్లా ప్రజా పరిషత్తులలో ఎనిమిదింట (36 శాతం), 1,096[9] మండల ప్రజాపరిషత్తులలో 438 చోట్ల (40 శాతం) అలాగే 21,590[10] గ్రామ పంచాయతీలకుగాను 1,494 గ్రామాలలో (7 శాతం) మాత్రమే ఆన్‌లైన్ పద్దుల నిర్వహణ పూర్తిచేశారు. తాజా పరిస్థితి గురించి పంచాయతీ రాజ్, గ్రామీణ ఉపాధి శాఖను పలుమార్లు కోరినా ఆ వివరాలు అందచేయ లేదు.

ప్రియాసాఫ్ట్ ఉపయోగిస్తున్న కొన్ని పంచాయతీరాజ్ సంస్థలను 2012-13లో మచ్చుకు తనిఖీ చేయగా (రెండు జడ్‌పీపీలు, మూడు ఎమ్‌పీపీలు[11], 100 గ్రామపంచాయతీలు) ఇక్కడ ప్రియాసాఫ్ట్ ద్వారా రూపొందించిన పద్దులకూ సాంప్రదాయ పద్ధతిన రాసిన పద్దులకూ వ్యత్యాసాలున్నట్టు తెలిసింది. అంతేకాకుండా, ప్రామాణికమైన ఎనిమిది నమూనాలకుగాను మూడింటిని మాత్రమే ప్రియాసాఫ్ట్‌ద్వారా ఉపయోగిస్తున్నారు. ఎక్రూవల్ అకౌంటింగ్‌కు సంబంధించిన మిగతా నమూనాలు ఇంకా ఖరారు కావలసి ఉంది. ఆవిధంగా ప్రియాసాఫ్ట్ పద్దుల విధానం ఆశించిన స్థాయిలో అమలు కావటంలేదు.

---

[7] (i) వ్యవసాయం, వ్యవసాయ విస్తరణ (ii) పశు సంవర్ధక, కోళ్ళ పెంపకం (iii) మత్స్య (iv) గ్రామీణాభివృద్ధి (v) తాగునీరు, పారిశుధ్యం (vi) ప్రాథమిక, మాధ్యమిక, వయోజన విద్య (vii) ఆరోగ్యం, పారిశుధ్యం పీహెచ్‌సీ, వైద్యశాలలు, కుటుంబ సంక్షేమం (viii) సాంఘిక సంక్షేమం (ix) వెనుకబడిన తరగతుల సంక్షేమం (x) స్త్రీ-శిశు సంక్షేమం

[8] 2012-13 సంవత్సరం వివరాలు సీపీఆర్ అండ్ ఆర్ఈ ఇవ్వలేదు

[9] 2013 నవంబరు నాటికి ఉన్న యూనిట్లు

[10] 2013 నవంబరు నాటికి ఉన్న యూనిట్లు

[11] అనంతపురం, నల్గొండ జడ్‌పీపీలు, ముద్దనూరు, పటాన్‌చెరు, హయత్‌నగర్ ఎమ్‌పీడీఓలు

ఇక పట్టణ స్థానిక సంస్థల విషయానికొస్తే, కేంద్ర ప్రభుత్వం సీఏజీని సంప్రతించి 2004 డిసెంబరులో నేషనల్ మునిసిపల్ ఎకౌంట్స్ మాన్యువల్ (ఎన్ఎమ్ఏఎమ్)ను జంట పద్దు విధానంలో రూపొందించింది. పద్దులలో మరింత పారదర్శకత, ఆర్థికాంశాలపై అదుపు సాధించే లక్ష్యంతో రూపుదిద్దిన ఈ విధానాన్ని ఆయా రాష్ట్రాలు తమతమ అవసరాలకు అనుగుణంగా మార్పులు చేసి ఉపయోగించుకోమని రాష్ట్రాలను కోరింది (2005 మే). ఆ మేరకు రాష్ట్ర ప్రభుత్వం 2005 మే నెలలోనే ఒక సారథ్య సంఘాన్ని (స్టీరింగ్ కమిటీ) ఏర్పాటుచేసి, 2006-07 సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ మునిసిపల్ ఎకౌంట్స్ మాన్యువల్ (ఏపీఎమ్ఏఎమ్)ను రూపొందించింది. దీనిని రాష్ట్రంలోని అన్ని పట్టణ స్థానిక సంస్థలూ అనుసరించాలని 2007 ఆగస్టులో ఆదేశాలు జారీ చేసింది. అదే విధంగా, ఆంధ్రప్రదేశ్ మునిసిపల్ బడ్జెట్ మాన్యువల్, ఆంధ్రప్రదేశ్ మునిసిపల్ ఎస్టేట్ మాన్యువల్ వంటి మిగతా మాన్యువల్స్ కూడా అమలు చేయమని చెప్పింది (2007 ఆగస్టు). అన్ని పట్టణ స్థానిక సంస్థలలో జంట పద్దు విధానం అనుసరిస్తున్నప్పటికీ, 2012-13 సంవత్సరంలో నమూనా ప్రాతిపదికన మచ్చుకు తనిఖీ చేసిన 34 మునిసిపాలిటీలలో పద్దుల నిర్వహణకు సంబంధించి ఈ కింద వివరించిన విధంగా పలు ప్రధాన లోటుపాట్లు కనిపించాయి.

i. ఆర్థిక నివేదికలకు అనుబంధంగా నగదు పుస్తకం, ఆస్తుల రిజిస్టరు, డిమాండు వసూళ్ళు బకాయిల (డీసీబీ) రిజిస్టరు, అడ్వాన్సుల రిజిస్టరు, పెట్టుబడుల రిజిస్టరు మొదలైన రికార్డులు ఈ 34 సంస్థలలోనూ లేవు.

ii. ఆస్తిపన్ను, ఖాళీ స్థలాలపై పన్ను, ప్రకటనల రుసుము, నీటి రుసుముల విషయంలో విడికాగితాలపై రాసిన వివరాలకూ రాబడి-చెల్లింపుల ఖాతాకు మధ్యన అంకెలలో వ్యత్యాసాలున్నాయి.

ఈ పొరపాట్లను మునిసిపల్ పరిపాలన కమీషనర్ మరియు డైరెక్టర్ (సీడీఎమ్ఏ) కార్యాలయానికీ, రాష్ట్ర తనిఖీ శాఖ డైరెక్టరుకూ 2013 మార్చి నెలలో తెలియ చేయటం జరిగింది. వారి నుంచి సమాధానాలు రావలసి ఉంది (2014 మే).

## 1.4 ఆడిట్ నిబంధన

### 1.4.1 చట్టబద్ధమైన తనిఖీ

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తనిఖీ చట్టం, 1989 ప్రకారం రాష్ట్ర తనిఖీ శాఖ డైరెక్టరు (డీఎస్ఏ) రాష్ట్రంలోని పంచాయతీ రాజ్ సంస్థలకు, పట్టణ స్థానిక సంస్థలకు చట్టబద్ధమైన తనిఖీదారు. ఈయన ఆర్థిక శాఖ నియంత్రణలో పనిచేస్తారు. ఈ చట్టంలోని సెక్షను 11(2) ప్రకారం వీరు సమగ్ర తనిఖీ నివేదికను, సమీక్షా నివేదికను రూపొందించి రాష్ట్ర శాసనసభ ముందుంచాలి. ఈ శాఖకు ఆరు ప్రాంతీయ కార్యాలయాలు, 22 జిల్లా కార్యాలయాలు, పలు ఉపకార్యాలయాలు, స్థానిక కార్యాలయాలు ఉన్నాయి. అన్ని పంచాయతీరాజ్ సంస్థలు, పట్టణ స్థానిక సంస్థలను ఈ శాఖ ప్రతిఏటా తనిఖీ చేయవలసి ఉంటుంది.

#### *1.4.1.1 తనిఖీ బకాయిలు*

నిధులను నిర్దిష్ట ప్రయోజనాలకే వినియోగించారన్న నమ్మకం పద్దుల తనిఖీ వల్లనే కలుగుతుంది. అయితే, పద్దులు ఇంకా ఖరారుకాని కారణంగా పట్టణ స్థానిక సంస్థలకు చెందిన 59 వార్షిక పద్దుల తనిఖీ బకాయి ఉన్నట్టు ఆడిట్ శాఖ ఇచ్చిన (2013 మే) సమాచారం వలన తెలిసింది. ఇక గ్రామపంచాయతీల విషయానికొస్తే, 2013 మే నాటికి 3,510 పద్దుల ఆడిట్ ఇంకా చేయవలసిఉంది. ఇలా గ్రామపంచాయతీల తనిఖీలు పేరుకుపోవటానికి కారణాలేవీ ఆశాఖ పేర్కొనలేదు.

#### *1.4.1.2 సమగ్ర తనిఖీ నివేదికలు, సమీక్షా నివేదికలు సమర్పించటం*

సమగ్ర తనిఖీ నివేదికనూ, సమీక్షా నివేదికలను 2010-11 సంవత్సరం వరకూ రూపొందించి ఆర్థికశాఖకు పంపించగా ప్రభుత్వం వాటిని 2014 ఫిబ్రవరిలో రాష్ట్ర శాసనసభ ముందుంచింది. గ్రాంటులను పరిమితిమీరి

వినియోగించటం, కొన్నిచోట్ల అసలే వినియోగించుకోకపోవటం, ఇతర అవసరాలకు మళ్ళించటం, దుర్వినియోగం చేయటం, రావలసిన బకాయిలు వసూలు చేసుకొనకపోవటం, అడ్వాన్సులు సర్దుబాటుకాకపోవటం, నియమాల అతిక్రమణ, వృధావ్యయం వంటి పలు అంశాలు ఈ నివేదికలలో చోటుచేసుకున్నాయి.

#### *1.4.1.3 సర్చార్జి సర్టిఫికెట్ల జారీ*

స్థానిక సంస్థలకు ఏదైనా నష్టం కలిగించిన వ్యక్తులమీద డీఎస్ఏ ఈ చట్టంలోని సెక్షన్ 10 అనుసరించి సర్చార్జి చర్యలు చేపడతారు. ఆయా సంస్థల కార్యనిర్వాహక అధికారులు సర్చార్జి మొత్తాలను సంబంధిత వ్యక్తులనుంచి రెవెన్యూ రికవరీ చట్టం కింద వసూలు చేయాల్సి ఉంటుంది. ఆవిధంగా, 2013 మార్చి నాటికి మొత్తం 2,460 కేసులలో సర్చార్జి సర్టిఫికెట్లు జారీ చేశారు. ఇందుకు సంబంధించిన మొత్తం ₹2.37 కోట్లు[12] వసూలు కాలేదు.

### 1.4.2 సీఏజీ తనిఖీ

సీఏజీ (డీపీసీ) చట్టం, 1971లోని సెక్షన్ 14 కింద అన్ని పంచాయతీరాజ్ సంస్థలనూ, పట్టణ స్థానిక సంస్థలనూ సీఏజీ తనిఖీ చేస్తారు. పదకొండవ ఆర్థిక సంఘం సిఫార్సుల మేరకు స్థానిక సంస్థల పద్దులు, తనిఖీలకు సంబంధించి, సాంకేతిక నిర్దేశం, పర్యవేక్షణ (టీజీఎస్) సమకూర్చే బాధ్యతను సీఏజీ (డీపీసీ) చట్టంలోని సెక్షను 20(1) కింద రాష్ట్ర ప్రభుత్వం అప్పగించింది (2004 ఆగస్టు).

సీఏజీ నమూనా తనిఖీ మాత్రమే చేస్తారు. ప్రతి ఆర్థిక సంవత్సరం చివరన ఒక సమగ్ర నివేదికను (టీజీఎస్ నోట్) రాష్ట్ర తనిఖీ శాఖ డైరెక్టరుకు అందచేస్తారు. వారి నివేదికల నాణ్యతను ఇనుమడింప చేసుకునేందుకు ఇవి దోహదపడతాయి. ఆమేరకు 2012-13 సంవత్సరానికి టీజీఎస్ 2013 నవంబరులో అందజేశారు.

#### *1.4.2.1 ఆడిట్ ప్రణాళిక, నిర్వహణ*

ఒక ప్రభుత్వ శాఖ, స్థానిక సంస్థ, పథకం, కార్యక్రమం మొదలైనవాటిలో అక్రమాలు జరిగేందుకు ఏమేరకు అస్కారం ఉంటుందో అంచనావేయటంతో ఆడిట్ ప్రక్రియ మొదలవుతుంది. అవి చేసిన ఖర్చు, వాటి కార్యకలాపాల తీవ్రత, సంక్లిష్టత, ఈ కార్యకలాపాలకు ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యత, ఆర్థికపరమైన అధికారాల స్థాయి, అంతర్గత నియంత్రణలు, భాగస్వామ్య పక్షాల శ్రద్ధాసక్తులు మొదలైన పలు అంశాల ఆధారంగా ఈ అంచనా వేస్తారు. గత ఆడిట్‌లో కనుగొన్న విషయాలను కూడా ఈ సందర్భంగా పరిగణనలోకి తీసుకోవడం జరుగుతుంది. ఈ అంచనాల ఆధారంగా ఎంత కాలానికొకసారి ఆడిట్ చేయాలి, ఎంతమేరకు ఆడిట్ చేయాలనే విషయాలను నిర్ణయిస్తారు. ఇందుకోసం వార్షిక ఆడిట్ ప్రణాళికను రూపొందిస్తారు. ఆవిధంగా, 2012-13 సంవత్సరంలో, పంచాయతీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ అలాగే మునిసిపల్ పరిపాలన మరియు పట్టణాభివృద్ధి శాఖల కిందికి వచ్చే మొత్తం 265 స్థానిక సంస్థలలో పనితీరు తనిఖీ, నియమపాలన తనిఖీ చేపట్టటం జరిగింది.

#### *1.4.2.2 ఆడిట్ పరిశీలనలపై ప్రభుత్వ శాఖల స్పందన*

ఆడిట్ పూర్తయిన తర్వాత, ఆడిట్ పరిశీలనలతో కూడిన 'తనిఖీ నివేదికను' కార్యాలయ అధిపతికి అందచేసి నెలలోపు సమాధానాలు పంపవలసిందిగా అడగటం జరుగుతుంది. తనిఖీ నివేదికలలో పేర్కొన్న ఆడిట్ పరిశీలనలను సంబంధిత కార్యాలయ అధిపతి, ఆయన పై అధికారులు పరిశీలించి దిద్దుబాటు చర్యలు చేపట్టాలి. తనిఖీ నివేదికలలో ఉన్న ఆడిట్ పరిశీలనలపై జిల్లా స్థాయిలో ప్రభుత్వ శాఖాధికారులు మహాగణకాధికారి కార్యాలయ సభ్యులతో కూడా చర్చిస్తారు.

---

[12] మండల ప్రజాపరిషత్తులలోని 16 కేసులకు రావలసిన ₹0.03 కోటి, గ్రామపంచాయతీలలోని 2,444 కేసులకు రావలసిన ₹2.34 కోట్లు

ఈ కింద పట్టిక 1.5లో వివరించిన విధంగా, 2012-13 సంవత్సరం వరకు అందచేసిన 518 తనిఖీ నివేదికలు, అందలి 6,245 పేరాలు 2014 మార్చి 31 నాటికి పరిష్కారంగావలసి ఉన్నాయి. వీటిలో 133 తనిఖీ నివేదికలు, అందులోని 2,224 పేరాలకు తొలి సమాధానాలు కూడా రాలేదు.

**పట్టిక 1.5**

| సంవత్సరం | 2013 సెప్టెంబరు 30 నాటికి నివేదికలు, పేరాల సంఖ్య | | | | తొలి సమాధానం కూడా రాని నివేదికలు, పేరాలు | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | నివేదికలు | | పేరాలు | | నివేదికలు | | పేరాలు | |
| | పంచాయతీ రాజ్ సంస్థలు | పట్టణ స్థానిక సంస్థలు | పంచాయతీ రాజ్ సంస్థలు | పట్టణ స్థానిక సంస్థలు | పంచాయతీ రాజ్ సంస్థలు | పట్టణ స్థానిక సంస్థలు | పంచాయతీ రాజ్ సంస్థలు | పట్టణ స్థానిక సంస్థలు |
| 2008-09 వరకు | 181 | 82 | 1159 | 1577 | 19 | 5 | 152 | 113 |
| 2009-10 | 87 | 21 | 701 | 475 | 23 | 15 | 260 | 397 |
| 2010-11 | 87 | 14 | 677 | 408 | 40 | 14 | 412 | 408 |
| 2011-12 | 9 | 3 | 103 | 53 | 3 | 0 | 36 | 0 |
| 2012-13 | 0 | 34 | 0 | 1092 | 0 | 14 | 0 | 446 |
| మొత్తం | 364 | 154 | 2640 | 3605 | 85 | 48 | 860 | 1364 |

## 1.5 ఆర్థికాంశాల నివేదన

పంచాయతీరాజ్ సంస్థలు, పట్టణస్థానిక సంస్థలలో జవాబుదారీతనానికి ఆర్థికాంశాల నివేదన కీలకమవుతుంది. ఈ సంస్థలు నిధులను డ్రాచేయటం, బిల్లుల నమూనా, నిధులను ఖర్చు చేయటం, పద్దుల నిర్వహణ, నిధులను లెక్కచెప్పటంవంటి విషయాలలో ఆచరించవలసిన పద్ధతులను ఏపీపీఆర్ చట్టం-1994, హెచ్ఎమ్సీ చట్టం-1955, ఇంకా ప్రభుత్వం కాలానుగుణంగా రూపొందించిన నియమాలు, ఆంధ్రప్రదేశ్ ఖజానా నియమావళి, ఆర్థిక నియమావళి, ప్రజాపనుల పద్దుల నియమావళి, ప్రజాపనుల శాఖ నియమావళి, స్టోర్స్ నియమావళి, బడ్జెట్ నియమావళి, ఇంకా ఇతర నిబంధనావళులు, ఉత్తర్వులు నిర్దేశిస్తాయి.

పంచాయతీరాజ్ సంస్థలు, పట్టణ స్థానిక సంస్థల ఆర్థికపరమైన నివేదనకు సంబంధించి ముఖ్యాంశాలు ఈ కింది విధంగా ఉన్నాయి :

### 1.5.1 పంచాయతీరాజ్ సంస్థల డేటాబేస్ రూపకల్పన

పంచాయతీరాజ్ సంస్థల ఆర్థిక స్థితిగతులపై ఒక సమగ్ర సమాచారం (డేటాబేస్) రూపొందించటం కోసం రాష్ట్ర ప్రభుత్వం 2002-10 మధ్యకాలంలో మొత్తం ₹57.80 కోట్ల మేర[13] ఈఎఫ్సీ, టీఎఫ్సీ గ్రాంట్లను పంచాయతీరాజ్, గ్రామీణ ఉపాధి శాఖ కమిషనరుకు అందజేసింది. కమిషనరు ఈ మొత్తాన్ని రంగారెడ్డి జిల్లా ప్రజాపరిషత్ సీఈఓ వద్ద ఉంచారు. జిల్లా ప్రజాపరిషత్ ఈ మొత్తాన్ని వివిధ బ్యాంకులలో డిపాజిట్ చేసింది. తుదకు, కమిషనరు ఆదేశాలపై ₹67.37 కోట్లను (వడ్డీతో కలిపి) 2013 జనవరి, ఫిబ్రవరి నెలల్లో తిప్పిపంపింది. వీటిని వినియోగించక పోవటానికి తగిన కారణాలను కూడా పేర్కొనలేదు.

ఈ విషయం ఆడిట్లో ప్రస్తావించగా, ఈ నిధులను తిరిగి కాలపరిమితి డిపాజిట్లలోనూ, ఫ్లెక్సీ సేవింగ్స్ ఖాతాల్లోనూ పెట్టినట్లు కమిషనరు బదులిచ్చారు (2013 మార్చి). డేటాబేస్ నిర్మాణానికి ఈ మొత్తాన్ని ఖర్చు చేయకపోవటానికి కారణాలను మాత్రం వెల్లడించలేదు. ఆవిధంగా, కేంద్ర ప్రభుత్వం నిధులిచ్చినాగానీ, డేటాబేస్ సమకూరలేదు. పంచాయతీరాజ్ సంస్థల సమగ్ర ఆర్థిక స్వరూపం ఆవిష్కరించాలన్న లక్ష్యం 12 సంవత్సరాలకు పైగానే నెరవేరలేదు.

[13] పదకొండవ ఆర్థిక సంఘం గ్రాంటు ₹22.96 కోట్లు (2002-04), పన్నెండవ ఆర్థిక సంఘం గ్రాంటు ₹34.84 కోట్లు (2005-10)

### 1.5.2 ముగిసిన పథకాల మిగులు నిధులు బ్యాంకు ఖాతాలలోనే

రద్దయిన పథకాల మిగులు నిధులను ప్రభుత్వానికి అప్పగించాలని మార్గదర్శకాలు స్పష్టం చేస్తాయి. రద్దయిన పథకాలకు సంబంధించి వివిధ పట్టణ స్థానిక సంస్థలలో మిగిలి ఉన్న నిధులను ఆయా పథకాలకు సంబంధించిన రాష్ట్ర స్థాయి అధికారులు, సీడీఎమ్ఏ ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలి. కానీ, 34 పట్టణ స్థానిక సంస్థల రికార్డులు పరిశీలించగా 10 సంస్థలలో 2014 మార్చినాటికి మొత్తం ₹6.55 కోట్లు ***అనుబంధం-1.2***లో వివరించిన విధంగా నిరుపయోగంగా ఉన్నాయి. ఈ పథకాలు రద్దయినాగానీ మిగులు నిధులను ప్రభుత్వ ఖాతాకు జమచేయటంలో అధికారులు చొరవచూపలేదు.

### 1.5.3 సర్దుబాటు కాని అడ్వాన్సులు

ఆంధ్రప్రదేశ్ ఫైనాన్షియల్ కోడ్-1 ప్రకారం అడ్వాన్సులను జాప్యం లేకుండా సర్దుబాటు చేయాలి. సంబంధిత డ్రాయింగ్-డిస్బర్సింగ్ అధికారులు సైతం వీటిపై దృష్టిపెట్టాలి. అయితే, 2012-13 సంవత్సరంలో మచ్చుకు తనిఖీ చేసిన 34 పట్టణ స్థానిక సంస్థలకుగాను 20 సంస్థలలో సిబ్బందికి అడ్వాన్సుల రూపంలో ఇచ్చిన మొత్తం ₹3.43 కోట్లు 2014 మార్చి నాటికి సర్దుబాటు కావలసి ఉన్నాయి. ఈ అడ్వాన్సులు 1984-2013 సంవత్సరాల మధ్య ఇచ్చినవి. వీటి వివరాలు ***అనుబంధం-1.3***లో ఉన్నాయి.

### 1.5.4 వినియోగ ధృవపత్రాలు

వివిధ రకాల గ్రాంటులు పొందిన వారినుంచి వినియోగ ధృవపత్రాలు తెప్పించుకుని, పరిశీలించినమీదట శాఖాధికారులు వాటిని కేంద్ర ప్రభుత్వంలోని పంచాయితీరాజ్ మంత్రిత్వ శాఖకు పంపించాలని కేంద్ర ప్రాయోజిత పథకాల మార్గదర్శకాలు స్పష్టం చేస్తున్నాయి. అయితే, 2012-13 సంవత్సరంలో నమూనా తనిఖీ చేసిన 34 పట్టణ స్థానిక సంస్థలకుగాను ఆరు సంస్థలలో పలు పథకాలకు సంబంధించి ₹30.01 కోట్ల మొత్తానికి వినియోగ ధృవపత్రాలు రావలసి ఉన్నది. ఇవి 2005-13 సంవత్సరాలకు సంబంధించినవి. డ్రాయింగ్ అధికారులు, శాఖాధిపతుల పర్యవేక్షణలోపాన్ని ఇది సూచిస్తుంది.

### 1.5.5 నిధుల దుర్వినియోగం కేసులు

అధికారులు ప్రభుత్వపు సొమ్ము పట్ల వ్యవహరించ వలసిన విధానం, ప్రభుత్వానికి నష్టం వాటిల్లినప్పుడు అందుకు బాధ్యులను గుర్తించే వైనం, రికవరీకి అనుసరించవలసిన పద్ధతులను ఆంధ్రప్రదేశ్ ఫైనాన్షియల్ కోడ్‌లో విపులీకరించారు. ఆయా శాఖలలో నిధుల దుర్వినియోగం కేసులను నెలకోమారు ప్రభుత్వ కార్యదర్శి పరిశీలించాలనీ, ప్రధాన కార్యదర్శి వీటిని ఆరు నెలలకొకసారి కార్యదర్శులతో సమీక్షించాలనీ ప్రభుత్వం 2004 ఫిబ్రవరిలో ఆదేశాలు జారీ చేసింది.

రాష్ట్ర తనిఖీ శాఖ డైరెక్టరు 2008-09, 2010-11 సంవత్సరాల మధ్య వివిధ పంచాయతీరాజ్ సంస్థలలో గుర్తించిన దుర్వినియోగం కేసులు 2014 మార్చి చివరి నాటికి పరిష్కారం కాకుండా ఉన్నవి ఈ దిగువ పట్టిక 1.6లో ఇవ్వటం జరిగింది (2011-12, 2012-13 సంవత్సరాల వివరాలు అందలేదు).

**పట్టిక 1.6**

(₹ కోట్లలో)

| సంస్థలు | కేసుల సంఖ్య | ఇమిడిఉన్న మొత్తం | కేసుల సంఖ్య | ఇమిడిఉన్న మొత్తం | కేసుల సంఖ్య | ఇమిడిఉన్న మొత్తం |
|---|---|---|---|---|---|---|
| | **2008-09** | | **2009-10** | | **2010-11** | |
| జిల్లా ప్రజాపరిషత్తులు | 12 | 1.17 | 2 | 0.01 | 0 | 0 |
| మండల ప్రజాపరిషత్తులు | 32 | 0.04 | 140 | 0.41 | 108 | 0.31 |
| గ్రామ పంచాయతీలు | 288 | 0.78 | 448 | 1.13 | 672 | 2.09 |
| మొత్తం | **332** | **1.99** | **590** | **1.55** | **780** | **2.40** |

ఈ విషయమై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవలసి ఉంది.

### 1.5.6 స్టోర్సు, స్టాకుల ప్రత్యక్ష తనిఖీ

ఆంధ్రప్రదేశ్ ఫైనాన్స్‌కోడ్ మొదటి సంపుటంలోని 143 వ నిబంధన ప్రకారం కార్యాలయంలోని వస్తుసామగ్రిని ఏటా మార్చి నెలాఖరున కార్యాలయం అధిపతి ప్రత్యక్షంగా తనిఖీ చేసి స్టాకు రిజిస్టరులో వివరాలు నమోదు చేయాలి. అయితే, 2012-13 సంవత్సరంలో 34 పట్టణ స్థానిక సంస్థల రికార్డులు పరిశీలించగా వీటిలోని 20 సంస్థలలో (59 శాతం) స్టాకు తనిఖీ జరగటంలేదని తెలిసింది.

### 1.5.7 పద్దులను ట్రెజరీ లెక్కలతో సరిచూసుకొనకపోవటం

ఆంధ్రప్రదేశ్ బడ్జెట్ నిబంధనావళిలోని పేరా 19.6 ప్రకారం డ్రాయింగ్ అధికారులు ప్రతినెలా తమ శాఖలోని రాబడులను, ఖర్చులను ఖజానాలో నమోదైన అంకెలతో సరిచూసుకుని మోసపూరిత లావాదేవీలను, వర్గీకరణ దోషాలను నివారించుకోవాలి. అయితే, 2012-13 సంవత్సరంలో 34 పట్టణ స్థానిక సంస్థల రికార్డులు పరిశీలించగా 20 చోట్ల (59 శాతం) పద్దుల రికన్సిలియేషన్ రెండు మూడేళ్ళుగా జరగటంలేదని తెలిసింది.

### 1.5.8 పద్దులు ఖరారు కాకపోవటం

ఆంధ్రప్రదేశ్ మున్సిపాలిటీల (పద్దులు, సంగ్రహాల రూపకల్పన, సమర్పణ) చట్టం-1970 లోని నాలుగవ నిబంధన ప్రకారం పట్టణ స్థానిక సంస్థలు ప్రతి సంవత్సరం తమ పద్దులను రూపొందించి, జూన్ 15 లోగా ఒక కాపీని ఆడిటర్‌కు పంపాలి. అయితే, కొన్ని పట్టణ స్థానిక సంస్థలు రెండు దశాబ్దాలకుపైగా[14] తమ పద్దులు రూపొందించలేదు ***(అనుబంధం-1.4)***.

## 1.6 ముగింపు

ఆవిధంగా, 73వ రాజ్యాంగ సవరణ చట్టం-1992లోని పదకొండవ షెడ్యూలు 29 అంశాలను పంచాయతీ రాజ్ సంస్థలకు సంక్రమింపచేయాలని నిర్దేశించగా, రాష్ట్ర ప్రభుత్వం పది అంశాలను మాత్రమే బదిలీ చేసింది. ప్రియాసాఫ్ట్ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన నమూనా పద్దుల విధానాన్ని ఇంకా పలు గ్రామ పంచాయతీలలో అమలు చేయటంలేదు. పంచాయతీరాజ్ సంస్థల ఆర్థిక స్థితిగతులపై ఒక సమగ్ర సమాచారం (డేటాబేస్) రూపొందించటం కోసం అవసరమైన నిధులను విడుదల చేసి 12 సంవత్సరాలు గడిచినా ఆ లక్ష్యం నెరవేరలేదు.

ఇక పట్టణ స్థానిక సంస్థల విషయానికొస్తే, పద్దుల రూపకల్పనలోని జాప్యం వలన ఆడిట్ శాఖ తనిఖీ కూడా ఆలస్యమవుతున్నది. అంతేకాక, 2012-13 సంవత్సరంలో నమూనా తనిఖీ చేపట్టిన పట్టణ స్థానిక సంస్థలలో ఆర్థికాంశాల నివేదన అసమగ్రంగా ఉన్నది. రద్దయిన పథకాల తాలూకు మిగులు నిధులను జమ చేయకపోవటం, వినియోగ ధృవపత్రాలను పంపించకపోవటం, అడ్వాన్సులను సర్దుబాటు చేయకపోవటం, పద్దులు ఖరారు చేయక పోవటం, వస్తుసామగ్రి ప్రత్యక్ష తనిఖీ నిర్వహించక పోవటం, పద్దులను ఖజానా లెక్కలతో సరిచూసుకొనకపోవటం వంటివి ఇందుకు నిదర్శన.

[14] హైదరాబాద్ మహానగరపాలక సంస్థవి 21 సంవత్సరాల పద్దులు; గుంటూరు మునిసిపాలిటీవి 28 సంవత్సరాల పద్దులు

# అధ్యాయం-2

## ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజనపై ఆడిట్ సమీక్ష

### పంచాయతీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ

పేజీలు 9 - 29

## 2.1 పరిచయం

ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన (పీఎమ్‌జీఎస్‌వై) అనే పథకాన్ని నూరు శాతం కేంద్ర నిధులతో 2000 డిసెంబరులో ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాలలో అన్ని ఋతువులకు అనువైన రహదారి వ్యవస్థను సమకూర్చటం దీని ఉద్దేశం. ఒకదానికొకటి అనుసంధానంకాని పల్లె ప్రాంతాలలో 1,000 పైబడిన జనాభా కలిగిన వాటన్నిటికీ 2003 సంవత్సరంలోగా రోడ్డు వసతి కల్పించాలనీ, అదేవిధంగా 500 మందికి మించి ఉన్న ఆవాసాలను కూడా 2007 సంవత్సరం నాటికి దీని పరిధిలోకి తీసుకురావాలనీ లక్ష్యంగా పెట్టుకున్నారు. ఒక జిల్లాలో ఈ అర్హత కలిగిన అన్ని గ్రామాలకూ ఇప్పటికే రోడ్లు అమరి ఉన్న పక్షంలో వాటిని మెరుగుపరచు కునేందుకూ ఈ కార్యక్రమం కింద వెసులుబాటు కల్పించారు. ఆంధ్రప్రదేశ్‌లో ఈ కార్యక్రమాన్ని 2000 డిసెంబరు నుంచి 2013 మార్చివరకు పది విడతలుగా అమలు చేశారు.

## 2.2 వ్యవస్థాగత నిర్మాణం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామీణ రహదారుల అభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఆర్ఆర్‌డీఏ) పేరుతో ఒక స్వయంపాలక సంస్థను 2003 మార్చి నెలలో ఏర్పాటు చేశారు. పీఎమ్‌జీఎస్‌వై సంబంధిత సాంకేతిక విశిష్టతలు, ప్రాజెక్టు నివేదన, ఆర్థిక విషయాల నిర్వహణ వంటి అంశాలపై ఇది ప్రభుత్వానికి సూచనలిస్తుంది. పంచాయతీరాజ్ శాఖమంత్రి ఈ సంస్థకు ఛైర్మన్‌గానూ, పంచాయతీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి వైస్ ఛైర్మన్‌గానూ ఉంటారు. ఇక పీఎమ్‌జీఎస్‌వై కార్యక్రమ అమలు అధికారి/ఎంపవర్డ్ ఆఫీసర్‌గా ఇంజనీర్ ఇన్ చీఫ్ (ఈఎన్‌సీ) బాధ్యత వహిస్తారు. పర్యవేక్షక ఇంజనీర్లు, కార్యనిర్వాహక ఇంజనీర్లు కూడా కార్యక్రమం అమలు చేయటంలో ఈఎన్‌సీకి సహాయపడతారు.

## 2.3 ఆడిట్ విధివిధానాలు

### 2.3.1 ఆడిట్ లక్ష్యాలు

ఈ కింది విషయాలను నిర్ధారించుకోవటం కోసం ఈ 'ఆడిట్ పరిశీలన' చేపట్టటం జరిగింది:

- జిల్లా గ్రామీణ రోడ్ల ప్రణాళిక, అంతర్గత రహదార్ల సమాహారం కోసం రూపొందించిన ఆపరేషన్స్ మాన్యువల్ ప్రకారమే రోడ్ల నిర్మాణానికి తగు వ్యూహరచన చేశారా;
- ఈ కార్యక్రమాన్ని అమలు చేయటానికి అవసరమైన నిధులను సమకూర్చి వాటిని కార్యసాధకంగా వినియోగించారా;
- కార్యక్రమ అమలు అన్ని దశలలోనూ టెండరు ప్రక్రియ, కాంట్రాక్టుల నిర్వహణ కోసం ఆర్థిక ఔచిత్యపరమైన సిద్ధాంతాలు, పారదర్శకతలను పాటించారా;
- భారతీయ రోడ్ కాంగ్రెస్ నిర్దేశించిన ప్రమాణాలలో రోడ్ల నిర్మాణం చేపట్టి, అదనపు వ్యయానికి తావివ్వకుండా, గడువులోపు పనులను పూర్తి చేశారా;
- రోడ్డు నిర్వహణ కాంట్రాక్టులను పటిష్టంగా అమలుపరచి, రాష్ట్ర ప్రభుత్వం వీటి నిర్వహణకు కావలసిన నిధులనూ, అధికారాలనూ జిల్లా పంచాయతీలకు బదిలీ చేసిందా;
- మూడంచెలలో నాణ్యతా నియంత్రణ వ్యవస్థ, పర్యవేక్షణ యంత్రాంగం ఆశించినంత కట్టుదిట్టంగా పనిచేస్తున్నాయా.

### 2.3.2 ఆడిట్ ప్రామాణికంగా తీసుకున్న అంశాలు

ఆడిట్ గమనించిన విషయాలను ఈ కింది ప్రామాణికాంశాలతో సరిపోల్చుకోవటం జరిగింది:

- ఆయా సంవత్సరాలలో రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్ కేటాయింపులు;
- కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలు, ఇంకా పీఎమ్‌జీఎస్‌వై ఆపరేషన్స్ మాన్యువల్;
- గ్రామీణ రహదారుల మాన్యువల్, ఇంకా ఐఆర్‌సీ స్పెసిఫికేషన్లు;
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలానుగుణంగా జారీ చేసిన ఉత్తర్వులు, మార్గదర్శకాలు, ఆదేశాలు;
- జిల్లా గ్రామీణ రహదారుల ప్రణాళిక, అంతర్గత సమాహారం (కోర్ నెట్‌వర్క్), విస్తృత రహదార్ల ప్రాధాన్యత జాబితా (సీఎన్‌సీపీఎల్), విస్తృత రహదార్ల అభివృద్ధి ప్రాధాన్యత జాబితా (సీయూపీఎల్);
- ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ వర్క్స్ కోడ్;
- ఆంధ్రప్రదేశ్ ఫైనాన్షియల్ కోడ్ (ఆర్థిక నియమావళి).

### 2.3.3 ఆడిట్ పరిధి, ఆడిట్ పద్ధతి

పీఎమ్‌జీఎస్‌వై కార్యక్రమం మీద ఆడిట్ పరిశీలన 2013 మే-జూలై నెలల మధ్యన చేపట్టి, 2008-13 సంవత్సరాలలో ఆమోదించిన రోడ్డు నిర్మాణ పనులను ఇందులో సమీక్షించటం జరిగింది. ఇందులో భాగంగా సచివాలయంలోని పంచాయతీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ దస్త్రాలనూ, ఇంకా ఈఎన్‌సీ కార్యాలయం, పదకొండు[1] చోట్ల కార్యక్రమ అమలు యూనిట్లలోని (పీఐయూ) రికార్డులు పరిశీలించటం జరిగింది. పంచాయతీ రాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శితో 2013 ఏప్రిల్ నెలలో సమీక్షారంభ సమావేశం నిర్వహించి ఆడిట్ పరిధి, లక్ష్యాలు, ఆడిట్ విధివిధానాలను వివరించి, నిర్మాణాల ఉమ్మడి ప్రత్యక్ష పరిశీలన చేయనున్న విషయం కూడా చెప్పి వారి సహకారం అపేక్షించటం జరిగింది. తదుపరి 2014 మార్చి నెలలో సమీక్షానంతర సమావేశం నిర్వహించి, అంతవరకూ ఆడిట్ చేసిన పరిశీలనలను చర్చించి ఆపై ప్రభుత్వం ఇచ్చిన సమాధానాలను ఈ నివేదికలో అనువైనచోట పొందుపరచటం జరిగింది.

### 2.3.4 ఆడిట్ నమూనా

ఆడిట్ పరిశీలన కోసం ఆదిలాబాద్, అనంతపురం, తూర్పు గోదావరి, గుంటూరు, ఖమ్మం, మెదక్, ప్రకాశం జిల్లాలలో మొత్తం 125 నిర్మాణ పనులను వర్గీకరణ ప్రాతిపదికన[2] ఎంపిక చేయటం జరిగింది. ఈ జిల్లాలతో పాటు రాష్ట్రంలో మూడుకోట్ల రూపాయలకుపైగా ఖర్చు చేసిన పనులన్నింటినీ (మొత్తంమీద ఆరు) పరిశీలన కోసం తీసుకోవటం జరిగింది. ఈ 131 పనులమీద అయిన వ్యయం 2008-13 నడుమ మంజూరైన అన్ని పనులకూ చేసిన మొత్తం ఖర్చులో 30 శాతం ఉన్నది. రికార్డుల పరిశీలనతోపాటుగా ప్రభుత్వ శాఖాధికారులతో కలసి పలు నిర్మాణ పనులను ప్రత్యక్షంగా కూడా సందర్శించి ఆడిట్ పరిశీలనలకు ఆలంబనంగా ఛాయాచిత్రాలను తీయటం జరిగింది.

---

[1] కార్యక్రమ అమలు యూనిట్లు ఆదిలాబాద్ జిల్లాలోనివి మూడు, అనంతపురం, మెదక్ జిల్లాలలో రెండేసి, ఇంకా తూర్పు గోదావరి, గుంటూరు, ఖమ్మం, ప్రకాశం జిల్లాల నుంచి ఒక్కొక్కటి చొప్పున ఎంపిక చేయటం జరిగింది

[2] నిర్మాణ పనులను వ్యయం ప్రాతిపదికన వర్గీకరించి ఇప్పటికే ఆరంభించిన 75 నిర్మాణాలనూ, పనులప్పగించినా ఇంత వరకూ ఖర్చు నమోదుకానివి 15, అలాగే మంజూరు ఇచ్చినా ఇంకా పనులప్పగించని35 పనులనూ నమూనా తనిఖీకి ఎంపిక చేయటం జరిగింది

## 2.4 గత ఆడిట్ సమీక్ష మేరకు తదుపరి చర్యలు

ఆంధ్రప్రదేశ్‌లో పీఎమ్‌జీఎస్‌వై కార్యక్రమం అమలును ఇదివరకొకసారి సమీక్షించి, 2005 మార్చి 31తో ముగిసిన సంవత్సరానికి సీఏజీ ఆడిట్ నివేదిక (సివిల్)లోని పేరా 3.1లో నివేదించటం జరిగింది. కార్యక్రమం ఆరంభించే ముందు విస్తృత సర్వే నిర్వహించకపోవటంవలన గ్రామాల ఎంపికలో జరిగిన పొరపాట్లు, జిల్లా గ్రామీణ రహదారుల ప్రణాళిక, అంతర్గత రహదారుల సమాహారం (నెట్‌వర్క్) రూపొందించకనే మొదటిదశ, రెండవదశ పనులు చేపట్టటం, నిర్మాణ పనులలో ప్రమాణాలు పాటింపకపోవటం, పనుల నిర్వహణపై కేంద్ర స్థాయిలోనూ రాష్ట్ర స్థాయిలోనూ పర్యవేక్షణ కొరవడటం వంటివి అప్పటి ఆడిట్ సమీక్షలో ప్రధానంగా గుర్తించటం జరిగింది.

మూడవ దశ మొదలుకొని అన్ని పనులనూ ఆమోదిత అంతర్గత సమాహారంనుంచే చేపడుతున్నామని ప్రభుత్వం 2006 మార్చి నెలలో శాసన సభ ముందుంచిన వివరణాత్మక నివేదిక (ఎక్స్‌ప్లనేటరీ నోట్) లో బదులిచ్చింది. కేంద్రం జారీ చేసిన మార్గదర్శకాల మేరకు ఇక ముందు తగిన జాగ్రత్తలు తీసుకుంటామని కూడా హామీ ఇచ్చింది. అయితే అప్పటి నివేదికలో ఆడిట్ ప్రస్తావించిన పలు అంశాలపై ప్రభుత్వం తీసుకొన్న చర్యలు తగినంతగాలేవు. అవే లోపాలు ఇప్పటికీ కొనసాగుతుండటం ఇందుకు బలమిస్తోంది. అంతేకాకుండా, ఈ నివేదికలోని పేరా 2.8 లో ఉదహరించిన విధంగా, కాంట్రాక్టుల నిర్వహణలో కేంద్ర ప్రభుత్వ విధివిధానాలను పట్టించుకోని సంఘటనలు అనేకం ఉన్నాయి.

## ఆడిట్ పరిశీలనలు

## 2.5 ప్రణాళిక

### 2.5.1 జిల్లా ప్రణాళికలు, అంతర్గత సమాహారం

జిల్లా గ్రామీణ రహదారుల ప్రణాళిక (డీఆర్ఆర్‌పీ) రూపొందించి జిల్లాలో ఇప్పటికే ఉన్న రోడ్లను అందులో సూచిస్తూ ఇంకా రోడ్ల అనుసంధానానికి నోచుకోని గ్రామాలను గుర్తించటం ప్రణాళికలో కీలకమని కార్యక్రమ మార్గ నిర్దేశకాలలో పేర్కొన్నారు. ప్రతిగ్రామానికీ అత్యవసరమైన సామాజిక-ఆర్థిక సదుపాయాలను అందుబాటు లోకి తెచ్చేందుకు వీలుగా రోడ్లను నిర్మించేందుకోసం ఒక అంతర్గత సమాహారాన్ని (నెట్‌వర్క్‌ను) డీఆర్ఆర్‌పీ ఆధారంగానే రూపొందించాలి. డీఆర్ఆర్‌పీ, అంతర్గత సమాహారంలను మండల స్థాయి, బ్లాకు స్థాయిల్లో చేపట్టగా వాటిని జిల్లా స్థాయిలో క్రోడీకరించి ఆమోదంకోసం రాష్ట్ర స్థాయిలో ఏపీఎస్ఆర్ఆర్‌డీఏ సంస్థకూ అటుపై జాతీయ గ్రామీణ రహదారుల అభివృద్ధి సంస్థకూ (ఎన్ఆర్ఆర్‌డీఏ) పంపిస్తారు. ఆవిధంగా ఆమోదం పొందిన అంతర్గత సమాహారం ఆధారంగా విస్తృత రహదారుల ప్రాధమ్య జాబితా (సీఎన్‌సీపీఎల్), అలాగే విస్తృత మెరుగుదల ప్రాధమ్య జాబితా (సీయూపీఎల్) ద్వారా కొత్తగా వేయవలసిన రోడ్లనూ, మెరుగుపరచవలసిన వాటినీ ఎంపిక చేస్తారు. సీఎన్‌సీపీఎల్, సీయూపిఎల్ ఆవిధంగా గ్రామీణ రహదారుల ఎంపికలో కీలకపాత్ర వహిస్తాయి.

ఈ విషయంలో ఆడిట్ పరిశీలనలు ఈ కింది విధంగా ఉన్నాయి.

### 2.5.2 రోడ్ల మెరుగుదలకు ప్రాధాన్యమివ్వకపోవటం

రోడ్ల మెరుగుదలకు సంబంధించిన 36 పనులను నమూనా తనిఖీ కోసం ఎంపిక చేయగా వీటిలో నల్గొండ, కరీంనగర్ జిల్లాలలో జిల్లాకు మూడేసిచొప్పున చేపట్టిన పనులు ఆ జిల్లాల సీయూపీఎల్‌లో లేనేలేవు. అంతేకాకుండా, ఆయా పనులను వాటి ప్రాధాన్య క్రమంలో ఎంపిక చేయలేదు. కరీంనగర్ జిల్లాలో ఆడిట్ గమనించిన దానిని ప్రభుత్వం తన సమాధానంలో అంగీకరించింది (2014 మార్చి). ఇక నల్గొండ జిల్లా విషయంలో మాత్రం ఈ నిర్మాణ పనులు అంతర్గత సమాహారంలో ఉన్నవేనని చెప్పారు. రహదారుల మెరుగుదల పనులను సీయూపీఎల్ ప్రకారం ఎంపిక చేయవలసి ఉన్నా ఇక్కడ ఆవిధంగా చేయలేదు కనుక ఈ సమాధానం

ఆమోదయోగ్యంకాదు. అదీకాక, నిర్మాణ పనులను వాటి ప్రాధాన్య క్రమంలో ఎంపిక చేయకపోవటానికి నిర్దిష్ట కారణాలను ప్రభుత్వం తన సమాధానంలో పేర్కొనలేదు (2014 మార్చి).

### 2.5.3 వంతెనలు నిర్మించకపోవటం

పీఎమ్‌జీఎస్‌వై కింద 2000-13 నడుమ 1,093 రోడ్డు నిర్మాణ పనులను పూర్తిచేసినట్టు ప్రభుత్వం తెలిపింది[3]. అయితే, ఈ రోడ్లను కలుపుతూ వంతెనలు (డ్రైనేజీలపై వంతెనలు, పొడవైన వంతెనకట్టు) నిర్మించకపోవటం వలన వీటిలో చాలావరకు రహదారులు వినియోగంలోకి రాలేదని ఆడిట్ గమనించింది. కేంద్ర ప్రభుత్వం 2010-11లో 298 వంతెనలకు ఆమోదం తెలుపగా, ఆయా రోడ్లను వాడుకలోకి తెచ్చేందుకు ఇంకా 272 చోట్ల వంతెనలు అవసరమవుతాయని రాష్ట్ర ప్రభుత్వం 2012 ఏప్రిల్‌లో గుర్తించింది. ఆవిధంగా చూస్తే, ఈ రహదారులన్నింటినీ పీఎమ్‌జీఎస్‌వై పథకం కింద పూర్తిచేశామని ప్రభుత్వం చెబుతున్నది సందేహాస్పదమే. ఆడిట్ ప్రస్తావించిన దానిని ప్రభుత్వం అంగీకరించి (2014 మార్చి) ఈ విషయాన్ని కేంద్రంలో గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖకు నివేదించి అన్ని వంతెనలకూ అనుమతి తెచ్చుకుంటామని చెప్పింది.

### 2.5.4 బళ్ళదారులను అన్ని సీజన్ల రహదారులుగా వర్గీకరించారు

రాష్ట్ర ప్రభుత్వం 2003-04లో రూపొందించిన అంతర్గత సమాహారంలో బళ్ళదారులు, కంకర రోడ్లను కూడా అన్ని సీజన్లకూ అనువైన రహదారులుగా చూపించారు. ఇటువంటి రోడ్ల మొత్తం నిడివి 9,986 కి.మీ. కాగా ఇవి 5,219 జనావాసాలను (500 జనాభా పైబడినవి) కలుపుతున్నాయి. ఈ జనావాసాలను మూడు విభిన్న వర్గాలుగా[4] విభజించి రహదారి వసతి కల్పించేందుకు వీలుగా అంతర్గత సమాహారం సవరించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం 2007 నవంబరులో కేంద్రం అనుమతి కోరింది. అయితే, మొదటి వర్గంలోని బళ్ళదారులను మాత్రమే అంతర్గత సమాహారంలో చేర్చేందుకు ఎన్‌ఆర్‌ఆర్‌డీఏ ఒప్పుకుని ఆమేరకు 2008-09లో అనుమతి మంజూరు చేసింది. దీనిప్రకారం కేవలం 395 కొత్త పనులు చేపట్టి 410 ఆవాసాలను కలిపే విధంగా మొత్తం 1,526.72 కి.మీ. పొడవుగల రోడ్లను నిర్మించుకోవచ్చును. అన్ని రాష్ట్రాల అంతర్గత సమాహారాలను సవరించేక్రమంలో 2009-10 సంవత్సరంలో మాత్రమే మిగతా వర్గాల కింది రోడ్ల విషయం పరిశీలించగలమని ఎన్‌ఆర్‌ఆర్‌డీఏ తెలిపింది (2009 జనవరి). ఐతే, ఈ సవరణ ప్రక్రియ 2014 మార్చి నాటికీ చేపట్టలేదు. ఆడిట్ గమనించిన విషయాలను ప్రభుత్వం అంగీకరించింది (2014 మార్చి) కానీ బళ్ళదారులను అన్ని ఋతువుల రహదారులుగా వర్గీకరించటానికి గల కారణాలను మాత్రం వెల్లడించలేదు. నిధులు అందుబాటులో ఉన్నప్పుడు ఈ రోడ్లను మెరుగుపరిచే ప్రయత్నం చేస్తామని మాత్రం బదులిచ్చింది.

### 2.5.5 డేటాలో వైరుధ్యాలు

ఏదైనా కార్యక్రమాన్ని సరైన ప్రణాళికతో విజయవంతంగా అమలు చేయాలంటే దానికి సంబంధించిన డేటా (సమాచారం) కచ్చితమైనది ఉండటం తప్పనిసరి. అర్హత కలిగిఉండీ రాహదారుల వసతిలేని ఆవాసాలకు సంబంధించిన సమాచారాన్ని ఆడిట్ పరిశీలించినప్పుడు పలు వైరుధ్యాలు గోచరించాయి. జనాభా 250-499 మధ్యన ఉండి, రోడ్డు సౌకర్యంలేని ఆవాసాలు ఈఎన్‌సీ రికార్డుల ప్రకారం 556 ఉండగా, మొత్తం 22 జిల్లాల నుంచి మచ్చుకు ఎంపిక చేసిన ఏడు జిల్లాలలోనే ఈ వర్గం కింద 578 ఆవాసాలను ఆడిట్ కనుగొంది. అదేవిధంగా, 500 పైబడిన జనాభాకలిగిన వర్గంలో రోడ్డు వసతి కలిగిన అదనపు ఆవాసాలు ఈఎన్‌సీ లెక్కల

---

[3] ఎన్‌ఆర్‌ఆర్‌డీఏ కార్యాలయానికి ఈఎన్‌సీ 2013 ఏప్రిల్‌లో అందచేసిన నివేదిక (ఎమ్‌పీఆర్)

[4] మొదటి వర్గంలో 839 ఆవాసాలను కలుపుతూ 2,054.33 కి.మీ. పొడవైన 461 బళ్ళదారులున్నాయి. రెండవ వర్గంలో 3,065 ఆవాసాలను కలిపే 1,928 రోడ్లు ఉన్నాయి. నామమాత్రంగా ఉన్న ఈ కంకర రోడ్ల మొత్తం పొడవు 5,006.53 కి.మీ. ఇక మూడవ వర్గంలో 1,315 ఆవాసాలను కలుపుతున్న 750 కంకర రోడ్లు, బళ్ళదారులు (50 శాతం కన్నా ఎక్కువ రోడ్లు) ఉన్నాయి. వీటి మొత్తం పొడవు 2,925.36 కి.మీ.

ప్రకారం 340 ఉండగా, రాష్ట్ర స్థాయీసంఘం (ఎస్ఎల్ఎస్సీ) అంచనాల ప్రకారం ఈ వర్గంలో 1,714 ఆవాసాలు రోడ్డు వసతి లేకుండాఉన్నాయి. మచ్చుకు తనిఖీ చేసిన ఏడు జిల్లాలలో ఈ వర్గం కింద 685 ఆవాసాలకు రోడ్డు వసతిలేదు.

రోడ్ల అనుసంధానం విషయమై తొలుత సమాచార వక్రీకరణ జరిగిన మాట ప్రభుత్వం అంగీకరించి (2014 మార్చి), కచ్చితమైన సమాచారాన్ని ఇప్పుడు కేంద్రానికి నివేదించామని తెలిపింది.

## 2.6 ఆర్థిక విషయాల నిర్వహణ

### 2.6.1 నిధుల సమీకరణ

పీఎమ్‌జీఎస్‌వై పథాకానికి నూరు శాతం నిధులు కేంద్ర ప్రభుత్వమే సమకూరుస్తుంది. ఈ నిధులు మూడు విధాలుగా లభిస్తాయి. అవి ప్రోగ్రాం నిధి (నిర్మాణ పనులకు చెల్లింపులకోసం), పరిపాలనా నిధి (సిబ్బంది, కార్యాలయ అవసరాలకు), నిర్వహణ నిధి (రోడ్ల నిర్వహణ వ్యయాలకోసం).

అనుమతిపొందిన ప్రాజెక్టులకు నిధులను రాష్ట్ర ప్రభుత్వానికి రెండు విడతలుగా అందచేస్తారు. ప్రాజెక్టు విలువలో సగం మొత్తంకానీ వార్షిక కేటాయింపు మొత్తంకానీ (ఏది తక్కువైతే అది) తొలి వాయిదాగా ప్రాజెక్టులను అనుమతించిన మీదట విడుదల చేస్తారు. ఇక మలి విడత నిధులను అప్పటికే ఇచ్చిన సొమ్ములో 60 శాతం వినియోగించుకుని గత సంవత్సరం చేపట్టిన పనుల్లో కనీసం 80 శాతం పూర్తిచేసి, అంతకు ముందు సంవత్సరాల పనులన్నీ పూర్తి చేసిన పిదప ఇస్తారు. మొదటి విడత నిధులు ఇచ్చినప్పుడు పెట్టిన షరతులన్నీ ఈ దశలో నెరవేర్చి ఉండాలి.

పీఎమ్‌జీఎస్‌వై పనులకోసం కేంద్ర ప్రభుత్వం 2008-13 మధ్యగల ఐదేళ్ళలో మొత్తం ₹2,930 కోట్లు విడుదల చేయగా రాష్ట్రం ఇందులో ₹2,476 కోట్లు మాత్రమే ఖర్చుచేయగలిగింది. వినియోగంకాకుండా మిగిలిన ₹454 కోట్లు 2013 జూన్ నాటికి ఏపీఎస్ఆర్ఆర్డీఏ అధీనంలోనే ఉండిపోయాయి.

### 2.6.2 రాష్ట్రం తన వాటా విడుదల చేయకపోవటం/తక్కువగా ఇవ్వటం

నిర్మాణ పనుల ధరల్లో పెరుగుదల కారణంగా అయ్యే అదనపు వ్యయాన్నీ, టెండరు ప్రీమియం ఖర్చునూ, అదే విధంగా 50 మీటర్లకు మించిన వంతెనల నిర్మాణ వ్యయాన్నీ రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని మార్గదర్శకాలలో సూచించారు (ఎంపిక చేసిన గిరిజన మరియు వెనుకబడిన జిల్లాలలో మాత్రం 75 మీటర్ల వరకూ ఉన్న వంతెనలను సమీకృత కార్యాచరణ ప్రణాళికలో చేర్చారు). ఏపీఎస్ఆర్ఆర్డీఏ రికార్డులు పరిశీలించగా ఈ దిగువ విషయాలు తెలిశాయి.

i. కేంద్ర ప్రభుత్వం 2010 సెప్టెంబరులో అనుమతించిన 298 వంతెన పనుల్లో 149 పనులు పూర్తయినాగానీ రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా ఇవ్వవలసిన ₹210.73 కోట్లు (ఖర్చులో తగుభాగం) 2013 జూన్ నాటికి విడుదల చేయలేదు.

ii. అంతేకాకుండా, 2012-13లో ఆమోదం పొందిన పనుల తాలూకు తన వంతు ₹10.21 కోట్లు కూడా రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయలేదు.

తమ వంతు పథకం నిధులను త్వరలో ఇవ్వగలమని ప్రభుత్వం బదులిచ్చింది (2014 మార్చి).

## 2.7 కార్యక్రమం అమలు

### 2.7.1 సమగ్ర ప్రాజెక్టు నివేదికలు (డీపీఆర్)

ప్రాజెక్టును అమలుచేసే సంస్థలు (పీఐయూ) మార్గదర్శకాల ప్రకారం ప్రతి నిర్మాణానికీ సమగ్ర ప్రాజెక్టు నివేదికలు రూపొందించవలసి ఉంటుంది. ఆయా నిర్మాణ పనులకు కావలసిన స్థలాల లభ్యత, ట్రాన్సెక్ట్ వాక్[5] వివరాలు, సీఎన్‌సీపీఎల్/సీయూపీఎల్ ప్రమాణాల పాటింపు, రోజుకు 45 పైగా వాణిజ్య వాహనాలకు ఈ రోడ్లు అనువుగా ఉంటాయన్న ధీమా, డ్రైనేజీలపై 25 మీటర్లకు మించి వేసే వంతెనలకు వేరుగా డీపీఆర్, పొదుపుతోకూడిన డిజైన్లు, కంకర వాడకం, స్థానికంగా దొరికే సామగ్రి, ఫ్లై యాష్, ఐదు సంవత్సరాల సాధారణ నిర్వహణకు అంచనాలు మొదలైన పలు విషయాలు ఈ నివేదికలలో పొందుపరచాలి. డీపీఆర్ ఖరారు చేసిన తర్వాత స్థల వివాదాలవంటివి తలెత్తకుండా చూసుకునేందుకు ఈ రకమైన ట్రాన్సెక్ట్ వాక్ పేరుతో పంచాయతీ ప్రధాని, స్థానిక పట్వారీ, జేఈ, ఏఈ, అటవీ భూములు ఉన్న పక్షంలోనైతే ఆ శాఖ అధికారులు కూడా ప్రతిపాదిత రహదారి మార్గం సందర్శించాలని కేంద్ర ప్రభుత్వం సూచించింది.

కేంద్రం ఆమోదించిన అన్ని రోడ్డు పనులకూ డీపీఆర్‌లు రూపొందించారు. అయితే, ఆ సమయంలో సన్నాహక పనులు, సర్వేలు తగు స్థాయిలో చేయకపోవటంవలన 2008-09, 2010-11 సంవత్సరాలలో మంజూరైన మొత్తం 18 పనులను వివిధ కారణాలపై ఆతర్వాత కాలంలో రద్దు చేయవలసివచ్చింది. ఆ వివరాలు పక్కన ఉన్న పట్టిక 2.1లో ఉన్నాయి. ఈ విషయాన్ని ప్రభుత్వం కూడా ధృవీకరించింది (2014 మార్చి).

**పట్టిక 2.1**

| పనుల రద్దుకు కారణాలు | 2008-09 | 2009-10 |
|---|---|---|
| అవే పనులు మళ్ళీ చేపట్టటం | 5 | - |
| స్థలాల సమస్య | 1 | 1 |
| పనులను నాబార్డు, ఇతర గ్రాంటులతో పూర్తి చేయటం | 2 | 2 |
| పనులను ఆర్ అండ్ బీ శాఖకు బదిలీ చేయటం | - | 3 |
| వంతెనలు అవసరం రాకపోవటం | - | 4 |
| **మొత్తం** | **8** | **10** |

*మూలం: ఈఎన్‌సీ రికార్డులు*

ఆదిలాబాద్, అనంతపురం, కరీంనగర్, మహబూబ్‌నగర్, మెదక్, వరంగల్ జిల్లాలలో ఇప్పటికే పూర్తయిన 23 పనులను[6] మచ్చుకు తనిఖీ చేయగా, వీటిలో కాంట్రాక్టు విలువకూ వాస్తవంగా అయిన వ్యయానికీ మధ్య మొత్తంమీద ₹11.17 కోట్లు వ్యత్యాసం ఉన్నట్లు తెలిసింది. రోడ్డు నిడివి, సీడీ పనులు, వెంట్ పనులు, షోల్డర్లు మొదలైన వాటిలో వచ్చిన మార్పుల కారణంగా ఖర్చుల్లో 3 నుంచి 81 శాతం వరకూ వ్యత్యాసం[7] చోటు చేసుకున్నది. డీపీఆర్‌లను తగినంత శ్రద్ధతో రూపొందించలేదని దీనినిబట్టి తెలుస్తోంది. ఈ విషయాన్ని ప్రభుత్వం తన సమాధానంలో ఒప్పుకున్నది (2014 మార్చి).

---

[5] రోడ్లు వేసేందుకు అత్యంత అనువైన మార్గాన్ని గుర్తించి, స్థలసేకరణలో ఎదురయ్యే సమస్యలను (అటవీ భూములతో సహా) అధిగమించి, సామాజికపరంగానూ పర్యావరణపరంగానూ ఏర్పడగల ప్రతికూలతలను అంచనావేసి, కార్యక్రమానికి అవసరమయిన ప్రజా భాగస్వామ్యాన్ని సాధించటం కోసం ఇవి నిర్వహిస్తారు

[6] ఆదిలాబాద్ జిల్లాలో 5, అనంతపురం జిల్లాలో 4, కరీంనగర్ జిల్లాలో 1, మహబూబ్‌నగర్ జిల్లాలో 1, మెదక్ జిల్లాలో 11, వరంగల్ జిల్లాలో 1

[7] ఆదిలాబాద్ (6 నుండి 25 శాతం), అనంతపురం (3 నుండి 6 శాతం), కరీంనగర్ (26 శాతం), మహబూబ్‌నగర్ (17 శాతం), మెదక్ (12 నుండి 81 శాతం), వరంగల్ (13 శాతం)

### *2.7.1.1 డీపీఆర్‌లలో లోపాలు*

రికార్డుల పరిశీలనతోపాటు పనుల ప్రత్యక్ష తనిఖీ కూడా చేపట్టినమీదట తూర్పుగోదావరి జిల్లా ***బోడిలంక నుంచి తుర్రువాడ*** మధ్య తలపెట్టిన రహదారి మధ్యలో విపరీతమైన వాలు కారణంగానూ కనుమ దారిలో సీసీ పేవ్‌మెంట్ వేయాల్సిరావటంవలనా అర్థంతరంగా ఆగిపోయినట్టు ఆడిట్ గుర్తించింది. ఈ రహదారిని 8 కి.మీ. పొడవున తుర్రువాడ, చావడికోట, ముంతమామిడి ఆవాసాలను కలిపే విధంగా ₹2.02 కోట్ల కాంట్రాక్టు వ్యయంతో 2009 అక్టోబరులో చేపట్టారు. పనులను 3.925 కి.మీ. వరకూ, 5.525 కి.మీ. నుంచి 6.8 కి.మీ. వరకూ మొత్తం ₹1.09 కోట్ల ఖర్చుతో పూర్తి చేశారు. ఇంకా 3.925 కి.మీ. నుంచి 5.525 కి.మీ. మధ్య (కొండవాలు) పూర్తిచేయవలసి ఉంది. పనులను 2012 జూలై నెలలో ఆపేశారు. ఆగిపోయిన భాగం పూర్తిచేయటం సాధ్యం కాదని కార్యనిర్వాహక ఇంజనీరు 2013 మే నెలలో తేల్చిచెప్పారు. ఆడిట్ గమనించిన విషయాలను ప్రభుత్వం ధృవీకరించి (2014 మార్చి) ప్రత్యామ్నాయ రహదారిని ఎంపిక చేశామనీ రాష్ట్ర నిధులతో దాని నిర్మాణం చేపట్టగలమనీ బదులిచ్చింది.

### *2.7.1.2 సింగిల్ కనెక్టివిటీని పరిగణించకపోవటం*

ఈ పథకం మార్గదర్శకాల ప్రకారం ఒక ఆవాసానికి ఒక్క రోడ్డునే మంజూరు చేయాలి. డీఆర్‌ఆర్‌పీలో ఆవాసాల కనెక్టివిటీ పరిస్థితినిబట్టి అర్హత కలిగిన అన్ని ఆవాసాలకూ దగ్గరిదారిలో వేయవలసిన రోడ్లను అంతర్గత సమాహారం సూచిస్తుంది. మెదక్ జిల్లా గజ్వేల్ మండలంలో ***పీడబ్ల్యూడీ రోడ్డునుంచి బంగ్లా వెంకటాపూర్ వరకూ బీటీ రోడ్డు*** పని చేపట్టారు. ఈ రోడ్డు బంగ్లా వెంకటాపూర్, రంగంపేట, ధర్మారెడ్డిపల్లి గ్రామాలను కలిపేందుకు ఉద్దేశించారు. అయితే ఈ గ్రామాలకు అన్ని సీజన్ల రోడ్డు వసతి ఉన్నట్టు రికార్డుల పరిశీలన, ప్రత్యక్ష తనిఖీలో తెలిసింది. ఈ గ్రామాలకు రాష్ట్ర రాజధాని నుంచి దూరాన్ని 15 కి.మీ. తగ్గించేందుకు ఈ రోడ్డు వేశామని ప్రభుత్వం తన సమాధానంలో తెలిపింది (2014 మార్చి). అయితే, రోడ్డు వసతిలేని గ్రామాలకు ఒక్క రోడ్డు మార్గాన్ని కల్పించటం కోసమే పీఎమ్‌జీఎస్‌వై పథకాన్ని ప్రవేశపెట్టారు కాబట్టి ఈ సమాధానం సరికాదు. కనుక ఈ రహదారి కోసం వెచ్చించిన ₹2.70 కోట్లు ఈ పథకం నియమాలకు అనుగుణంగాలేదు.

### *2.7.1.3 అరకొరగా చేపట్టిన ట్రాన్సెక్ట్ వాక్‌లు*

ట్రాన్సెక్ట్ వాక్‌లు తగిన స్థాయిలో చేయకుండానే 16 నిర్మాణ పనులను[8] ఆరంభించినట్టు ఆడిట్ పరిశీలనలో తెలిసింది. ఫలితంగా అనేక పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయి. కొన్ని అర్థంతరంగా ఆగిపోయాయి. కొన్ని పనులు అసలు ఆరంభించలేదు. కొన్ని పనులను రద్దుచేసుకున్నారు. అటవీ శాఖ అనుమతులు రాకపోవటం, ముందస్తు పరిశీలన సరిగా లేకపోవటం, డిజైన్ల ఆమోదంలో జాప్యం, స్థలవివాదాలు మొదలైనవి పనులను ఆటంకపరచాయి. ఆవివరాలు ఈ కింది విధంగా ఉన్నాయి:

**ఎ. అటవీ అనుమతులు లేక ఆగిపోయిన పనులు**

i. తూర్పుగోదావరి జిల్లాలో ***వేటుకూరు నుంచి సిరిపురం*** వరకు 2009 ఫిబ్రవరిలో చేపట్టిన రోడ్డు 28 కి.మీ. పొడవున 11 గ్రామాలను కలుపుతుంది. అయితే, 0 కి.మీ. నుంచి 1.200 కి.మీ. వరకు డబ్ల్యూఎమ్ఎమ్ రోడ్డునూ, 4.600 నుంచి 25.785 కి.మీ. వరకూ బీటీ రోడ్డునూ వేసిన తర్వాత అటవీ శాఖ అనుమతి లభించకపోవటంతో 2011 మార్చి నెలలో పనులు ఆగిపోయాయి. అటవీ సంరక్షణ చట్టం కింద అనుమతి పొందే ప్రయత్నం చేస్తామని ప్రభుత్వం చెప్పింది (2014 మార్చి). అయితే, ఇంతవరకూ ₹7.42 కోట్లు ఖర్చు చేసినాగానీ ఈ గ్రామాలకు రోడ్డు వసతి సమకూరలేదు.

---

[8] ఆదిలాబాద్ జిల్లాలో 1, అనంతపురం జిల్లాలో 6, తూర్పుగోదావరి జిల్లాలో 3, గుంటూరు జిల్లాలో 1, ఖమ్మం జిల్లాలో 2, మెదక్ జిల్లాలో 2, ప్రకాశం జిల్లాలో 1

ii. తూర్పుగోదావరి జిల్లాలో ***జీఎస్‌టీ రోడ్డు నుంచి కే.కొత్తూరు వయా వజ్రకూటం*** రోడ్డును 2009 ఫిబ్రవరిలో చేపట్టారు. ఇది యాజేపురం, వజ్రకూటం, కే.కొత్తూరు గ్రామాలను కలుపుతూ 8 కి.మీ. సాగుతుంది. అయితే, 5.675 కి.మీ. వరకూ రోడ్డు వేసిన తర్వాత అటవీ శాఖ అనుమతి లభించకపోవటంతో 2011 నవంబరులో పనులను అర్థంతరంగా ఆపేశారు. ఫలితంగా, వజ్రకూటం గ్రామానికి మాత్రం రోడ్డు వసతి కలిగింది. మిగతా రెండు ఊళ్ళకు రోడ్డు ఏర్పడలేదు. అంతేకాకుండా, 4.400 కి.మీ. (వజ్రకూటం) నుంచి 5.675 కి.మీ. వరకు వేసిన రోడ్డుకోసం చేసిన ఖర్చు ₹23.59 లక్షలు ఫలితమివ్వలేదు. అటవీ సంరక్షణ చట్టం కింద వీటికి అనుమతి తీసుకునే ప్రయత్నం చేస్తామని ప్రభుత్వం బదులిచ్చింది (2014 మార్చి).

iii. గుంటూరు జిల్లాలో ***కంచరగుంట నుంచి మించాలంపాడు*** వరకు రోడ్డు నిర్మించి మించాలంపాడు, కంచరగుంట, కాకిరాల గ్రామాలను కలపాలని 2009 ఫిబ్రవరిలో పనులారంభించారు. దీనిని ₹4.81 కోట్ల ఖర్చుతో 2010 ఏప్రిల్ నాటికి పూర్తిచేశారు. అయితే, నిర్మాణ సామగ్రినీ యంత్ర పరికరాలనూ చేరవేసేందుకు అటవీ శాఖ అనుమతించకపోవటంతో 9.800 కి.మీ. నుంచి 10.700 కి.మీ. వరకూ 0.90 కి.మీ. పొడవైన రోడ్డుపని పూర్తవలేదని ఆడిట్ గమనించింది. అయితే, అటవీ ప్రాంతంలో వేసిన డబ్ల్యూబీఎమ్ రోడ్డుతో మొత్తం రహదారి అన్ని సీజన్ల రోడ్డుగా మారిందని ప్రభుత్వం తన సమాధానంలో తెలిపింది (2014 మార్చి).

**బి. శిథిలమైన బండ్ మీదుగా రోడ్డు నిర్మాణం:** ఆదిలాబాద్ జిల్లా చెన్నూరు మండలంలో ***అంగరాజ్‌పల్లి నుంచి ముత్తారావుపల్లి వయా సుందరశాల*** మార్గంలో బీటీ రోడ్డు పనులను ₹2.72 కోట్ల కాంట్రాక్టు వ్యయంతో 2009 ఆగస్టులో చేపట్టారు. తొమ్మిది గ్రామాలను కలిపే ఈ రోడ్డును 2010 జూన్‌లో ₹2.88 కోట్ల ఖర్చుతో పూర్తిచేశారు. నిబంధనల ప్రకారం కొత్త రోడ్డు వేయవలసిఉండగా, ఇప్పటికే శిథిలమై, ప్రయాణాలకు అనువుగాలేని బండ్ (కట్ట) మీదుగా రోడ్డును నిర్మించినట్టు ఆడిట్ పరిశీలనలో వెల్లడైంది. ఆవిధంగా ₹2.88 కోట్లు ఖర్చుచేసినాగానీ ఆశించిన విధంగా గ్రామాలకు అన్ని సీజన్ల రోడ్డు వసతి కల్పించే లక్ష్యం నెరవేరలేదు. కొత్త రోడ్డు వేయకపోవటానికిగల కారణాలను ప్రభుత్వం తన సమాధానంలో విశదీకరించలేదు (2014 మార్చి). అయితే, ఈ రోడ్డు మరమ్మతులకు అనుమతిపొందే ప్రయత్నం చేస్తున్నామని మాత్రం తెలిపింది.

### *2.7.1.4 భూమి యాజమాన్యం పొందకపోవటం*

గ్రామీణ రోడ్ల నిర్మాణానికి అవసరమైన స్థలాల లభ్యతను నిర్ధారించుకునే విధంగా స్వచ్ఛంద విరాళాలు, భూముల మారకం, ఇంకా ఇతర పద్ధతులలో భూ సేకరణకు తగిన మార్గదర్శకాలను రాష్ట్ర ప్రభుత్వం రూపొందించాలని పీఎమ్‌జీఎస్‌వై ఆపరేషన్స్ మాన్యువల్‌లో సూచించారు. ఆవిధంగా సేకరించిన భూముల వివరాలను స్థానిక కార్యాలయ రికార్డులలో నమోదుచేసి వివాదాలను నివారించాలి. స్వచ్ఛంద విరాళాలకు సంబంధించి ఒప్పంద పత్రాలు రాసుకుని, వీటి నకలును సంబంధిత రెవెన్యూ కార్యాలయంలో అందచేసి వారి రికార్డులలో అవసరమైన మార్పులు చేయించి ఆమేరకు ఓ అఫిడవిట్ పొందాలి.

i. మెదక్ జిల్లాలో నమూనా తనిఖీ కోసం ఎంపిక చేసిన 12 పనులలో పైన వివరించిన విధానాలను పాటించ లేదు. ఈ జిల్లాలోని పీటీ వెంకటాపూర్, శేఖరరావుపేట లబ్ధిదారులను విచారించగా వారినుంచి అఫిడవిట్ పొందకుండానే ప్రభుత్వం వారి భూములను రోడ్డు పనుల కోసం తీసుకున్నట్టు చెప్పారు. స్థలయజమానులు తమ స్థలాలను వ్రాతపూర్వకంగా విరాళం ఇచ్చేందుకు ముందుకు రావటంలేదని ప్రభుత్వం బదులిచ్చింది (2014 మార్చి). విరాళంగా సేకరించిన భూములకు లిఖితపూర్వకమైన ఒప్పందాలు రాసుకుని ఆనక రాగల వివాదాలను నివారించుకోవాలని మార్గదర్శకాలలోనే స్పష్టంచేసినందున ఈ సమాధానం సరికాదు.

ii. గుంటూరు జిల్లాలో ***సీపీటీ-ఎస్ఆర్టీ ఆర్ అండ్ బీ రోడ్డు నుంచి వేలూరు*** వరకు 12.5 కి.మీ. పొడవైన రహదారి నిర్మించి గిరిజన కాలనీ, వేలూరు గ్రామాలను కలిపే పనిని 2009 మార్చి నెలలో చేపట్టారు. ఈ పనిని ₹4.94 కోట్ల ఖర్చుతో 2010 మార్చి నాటికే పూర్తిచేసినాగానీ గిరిజన కాలనీలో కొంతభాగం మాత్రం పనిజరగలేదు. గిరిజన కాలనీ జనాభాతో సహా మొత్తం గ్రామాన్ని రోడ్డు నిర్మాణ పరిధిలోకి తీసుకొచ్చామని ప్రభుత్వం తన సమాధానంలో తెలిపింది (2014 మార్చి). అయితే, రహదారిలోని ఆభాగం ఇప్పటికీ పూర్తికాకపోవటం ఆడిట్ ప్రత్యక్ష పరిశీలనలో గుర్తించింది.

#### *2.7.1.5 ప్రతిపాదిత రోడ్లపై రద్దీ తీవ్రతను పరిగణించకపోవటం*

తూర్పుగోదావరి జిల్లా మారేడుమిల్లి మండలం ***బోడ్లంక నుంచి తుర్రవాడ*** వరకు 8 కి.మీ. రహదారిని ₹2.02 కోట్ల కాంట్రాక్టు విలువకు 2008-09లో ఆమోదం (2009 అక్టోబర్) తెలిపారు. ఇది తుర్రువాడ, చావడికోట, ముంతమామిడి గ్రామాలను కలుపుతుంది. ఈ దారిలో 5.800 కి.మీ. దగ్గర రాతి గని ఉండటంవలన భారీ వాహనాల రాకపోకలతో ఏర్పడే ట్రాఫిక్ రద్దీని లెక్కలోకి తీసుకోనకుండానే రోడ్డు పనులకు అంచనాలు రూపొందించారు. రోడ్డు నిర్మాణం పూర్తిచేసుకుని భారీ వాహనాల రాకపోకలు ప్రారంభమయ్యాక రోడ్డు బాగా దెబ్బతిన్నది. అంతేకాకుండా 3.400 కి.మీ. నుంచి 3.925 కి.మీ. వరకూ రోడ్డు పూర్తిగా శిధిలమైపోయింది (2013 మే). డీపీఆర్ రూపొందించక ముందు ఇక్కడ తవ్వకం పనులు జరిగేవికావని ప్రభుత్వం తన సమాధానంలో పేర్కొంది (2014 మార్చి). అయితే రోడ్డు నిర్మాణం 2009 అక్టోబరులో చేపట్టగా ఇక్కడ మైనింగ్ లీజును ప్రభుత్వం 2007 జూలై నెలలోనే ఖరారు చేసింది.

## 2.8 టెండరు ప్రక్రియ, కాంట్రాక్టుల నిర్వహణ

పీఎమ్‌జీఎస్‌వై పథకం కింద రోడ్ల నిర్మాణం, నిర్వహణ కోసం కేంద్ర ప్రభుత్వం స్టాండర్డ్ బిడ్డింగ్ డాక్యుమెంట్‌ను (ఎస్‌బీడీ) వెలువరించింది. దీని ప్రకారం సాంకేతిక, ఆర్థిక బిడ్లతోకూడిన ద్విముఖ టెండరింగు విధానం అనుసరించాల్సి ఉంటుంది. టెండరు ప్రక్రియలోని వివిధ దశలకు కాలపరిమితినీ, గుత్తేదారుల ఎంపికకు అర్హతా ప్రమాణాలనూ, బిడ్లను పరిశీలించి నిర్ణయం తీసుకొనేందుకు అర్హులైన అధికారుల స్థాయిని ఈ ఎస్‌బీడీలో స్పష్టం చేశారు.

మచ్చుకు తనిఖీ చేసిన ప్రాజెక్టులలో అనుసరించిన టెండరు ప్రక్రియలపై ఆడిట్ విశ్లేషణ ఈ కింది విధంగా ఉన్నది:

i. **సాంకేతిక మంజూరు రాకముందే టెండరు నోటీసులు:** ప్రాజెక్టులను రాష్ట్ర సాంకేతిక సంస్థ (ఎస్‌టీఏ) పరిశీలించిన మీదట ఎన్ఆర్ఆర్‌డీఏ ఆమోదంకూడా తీసుకున్నాక రాష్ట్రంలో సంబంధిత అధికారి సాంకేతిక మంజూరు ఇచ్చిన తర్వాతనే టెండరు నోటీసు ఇవ్వాల్సి ఉంటుంది. కానీ, పనులప్పగించిన 96 ప్రాజెక్టులకుగాను 47 ప్రాజెక్టులలో[9] ఈ నిబంధన పాటించలేదు. ఆవిధంగా, 46 ప్రాజెక్టులలో సాంకేతిక మంజూరుకన్నా ముందే టెండర్లు పిలిచారు. మరొక పని విషయంలో సాంకేతిక మంజూరు వచ్చిన రోజునే టెండరు నోటీసు ఇచ్చారు. పనులలో జాప్యం నివారించటం కోసం టెండరు నోటీసులను సాంకేతిక మంజూరుకన్నా ముందే ఇచ్చినాగానీ బిడ్లను మాత్రం సాంకేతిక అనుమతి వచ్చిన తర్వాతనే ఈ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫాంపై ప్రచురించటం జరిగిందని ప్రభుత్వం బదులిచ్చింది (2014 మార్చి).

---

[9] ఆదిలాబాద్ జిల్లాలో 6, అనంతపురం జిల్లాలో 3, తూర్పుగోదావరి జిల్లాలో 5, గుంటూరు జిల్లాలో 5, ఖమ్మం జిల్లాలో 1, కరీంనగర్ జిల్లాలో 1, కృష్ణా జిల్లాలో 1, మహబూబ్‌నగర్ జిల్లాలో 1, మెదక్ జిల్లాలో 11, ప్రకాశం జిల్లాలో 12, వరంగల్ జిల్లాలో 1

ii. **వ్యయంలో వ్యత్యాసాలున్నాగానీ ఎన్ఆర్ఆర్డీఏ ఆమోదం పొందకపోవటం :** డీపీఆర్లో లెక్కకట్టిన వ్యయానికీ సాంకేతిక మంజూరులో సూచించినదానికీ మధ్య వ్యత్యాసం 10 శాతం మించినప్పుడు ఎన్ఆర్ఆర్డీఏ ఆమోదం తప్పనిసరి. అయితే తూర్పు గోదావరి, ఖమ్మం జిల్లాలలో ఈ వ్యత్యాసం 13 నుంచి 34 శాతం వరకూ ఉన్నాకానీ మొత్తం మూడు పనులను ఎన్ఆర్ఆర్డీఏ అనుమతి తీసుకొనకుండానే కాంట్రాక్టర్లకు అప్పగించారు. ఈ విషయమై ప్రభుత్వం ప్రత్యేకించి సమాధానం ఇవ్వలేదు (2014 మార్చి).

iii. **అదనపు గడువుతో పనులప్పగించటం :** పని చేపట్టేందుకు ఉత్తర్వులు ఇచ్చిన రోజు నుంచి తొమ్మిది నెలలలోగా పని పూర్తి చేయవలసి ఉంటుంది. ఏదైనా ప్యాకేజీలో ఒకటి కంటే ఎక్కువ పనులు ఉన్న సందర్భంలో ఈ మొత్తం పనులకు 12 క్యాలెండర్ నెలల కన్నా ఎక్కువ సమయం తీసుకొనరాదు. నమూనా తనిఖీ చేసిన జిల్లాలలో మొత్తం 12 పనులకు[10] 3 నుంచి 6 మాసాల గడువు అదనంగా ఇచ్చారు. ఈ విషయంలో కూడా ప్రభుత్వం బదులివ్వలేదు (2014 మార్చి).

iv. **డిఫెక్ట్ లయబిలిటీ గడువుకు ముందే కాలంతీరిన బీమా పాలసీలు:** కాంట్రాక్టు నిబంధనల[11] ప్రకారం నిర్మాణ పనులనూ, పరికరాలనూ గుత్తేదారులు బీమా చేయించవలసి ఉంటుంది. అయితే, ఆదిలాబాద్ జిల్లాలోని 2, అనంతపురంజిల్లాలోని 4, మెదక్ జిల్లాలోని 5 పనుల విషయంలో డిఫెక్ట్ లయబిలిటీ గడువు, నిర్వహణ గడువు తీరకుండానే (32 నుండి 62 నెలల ముందే) బీమా పాలసీలు ముగిసిపోయాయి. ప్రభుత్వం ఈ విషయం అంగీకరించి, (2014 మార్చి) గుత్తేదారుల నుంచి బీమా పాలసీలు తీసుకుంటామని తెలిపింది.

v. **అదనపు సెక్యూరిటీ డిపాజిట్ తీసుకొనకపోవటం:** మొత్తం పనివిలువలో 5 శాతం వంతున 'అదనపు సెక్యూరిటీ డిపాజిట్ ' రూపంలో వసూలు చేయవలసి ఉండగా, తూర్పు గోదావరి, ఖమ్మం, మెదక్ జిల్లాలలో 2009-12 సంవత్సరాలలో మొత్తం 50 బిల్లులలో ఈ విధంగా వసూలు చేయలేదు. ఈ అదనపు ధరావతును డిఫెక్ట్ లయబిలిటీ గడువు ముగిసిన తర్వాతనే కాంట్రాక్టర్లకు తిరిగి చెల్లించాలి. ఇది వసూలు చేయకపోవటంవలన కాంట్రాక్టర్లు తమ సెక్యూరిటీ డిపాజిట్ను నిర్మాణ పనులు పూర్తయిన మేరకు ముందే తీసేసుకునే వీలు కలుగుతుంది. కాంట్రాక్టర్లు పని మానేసిన సందర్భాలలో ప్రభుత్వం సొమ్ము వసూలు చేసుకునే అవకాశం కోల్పోయే ప్రమాదముంటుంది. మెదక్ జిల్లాలోని ప్రాజెక్టు అమలు సంస్థ పొరపాటున వసూలు చేయలేదనీ, ఖమ్మం జిల్లాలో రికవరీ చేస్తున్నారనీ ప్రభుత్వం తెలిపింది (2014 మార్చి). ఐతే, తూర్పు గోదావరి జిల్లా విషయంలో నిర్దిష్టమైన సమాధానమివ్వలేదు.

vi. **పెర్ఫార్మెన్స్ సెక్యూరిటీ డిపాజిట్ వసూలు చేయకపోవటం:** మెదక్ జిల్లాలో మచ్చుకు తనిఖీ చేసిన ఆరు నిర్మాణ పనులలో[12] ప్రాజెక్టు అమలు సంస్థలు ₹45.38 లక్షల మేర పెర్ఫార్మెన్స్ సెక్యూరిటీ డిపాజిట్[13] వసూలు చేయలేదు. ఇది పొరపాటున జరిగిందని ప్రభుత్వం బదులిచ్చింది (2014 మార్చి).

vii. **బ్యాంకు గ్యారంటీలను రీవాలిడేషన్ చేయకపోవటం:** తూర్పు గోదావరి, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలలో మొత్తం మూడు పనులలో నిర్మాణాలు, నిర్వహణ గడువు ముగియకముందే బ్యాంకు గ్యారంటీలు కాలదోషం పట్టాయి. వీటి మొత్తం విలువ ₹31.79 లక్షలు[14]. వీటి పునరుద్ధరణ (రీవాలిడేషన్) కోసం

---

[10] కరీంనగర్ జిల్లాలో 1, కృష్ణా జిల్లాలో 1, మహబూబ్నగర్ జిల్లాలో 1, మెదక్ జిల్లాలో 9

[11] స్టాండర్డ్ బిడ్డింగ్ డాక్యుమెంటుకు జతచేసిన నిబంధనలలో 13వ క్లాజు, ఆపరేషన్స్ మాన్యువల్లోని పేరా 9.3.1

[12] పీటీ వేంకటాపూర్ - మునిగడప, తీగుల్ - యూసుఫ్ఖాన్పల్లి, పీడబ్ల్యుడీ రోడ్డు - బంగ్లా వెంకటాపూర్, ముంద్రాయి - మండపల్లి, తిప్పారం వద్ద వంతెన, మాతిండ్ల - ఇబ్రహింపూర్

[13] ఆపరేషన్స్ మాన్యువల్లోని పేరా 8.13, స్టాండర్డ్ బిడ్డింగ్ డాక్యుమెంటుకు జతచేసిన నిబంధనలతో 46వ క్లాజు ప్రకారం

[14] తూర్పు గోదావరి జిల్లా: బోడ్లంక - తుమ్మరువాడ రోడ్డు పని (₹5.07 లక్షలు), శ్రీకాకుళం జిల్లా: కుసుమపురం - కళింగపట్నం బీటీ రోడ్డు (₹7.63 లక్షలు, ₹1.90 లక్షలు), విజయనగరం జిల్లా: ఎస్డీ రోడ్డు - ఎగువగంజభద్ర బీటీ రోడ్డు (₹3.44 లక్షలు, ₹13.75 లక్షలు)

ప్రాజెక్టు అమలు సంస్థలు చర్యలు తీసుకోలేదు. శ్రీకాకుళం జిల్లాలో ప్రాజెక్టు అమలు సంస్థ ఉత్తర ప్రత్యుత్తరాలు చేస్తున్నదనీ, తూర్పు గోదావరి జిల్లాలో కూడా రీవాలిడేషన్ చేయిస్తారనీ ప్రభుత్వం తెలిపింది (2014 మార్చి). విజయనగరం జిల్లా విషయంలో మాత్రం బదులివ్వలేదు.

## 2.9 పనుల నిర్వహణ

### 2.9.1 నిర్మాణ పనుల పరిస్థితి

ఈ పథకం కింద రోడ్డు పనులను కేంద్రం మంజూరు చేసిననాటినుంచి 15 నెలలలోపు పూర్తి చేసుకోవలసి ఉంటుంది. కేంద్ర ప్రభుత్వం 2008-13 నడుమ ఆమోదం తెలిపిన వివిధ రోడ్డు పనుల పురోగతి వివరాలు పట్టిక 2.2 లో ఉన్నాయి.

**పట్టిక 2.2**

| సంవత్సరం | పనుల వివరాలు | పనుల సంఖ్య | | | | పనుల పరిస్థితి | | | | 2013 మార్చి నాటికి వ్యయం (₹ కోట్లలో) | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| | | కేంద్రం ఆమోదించినవి | అవార్డు చేసినవి | అవార్డు చేయనివి | రద్దుకు ప్రతిపాదించినవి | పూర్తయినవి | జాప్యంతో పూర్తి చేసినవి | జాప్యం (నెలల్లో) | పురోగతిలో ఉన్నవి | పూర్తయిన పనులు | పురోగతిలో ఉన్నవి |
| 8వ దశ (2008-09) | రోడ్లు | 431 | 420 | 3 | 8 | 397 | 47 (12%) | 1-68 | 23 | 471.54 | 11.48 |
| 9వ దశ (2010-11) | వంతెనలు | 298 | 262 | 27 | 9 | 149 | 2 (1%) | 1-50 | 113 | 50.41 | 82.78 |
| | రోడ్లు | 187 | 186 | 0 | 1 | 143 | 0 | 0 | 43 | 92.87 | 19.72 |
| 10వ దశ (2012-13) | రోడ్లు | 266 | 233 | 33 | 0 | 0 | 0 | 0 | 233 | 0 | 0 |
| | రోడ్లు | 188 | 0 | 188 | 0 | 0 | 0 | 0 | 0 | 0 | 0 |
| మొత్తం | | 1370 | 1101 | 251 | 18 | 689 | 49 | 1-68 | 412 | 614.82 | 113.98 |

*మూలం: ఈఎన్‌సీ ఇచ్చిన సమాచారం*

అవార్డు చేసిన 1,101 పనులలో 689 పనులు (63 శాతం) పూర్తవగా, 49 పనులలో ఒకటి నుంచి 68 నెలల జాప్యం చోటుచేసుకుంది.

అటవీ శాఖ అనుమతులు రాకపోవటం, తీవ్రవాదులతో సమస్యలు, రేట్లు, ఎలైన్‌మెంట్లు మారిన మీదట సవరించిన పాలనా అనుమతులు రాకపోవటం వలన 2008-13లో మంజూరైన కొన్ని పనులు అవార్డు చేయలేదనీ పనులలో జాప్యానికీ ఇవే కారణాలనీ ఈఎన్‌సీ బదులిచ్చారు (2013 మే).

ఈఎన్‌సీ రికార్డులలో నమూనా తనిఖీకి ఎంపిక చేసిన 131 పనులకుగాను 96 పనులను ఆరంభించగా 35 పనులను 2013 మార్చి నాటికీ చేపట్టలేదు. ప్రారంభించిన ఈ 96 పనులలో 70 పనులు గడువులోగా పూర్తవగా, ఆరు పనులు మాత్రం 4-10 నెలల జాప్యంతో పూర్తయ్యాయి. రెండు పనులను రద్దు చేయగా, 18 పనులు 2013 జూన్ నాటికి కొనసాగుతున్నాయి. ఆడిట్ గమనించిన ఈ విషయాలను ప్రభుత్వం అంగీకరించింది (2014 మార్చి).

ఈ 35 పనులను ఆమోదించినా, ఇంకా పనులు చేపట్టలేదని ప్రభుత్వం పేర్కొన్నది (2013 మార్చి). అయితే, వీటిలో నాలుగు పనులు పూర్తయ్యాయనీ, 12 పనులు పురోగతిలో ఉన్నాయనీ ఆడిట్ పరిశీలనలో తెలిసినందున ప్రభుత్వం ఇచ్చిన సమాచారం సరైందికాదు. డిజైన్లు ఖరారు కాకపోవటం, అటవీ శాఖ అనుమతులు రాకపోవటం

వంటి కారణాలవలన మిగతా 19 పనులు[15] ఆరంభంకాలేదు. నమూనా తనిఖీ కోసం ఎంపిక చేసిన పనుల వివరాలు ***అనుబంధం-2.1***లో ఉన్నాయి.

మచ్చుకు తనిఖీ చేసిన పనుల విషయంలో ఆడిట్ గమనించినవి ఈ కింది పేరాలలో వివరించటం జరిగింది.

## 2.9.2 పూర్తి కనెక్టివిటీ (అనుసంధానం) లేకుండానే చేపట్టిన పనులు

లక్షిత గ్రామాలకు అన్ని ఋతువుల రహదారులు కల్పించేక్రమంలో ప్రాజెక్టు అమలు సంస్థలు ఆమార్గంలో అవసరమయ్యే గట్లు, డ్రైనేజీ, కాజ్‌వే, కల్వర్టులు, వంతెనలు మొదలైనవి గుర్తించి సమకూర్చాలని మార్గదర్శకాలలో[16] నిర్దేశించారు. మచ్చుకు కొన్ని పనుల రికార్డులను పరిశీలించి, పనుల ప్రత్యక్ష తనిఖీ కూడా చేసిన మీదట కొన్ని రోడ్ల నిర్మాణం పూర్తయినాగానీ కాజ్‌వేలు, కల్వర్టులు, వంతెనలు, పూర్తినిడివి రోడ్లు డీపీఆర్‌లో సూచించినట్లు పూర్తి చేయకపోవటంవలన కొన్ని గ్రామాలకు రవాణా వసతి ఒనగూరలేదని తెలిసింది. ఆవిధంగా గ్రామాలకు అన్ని ఋతువుల రోడ్డు అనుసంధానం పాక్షికంగానే నెరవేరింది. నమూనా తనిఖీలో బయటపడిన ముఖ్యవిషయాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి:

### *2.9.2.1 వంతెనలు నిర్మించకపోవటం*

i. ఆదిలాబాద్ జిల్లాలో *వెంకటాపూర్ నుంచి మొట్లగూడ* రోడ్డుపనిని తొమ్మిది గ్రామాలను కలిపే ఉద్దేశంతో ఆరంభించి, ₹5.47 కోట్ల ఖర్చుతో 2011 ఏప్రిల్‌లో పూర్తి చేశారు. ***రాంపూర్ నుంచి దిగ్గ*** వరకు మరొక రోడ్డు పనిని ₹2.07 కోట్ల వ్యయంతో 2010 ఆగస్టులో పూర్తి చేశారు. అయితే, ఎర్రవాగుపై వంతెనను విడిగా చేపట్టారు. దీని వలన గిరివల్లి, కరిగి, రాంపూరు గ్రామాలకు (మొదటి వర్కుకు సంబంధించినవి) అలాగే దిగ్గ గ్రామానికీ (రెండవ వర్కుకు సంబంధించినది) అనుసంధానం ఏర్పడుతుంది. ఎర్రవాగుపై ఈ వంతెన 2013 జూన్ నాటికీ పూర్తవలేదు. ఫలితంగా ఈ గ్రామాలకు రవాణా వసతి సమకూరలేదు. ఈ వంతెన కోసం డిజైన్ల రూపకల్పన జరుగుతున్నదని ప్రభుత్వం సమాధానమిచ్చింది (2014 మార్చి).

ii. తూర్పు గోదావరి జిల్లా పి.గన్నవరం మండలంలో ***T02 49.700 కి.మీ. నుంచి ఉడుముడిలంక*** వరకు రోడ్డు పనులు 2009 ఆగస్టులో ప్రారంభించారు. ఉడుముడిలంక, జి.పెదపూడి లంక గ్రామాలకు దీనివలన ప్రయోజనం కలుగుతుంది. నిర్మాణ పనులను ₹1.25 కోట్ల ఖర్చుతో 2010 మార్చిలో పూర్తిచేశారు. నదిమీద వంతెన నిర్మించకపోవటంవలన 1.237 కి.మీ. నుంచి 1.335 కి.మీ. వరకూ అనుసంధానం ఏర్పడలేదని ఉమ్మడి తనిఖీలో ఆడిట్ గమనించింది. ప్రజలు ఈ నదిని కాలినడకన దాటవలసి ఉంటుంది. అదికూడా వాతావరణం అనుకూలించినప్పుడే వీలవుతుంది. ఇక్కడ వంతెన 2010 సెప్టెంబరులో మంజూరయిందనీ, టెండర్ల దశలో ఉన్నదనీ ప్రభుత్వం తెలిపింది (2014 మార్చి).

### *2.9.2.2 పూర్తి నిడివి రోడ్డు వేయకపోవటం*

i. కృష్ణా జిల్లాలో *గరిసేపూడి నుంచి చినగొల్లపాలెం* రోడ్డు పనిని 2009 ఫిబ్రవరిలో ఆరంభించి 2011 ఫిబ్రవరిలో పూర్తిచేశారు. దీని ఖర్చు ₹3.51 కోట్లు. లక్షిత ఆరు గ్రామాలకుగాను ఐదింటికి మాత్రమే రోడ్డు వసతి కలిగినట్లు ప్రత్యక్ష పరిశీలనలో తెలిసింది. మిగతా గ్రామాలు (ఏటి పవర్/ఏటి మొండి పల్లి పాలెం) 9.16 కి.మీ. ఆవల ఉన్నాయి. ఇక్కడ 6.00 కి.మీ. నుంచి 9.16 కి.మీ. వరకూ రోడ్డు వేసినాగానీ ఇది సాగర తీరంలో ఉన్నదితప్ప ఏగ్రామాన్నీ కలపటం లేదు. ఆవిధంగా లక్షిత గ్రామానికి రోడ్డు వసతి కలుగలేదు. ప్రభుత్వం ఈ విషయాలను అంగీకరించి ఈ ప్రాంతంలో రోడ్డును స్థానిక గ్రాంటుతో పూర్తి చేయిస్తామని తెలిపింది (2014 మార్చి).

---

[15] రద్దయినవి 5, అవార్డు కానివి 12, మంజూరవనిది 1, అవార్డు అయినా మొదలు కానిది 1

[16] మార్గదర్శకాలలోని పేరా 8.5 (v)

ii. ఖమ్మం జిల్లాలో ***ఆర్ అండ్ బీ రోడ్డు నుండి దబ్బనూతల*** వరకు బీటీ రోడ్డు పనిని 2010 సెప్టెంబరులో చేపట్టారు. ఇది కొత్తూరుకు రోడ్డు వసతి కల్పిస్తుంది. ఈ నిర్మాణం ₹1.93 కోట్ల ఖర్చుతో 2013 మార్చి నెలలో పూర్తిచేశారు. ఈ రోడ్డును 8 కి.మీ. వరకూ వేసినాగానీ ప్రతిపాదిత గ్రామానికి ఇది 400-500 మీటర్ల దూరంలో ఉన్నట్టు ఆడిట్ ప్రత్యక్ష పరిశీలనలో గమనించింది. గ్రామంవరకూ రోడ్డును కలిపే పని స్థానిక నిధులతో చేపడతారని ప్రభుత్వం బదులిచ్చింది (2014 మార్చి).

### 2.9.3 నిర్మాణ పనులలో లోపాలు

నమూనా తనిఖీలో రికార్డుల పరిశీలనతోపాటు నిర్మాణాల ప్రత్యక్ష తనిఖీ కూడా చేపట్టి ఆడిట్ పలు విషయాలను గుర్తించింది. అనుభవలేమి వల్ల కొన్ని పనులు అర్ధంతరంగా ఆగిపోవటం, డిజైన్లను అనుసరించకపోవటం, నిర్మాణంలో నాణ్యత లోపించటం, లక్షిత గ్రామాలను కలపకపోవటం మొదలైనవి వీటిలో కొన్ని. ముఖ్యమైన ఆడిట్ పరిశీలనలు ఈ కింది విధంగా ఉన్నాయి:

#### *2.9.3.1 ఎగువ గంజబద్రను కలిపే బీటీ రోడ్డు (విజయనగరం జిల్లా)*

విజయనగరం జిల్లా, సాలూరు మండలంలోని ఎస్‌డీ రోడ్డు 19.000 కి.మీ. నుంచి ఎగువ గంజబద్ర బీటీ రోడ్డు పనులను ₹6.87 కోట్ల కాంట్రాక్టు విలువకు 2010 జూలై నెలలో చేపట్టారు. ఇది కోటియా, సొంపిగం, కొత్తవూరు, పులివల్స, ఎగువసాంబి గ్రామాలను కలుపుతుంది.

i. **కాంట్రాక్టరు పని పూర్తిచేయకపోవటం:** ఈ రోడ్డు నిర్మాణంలో మైదాన భూమి, కొండప్రాంతం (5.200 కి.మీ. నుంచి 10.500 కి.మీ. వరకు) ఇమిడి ఉన్నాయి. కొండప్రాంతంలో పనులు చేపట్టిన అనుభవం కలిగి ఉండాలన్న నిబంధన పెట్టలేదు. కాంట్రాక్టరు ₹6.39 కోట్ల విలువ కలిగిన పనులు పూర్తిచేసిన తరువాత 2011 నవంబరులో కొండ ప్రాంతంలో పనులు ఆపేశారు. ఈ పనిని 2013 మార్చి నెలలో రద్దు చేశారు. మిగిలిపోయిన పనులలో (అంచనాల ప్రకారం ₹1.51 కోట్లు) 10.800 కి.మీ. నుంచి 14.200 కి.మీ. వరకూ పేవ్‌మెంట్ నిర్మాణం, 5.400 కి.మీ. నుంచి 14.200 కి.మీ. వరకూ షోల్డర్లు, 6.200 కి.మీ. నుంచి 14.200 కి.మీ. వరకూ సీడీ పనులు ఉన్నాయి. పనులు మధ్యలో ఆపేసిన కాంట్రాక్టరు మీద చర్యలు తీసుకుంటున్నామనీ, టెండర్లు పిలిచి మిగతా పనులు పూర్తిచేయిస్తామనీ ప్రభుత్వం బదులిచ్చింది (2014 మార్చి).

ii. **లోపభూయిష్టమైన నిర్మాణం:** సీసీ పేవ్‌మెంట్ల నిర్మాణంకోసం ₹1.73 కోట్లు ఖర్చుచేసినా, కంకర షోల్డర్లు నిర్మించకపోవటం వలన రోడ్డు కోతకు గురయ్యింది. ఈ రోడ్డును ఉపయోగించటం ప్రమాదకరమని తెలిపేహెచ్చరిక బోర్డులు కూడా కొన్ని చోట్ల పెట్టారు. అంతేకాకుండా, మలుపుల దగ్గర వాహనాల రాకపోకలు సులువుగా సాగేందుకు వీలుగా రోడ్డు వెడల్పును పెంచలేదు. ఈ లోపాలను సరిచేయిస్తామని ప్రభుత్వం తెలిపింది (2014 మార్చి).

iii. **లోపాలు సరిదిద్దకుండా కాంట్రాక్టు రద్దు చేయటం:** రోడ్డు నాణ్యతను 2013 జనవరిలో పరీక్షించి చూసిన నేషనల్ క్వాలిటీ మానిటర్స్ అసంతృప్తి వ్యక్తం చేశారు. సబ్ గ్రేడ్, సబ్ బేస్, డబ్ల్యూబీఎమ్, సీడీలు నాసిరకం అనీ, బీటీ హెచ్చుతగ్గులుగా ఉన్నదనీ చెబుతూ వీటిని మళ్ళీవేయాల్సి ఉంటుందని సూచించారు. ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు చేపట్టకుండా 2013 మార్చిలో కాంట్రాక్టును రద్దు చేసింది. దిద్దుబాటు చర్యలు కాంట్రాక్టరు ఖర్చుపై చేపడుతున్నారని ప్రభుత్వం ఆడిట్‌కు తెలిపింది (2014 మార్చి).

iv. **అనుమతి పొందకుండా పేలుడుపనులు చేపట్టటం :** కొండప్రాంతాలలో తవ్వకాలకు ₹66.47 లక్షలు చెల్లించారు. పేలుడు సామగ్రి ఉపయోగించి చైనేజీ 3.000 కి.మీ. నుంచి 3.100 కి.మీ. వరకూ చేపట్టిన పేలుళ్ళకు అనుమతి పొందలేదు. వీటికి అనుమతి అవసరమని తెలియలేదనీ, ఇటువంటివి ఇకముందు జరగకుండా జాగ్రత్త వహిస్తామని ప్రభుత్వం బదులిచ్చింది (2014 మార్చి).

v. **లక్షిత గ్రామాలను కలపకపోవటం :** డీపీఆర్‌కు జతచేసిన నివేదికలో ఈ రోడ్డు ఐదు గ్రామాలను కలుపుతుందని ప్రతిపాదించినప్పటికీ, వాస్తవానికి రోడ్డు నేరెళ్ళవలస, ధూళిభద్ర, సారిక అనే మూడు ఇతర గ్రామాల గుండావెళ్ళి ఎగువసాంబి అనే ఒకే ఒక్క లక్షిత గ్రామాన్ని చేరుతోంది. ఆవిధంగా మిగతా లక్షిత గ్రామాలకు రోడ్డు వసతి కలగలేదు. ఈ రోడ్డుకు అనుబంధంగా నిర్మించిన దారులద్వారా కోటియ తప్ప మిగిలిన గ్రామాలకు రహదారులు అమిరినట్టు ప్రభుత్వం బదులిచ్చింది (2014 మార్చి). ఆయితే, ఆడిట్ అధికారులు 2014 ఏప్రిల్‌లో స్థలపరిశీలన చేయగా ఒక కచ్చారోడ్డు మాత్రమే వేసినట్టు తెలిసింది. కాబట్టి ఈ సమాధానం సరికాదు.

### *2.9.3.2 కళింగపట్నంకు రోడ్డు (శ్రీకాకుళం జిల్లా)*

శ్రీకాకుళం జిల్లా కవిటి మండలంలో ఈ రోడ్డు పనిని ₹3.79 కోట్ల కాంట్రాక్టు విలువకు 2010 జూలైలో అప్పగించారు. రికార్డుల పరిశీలన, ప్రత్యక్ష తనిఖీ చేయగా ఈ కింది విషయాలు తెలిశాయి :

i. **డిజైన్ల ఖరారులో జాప్యం :** ఈ నిర్మాణ పనికి 2009 ఫిబ్రవరిలో ఆమోదం లభించింది. వంతెన నిర్మాణానికి డిజైను 2011 ఏప్రిల్‌లో మాత్రమే ఖరారయింది (దీని పొడవు 125.75 మీటర్లు, ఆరు వెంట్లు 16.5 మీటర్లవి పైల్ పునాదులతో). డిజైన్లు ఖరారు కాకుండానే డీపీఆర్‌ను సైతం ఆమోదించారు. ఇది సరైన విధానం కాదు. వీటికి సంబంధించి 2011 ఏప్రిల్‌లో ఆమోదించిన డిజైన్లను మార్చటంవలన ఇది జాప్యానికి దారితీసిందని ప్రభుత్వం తెలిపింది (2014 మార్చి).

ii. **పనులు పూర్తిచేయకపోవటం:** కాంట్రాక్టరు ₹3.58 కోట్ల విలువైన పనులు పూర్తిచేసిన తర్వాత 2011 డిసెంబరులో మిగతా పనులు ఆపేశారు. ఇందుకు కారణాలను పేర్కొన లేదు. పనిని 2012 డిసెంబరులో రద్దుచేశారు. ఆవిధంగా వంతెన నిర్మాణం పూర్తికాకపోవటంవలన పక్కన చిత్రంలో చూపినట్టు లక్షిత గ్రామానికి రహదారి సౌకర్యం ఏర్పడ లేదు. సవరించిన పాలనాపరమైన మంజూరు వచ్చిన తరువాత మిగతా నిర్మాణం పూర్తి చేయిస్తామని ప్రభుత్వం బదులిచ్చింది (2014 మార్చి).




iii. **పనులు పూర్తి చేయకపోయినా, ధరల సర్దుబాటు చెల్లింపు:** పనులను ఒప్పందపు గడువులోపునగానీ, పొడిగించిన గడువులోపునగానీ పూర్తి చేసిన సందర్భాలలో మాత్రమే ధరల సర్దుబాటు మొత్తం చెల్లించవచ్చు[17]. పని అసలు పూర్తికాకపోయినాగానీ, ఈ నియమాన్ని అతిక్రమించి సిమెంటు, ఇనుము ధరల సర్దుబాటు రూపేణా ₹34.70 లక్షలు చెల్లించారు (2011 ఆగస్టు-డిసెంబరు). ఈ మొత్తాన్ని కాంట్రాక్టరు నుంచి వసూలు చేస్తామని ప్రభుత్వం బదులిచ్చింది (2014 మార్చి).

[17] జీఓఎమ్ఎస్.నెం.94, తేదీ 16 ఏప్రిల్ 2008, టీ.ఆర్ అండ్ బీ (టీ1) శాఖ ప్రకారం

iv. **జరిమానా వసూలు చేయకపోవటం:** కాంట్రాక్టరుకు గడువు పొడిగించిన సందర్భంలో ₹19.25 లక్షలు జరిమానా విధించారు (2012 నవంబరు). అయితే, 2012 డిసెంబరులో ఒప్పందం రద్దు చేసుకున్నారు గానీ ఈ జరిమానా మొత్తాన్ని వసూలు చేయలేదు (2013 మే). కాంట్రాక్టరు నుంచి జరిమానా వసూలు చేస్తామని ప్రభుత్వం తెలిపింది (2014 మార్చి).

### *2.9.3.3 బ్రహ్మసమేధ్యం, చిర్రయానాంల రోడ్డుకు రివెట్‌మెంట్ చేయకపోవటం (తూర్పు గోదావరి జిల్లా)*




తూర్పు గోదావరి జిల్లా కాట్రేనికోన మండలంలో ఈ రోడ్డు నిర్మాణం 2009 నవంబరులో చేపట్టి ₹4.25 కోట్ల ఖర్చుతో 2012 మార్చిలో పూర్తి చేశారు. ఈ రోడ్డు సముద్రపు ఉప్పునీటి కయ్యలగుండా వెడుతుండటం వలన సముద్రపు అలలతాకిడికి, ఆటుపోట్లకు రోడ్డు వాలుభాగం కోతకు గురికావచ్చనీ ఏక్షణంలోనైనా రోడ్డు కొట్టుకు పోయే ప్రమాదమున్నదనీ, దీనికి రివెట్‌మెంట్ చేయటం అవసరమనీ నేషనల్ క్వాలిటీ మానిటర్స్ 2010 నవంబరులోనే హెచ్చరించారు. అయితే ప్రమాదభరితంగా తయారైన పలుచోట్ల రివెట్‌మెంట్ పనులు చేపట్టకుండానే వదిలేసిన విషయం ఆడిట్ అధికారులు, సంబంధిత శాఖాధికారులు కలసి చేసిన స్థల పరిశీలనలో (2013 మే) వెల్లడైంది. దీనివలన, పై ఛాయాచిత్రంలో కనిపిస్తున్నట్టు, రోడ్డు వాలు భాగం ఒరిపిడికి గురి కావచ్చును. ఇతర నిధులను వెచ్చించి, రోడ్డు పరిరక్షణకు అవసరమైన పనులు చేపట్టే ప్రయత్నంలో ఉన్నామని ప్రభుత్వం సమాధానమిచ్చింది (2014 మార్చి).

### *2.9.3.4 కాళేశ్వరం నుంచి పాలుగుల రోడ్డుపై సింగిల్ మెటల్ లేయర్ (కరీంనగర్ జిల్లా)*

కరీంనగర్ జిల్లా, మహదేవపూర్ మండలంలో రోడ్డు నిర్మాణ పనులను ₹2.50 కోట్ల కాంట్రాక్టు విలువకు 2009 సెప్టెంబరులో చేపట్టారు. పుష్కపల్లి, పాలుగుల, కుంట్లం, మద్దులపల్లి గ్రామాలకు దీనివలన ప్రయోజనం చేకూరుతుంది. దీనిని ₹3.16 కోట్ల వ్యయంతో 2010 సెప్టెంబరులో పూర్తిచేశారు. డబ్ల్యూబీఎమ్ గ్రేడ్-II మెటల్, డబ్ల్యూబీఎమ్ గ్రేడ్-III మెటల్ వేసిన తర్వాత బిటుమినస్ పనులు చేపట్టాలని ఆపరేషన్స్ మాన్యువల్‌లో నిర్దేశించారు. అయితే, ఇక్కడ గ్రేడ్ II మెటల్ లేయర్ (కంకర పొర) వేయకుండానే సింగిల్ మెటల్ లేయర్ (డబ్ల్యూబీఎమ్ గ్రేడ్ III మెటల్) మీదనే బిటుమినస్ పనులు చేపట్టారు. ఎస్‌టీఏ ఆమోదించిన డీపీఆర్ ప్రకారమే పనులు నిర్వహించినట్టు ప్రభుత్వం బదులిచ్చింది (2014 మార్చి). అయితే, ఇక్కడ అనుసరించిన విధానం ఆపరేషన్స్ మాన్యువల్‌కు విరుద్ధమన్నది మాత్రం వాస్తవం.

### *2.9.3.5 మట్టి రోడ్డుమీద డ్యాం నిర్మాణం (ముంద్రాయి-మండపల్లి బీటీ రోడ్డు - మెదక్ జిల్లా)*

ముంద్రాయి, మండపల్లి టేకులపల్లి గ్రామాలకు రవాణా వెసులుబాటు కల్పించేందుకు ఈ నిర్మాణ పనులను ₹2.05 కోట్ల కాంట్రాక్టు విలువతో 2009 ఆగస్టులో చేపట్టారు. దీనిని ₹2.61 కోట్ల ఖర్చుతో 2010 ఆగస్టులో పూర్తి చేశారు. ఐతే, రోడ్డు పరిధికి ఆవల *మండపల్లి నుంచి రాజీవ్ రహదారి వరకు (వయా గుండ్ల చెరు గ్రామం)* ఉన్న మట్టి రోడ్డు మీద 1.000 కి.మీ. దగ్గర 15 తూములతో కూడిన డ్యాం నిర్మించారు. దీనికి 900 ఎమ్ఎమ్ వ్యాసం కలిగిన ఆర్‌సీసీ తూములు వాడారు. దీనిపై వ్యయం ₹37.64 లక్షలు అయింది. మట్టి రోడ్డును అన్ని ఋతువులకు అనువైన రోడ్డుగా మెరుగుపరిచేపని రాష్ట్రం ఖర్చుపై చేపడతామని ప్రభుత్వం తెలిపింది (2014 మార్చి).

#### *2.9.3.6 గ్రామాలను కలపని రహదారి (రవీందర్‌నగర్ రోడ్డు - ఆదిలాబాద్ జిల్లా)*

రవీందర్‌నగర్, నాగపూర్ గ్రామాలను కలిపేందుకు ఉద్దేశించిన ఈ నిర్మాణాన్ని 2008-09లో చేపట్టారు. ఇది ₹1.47 కోట్ల ఖర్చుతో 2010 జూలైలో పూర్తయింది. గ్రామం మొగదలలో నిర్మించిన ఒక కల్వర్టు 2010లో వరదలకు కొట్టుకుపోయింది. ఇది ఇప్పటికీ (2013 మే) పున్నర్మించకపోవటంతో లక్షిత గ్రామాలకు రోడ్డు వసతి సమకూరలేదు. అంతేకాక, 5.150 కి.మీ. దగ్గర వంతెనను 2013 మే నాటికి నిర్మించలేదు. పాడయిన కల్వర్టు సరిచేయమని కాంట్రాక్టరుకు నోటీసు ఇచ్చామనీ వంతెన నిర్మాణం కోసం సవరించిన పాలనాపరమైన మంజూరు జారీ చేశామని ప్రభుత్వం బదులిచ్చింది (2014 మార్చి).

### 2.9.4 కార్యక్రమం మార్గదర్శకాలు, నిబంధనలను అనుసరించకపోవటం

#### *2.9.4.1 సైడు డ్రైన్లను నిర్మించకపోవటం*

గ్రామాల గుండా రోడ్లు నిర్మించే సందర్భాలలో దారికి ఇరువైపుల నీళ్ళు పారేందుకు తగిన డ్రైన్లు ఉండే విధంగా శ్రద్ధవహించాలని పీఎమ్‌జీఎస్‌వై ఆపరేషన్స్ మాన్యువల్‌లో స్పష్టం చేశారు. మెదక్ జిల్లాలో రోడ్డు నిర్మాణాలను ప్రత్యక్షంగా పరిశీలించినపుడు రెండు నిర్మాణాల విషయంలో ఈ విధమైన ఏర్పాట్లు చేయలేదని తెలిసింది. అవి ***పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి గోప్యతండా*** వరకు, అలాగే ***ఆళ్ళదుర్గ మెటల్‌కుంట పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి ముస్లాపూర్ వయా బైరాన్‌దిబ్బ***. అక్కడ వాటి అవసరం లేకపోవటంతో సైడు డ్రైన్లను నిర్మించలేదని ప్రభుత్వం బదులిచ్చింది (2014 మార్చి). అయితే ఈ విధమైన ఏర్పాటు చేయాలని పథకం మార్గదర్శకాలలో నిర్దేశించారు. అదీగాక, సైడు డ్రైన్లవల్ల నీళ్ళు ఇళ్ళలోకి ప్రవహించకుండా నిరోధించవచ్చు.

#### *2.9.4.2 గ్రామీణ రోడ్డు నిర్మాణంలో సాంకేతిక పరిజ్ఞానం వినియోగం*

గ్రామీణ రోడ్ల నిర్మాణానికి అనువైన సామగ్రి, సాంకేతిక పరిజ్ఞానం[18] వివరాలను ఐఆర్‌సీ ఆమోదించిన విధంగా ఎన్‌ఆర్‌ఆర్‌డీఏ ఒక జాబితా రూపొందించి దానిని 2009 సెప్టెంబరులో ఏపీఎస్‌ఆర్‌ఆర్‌డీఏకి అందచేసింది. ఆవివరాలను ప్రాజెక్టు అమలు సంస్థలన్నింటికీ తెలియచేయాలనీ, కనీసం 2-3 శాతం రోడ్లను ఈ సామగ్రితోనూ, సాంకేతికపరిజ్ఞానంతోనూ నిర్మించే విధంగా ప్రాజెక్టు ప్రతిపాదనలు రూపొందించాలనీ ఆదేశించింది. ఐతే, ఏపీఎస్‌ఆర్‌ఆర్‌డీఏ ఈ ఆదేశాలను పాటించలేదు. అందుకు కారణాలను వివరించనూలేదు. ఆదిలాబాద్ జిల్లాలో ఆరు నిర్మాణ పనులు కొత్త సాంకేతికతతో చేపడుతున్నామనీ, అవి టెండరు దశలో ఉన్నాయనీ ప్రభుత్వం బదులిచ్చింది (2014 మార్చి).

## 2.10 నాణ్యతా నియంత్రణ

పీఎమ్‌జీఎస్‌వై పథకంలో మూడంచెల నాణ్యతా నియంత్రణ వ్యవస్థను ఏర్పరిచారు. ప్రాజెక్టు అమలు సంస్థలు, స్టేట్ క్వాలిటీ మానిటర్ (ఎస్‌క్యూఎమ్) మొదటి రెండు అంచెలలో ఉంటారు. నిర్మాణాలలో ఉపయోగించిన సామగ్రి, పనివారి నైపుణ్యం నిర్దేశిత ప్రమాణాలకు తగినట్టు ఉన్నాయనీ, అవసరమైన అన్ని పరీక్షలూ సకాలంలో జరిపించి తగిన స్థాయి వ్యక్తులు, అధికారులు పర్యవేక్షిస్తున్నారనీ నిర్ధారించుకోవాలి. ఇక మూడవ అంచెలో ఎన్‌ఆర్‌ఆర్‌డీఏ సంస్థ రోడ్లను యాదృచ్ఛికంగా పరీక్షించటం కోసం నేషనల్ క్వాలిటీ మానిటర్స్‌ను నియోగించాలి. ప్రతి రోడ్డు పనినీ కనీసం మూడుసార్లు పరిశీలించే విధంగా ఈ తనిఖీలు నిర్వహించాలి.

[18] ఆర్‌బీఐ గ్రేడ్ 81 - సాయిల్ స్టెబిలైజర్, రెక్రాన్ 3 ఎస్ డోసియర్, జైకోసాయిల్ టీఎమ్ నానో టెక్నాలజీ, రెనోలిత్ బేస్డ్ టెక్నాలజీ, జూట్ జియో టెక్స్‌టైల్స్, వాకర్ బీఎస్ డ్రై సాయిల్, ఇంపీరియల్ స్మెల్టింగ్ ఫర్నేస్ (ఐఎస్‌ఎఫ్) స్లాగ్, సాయిల్ ఫిక్స్ - బౌండ్ పేవ్‌మెంట్ స్టెబిలైజర్, మెటలర్జికల్ స్లాగ్ (వేల్జ్ కిల్న్ స్లాగ్), కాపర్ స్లాగ్, మొదలైనవి

నాణ్యతా నియంత్రణ మొదటి అంచెలో జరిగిన పర్యవేక్షణ వివరాలుకానీ, ప్రాజెక్టు అమలు సంస్థలు నిర్వహించిన పరీక్షల తాలూకు నెలవారీ నివేదికలుకానీ, స్టేట్ క్వాలిటీ కోఆర్డినేటర్ తెప్పించుకున్న నివేదికలుగానీ ఆడిట్ పరిశీలనకు అందచేయలేదు. ఈ విషయంలో అన్ని రికార్డులూ నిర్వహించాల్సిందిగా ప్రాజెక్టు అమలు సంస్థలకు ఆదేశాలు పంపినట్లు ప్రభుత్వం బదులిచ్చింది (2014 మార్చి).

నమూనా తనిఖీ చేసిన యూనిట్లలో రెండవ, మూడవ అంచెల నాణ్యతా నియంత్రణ వ్యవస్థ పనితీరును పరిశీలించగా ఈ కింది విషయాలు తెలిశాయి.

i. **ఫిర్యాదుల రిజిస్టరు నిర్వహించకపోవటం:** ప్రజలనుంచికానీ, కేంద్ర ప్రభుత్వం/ఎన్ఆర్ఆర్డీఏ ద్వారాకానీ వచ్చిన ఫిర్యాదుల నమోదుకు స్టేట్ క్వాలిటీ మానిటర్స్ తగిన రిజిస్టర్లను పెట్టలేదు. ఫిర్యాదుల రిజిస్టరు ఇకమీదట నిర్వహిస్తారని ప్రభుత్వం బదులిచ్చింది (2014 మార్చి).

ii. **ప్రాజెక్టు అమలు సంస్థల నుంచే స్టేట్ క్వాలిటీ మానిటర్స్‌ను నియోగించటం:** మార్గదర్శకాలకు విరుద్ధంగా, రాష్ట్ర ప్రభుత్వం స్టేట్ క్వాలిటీ మానిటర్స్‌ను ప్రాజెక్టు అమలు సంస్థలనుంచే నియోగించింది. స్వతంత్ర ప్రతిపత్తిగల నాణ్యతా నియంత్రణ వ్యవస్థను ఏర్పరచిన ప్రయోజనం దీనివలన నెరవేరలేదు. అయితే, 2013 జూలై నుంచి పొరుగు సేవలద్వారా నియమించిన క్వాలిటీ మానిటర్స్‌తో తనిఖీలు చేయిస్తున్నామని ప్రభుత్వం బదులిచ్చింది (2014 మార్చి).

iii. **ఎన్‌క్యూఎమ్ తనిఖీల మీద ఏటీఆర్‌లను అందచేయకపోవటం:** నేషనల్ క్వాలిటీ మానిటర్లు ఏదైనా నిర్మాణాన్ని పరీక్షించి అసంతృప్తికరంగా ఉన్నట్లు పేర్కొన్న సందర్భాలలో ఆ నిర్మాణానికి ఉపయోగించిన సామగ్రినీ, పనివారినీ సరిచేసి నిర్మాణం సంతృప్తికరంగా వచ్చేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్య తీసుకోవాలి. అయితే, నేషనల్ క్వాలిటీ మానిటర్స్ తనిఖీలపై 2011 ఏప్రిల్ నుంచి 2013 ఏప్రిల్ మధ్యన 108 యాక్షన్ టేకెన్ రిపోర్టులు (ఏటీఆర్‌లు) పంపవలసి ఉండగా రాష్ట్ర ప్రభుత్వం 2013 జూలై నాటికి 84 ఏటీఆర్‌లు మాత్రమే పంపించింది. ఇప్పటికి 94 ఏటీఆర్‌లు పంపామనీ, మిగతావి కూడా త్వరలో పంపుతామనీ ప్రభుత్వం బదులిచ్చింది (2014 మార్చి).

iv. **తగినంతగా లేని తనిఖీలు:** స్టేట్ క్వాలిటీ మానిటర్స్ 2007 మార్చి నుంచి 2013 మార్చి మధ్యన 788 పనులను తనిఖీ చేశారు. ప్రతి నిర్మాణాన్నీ మూడుసార్లు తనిఖీ చేయవలసి ఉండగా, వీటిలో 650 పనులను ఒకేసారి, 120 పనులను రెండేసిసార్లు, 18 పనులను మాత్రం రెండు సార్లకు మించి తనిఖీ చేశారు. సిబ్బంది కొరతవలన తనిఖీలు నిర్వహించలేదని ప్రభుత్వం బదులిచ్చింది (2014 మార్చి).

## 2.11 నిర్వహణ

పీఎమ్‌జీఎస్‌వై పథకం కింద నిర్మించిన రోడ్ల నిర్వహణ బాధ్యత ఐదు సంవత్సరాల వరకూ ఆ కాంట్రాక్టరే వహించాలని మార్గదర్శకాలలో పేర్కొన్నారు. ఇందుకు అవసరమైన నిధులను రాష్ట్ర ప్రభుత్వం తన సొంత వనరుల నుంచి సమకూర్చుకొని వాటిని ఏపీఎస్ఆర్ఆర్డీఏ అధీనంలో విడిగా ఒక ప్రత్యేక ఖాతాలో జమచేయాలి.

బీటీ రోడ్ల పునరుద్ధరణకు, సాధారణ మరమ్మతులకు ₹1,104.10 కోట్లు కావాలని అభ్యర్థనలు రాగా దాంట్లో రాష్ట్ర ప్రభుత్వం 2013 జూన్ నాటికి ₹99.86 కోట్లు మాత్రమే విడుదల చేసినట్లు ఆడిట్ పరిశీలనలో తెలిసింది. అంతేకాకుండా ఈ కార్యక్రమం ఆరంభించినది మొదలు ఏపీఎస్ఆర్ఆర్డీఏ కేవలం ₹35.36 కోట్లు మాత్రమే వినియోగించుకుంది. ఆవిధంగా నిధులు విడుదల చేయకపోవటం, ఖర్చు చేయకపోవటం కారణంగా

₹3,871.67 కోట్ల వ్యయంతో నిర్మితమైన రోడ్ల నిర్వహణ సరిగాలేక అవి మరింత శిధిలమై ప్రజలకు ప్రమాదకరంగా పరిణమిస్తున్నాయి. రోడ్ల నిర్వహణ విషయంలో లక్ష్యసాధన దిశగా చర్యలు తీసుకుంటున్నామని ప్రభుత్వం తెలిపింది (2014 మార్చి).

నమూనా తనిఖీ చేసిన జిల్లాలలో రోడ్లను ప్రత్యక్షంగా పరిశీలించగా రోడ్ల నిర్వహణ సరిగాలేకపోవటం, పలు రోడ్లు దెబ్బతినటం, బిటుమినస్ పూత కొట్టుకుపోవటం, రోడ్డు షోల్డర్ల మరమ్మతులు చేయకపోవటం వంటివి ఆడిట్ దృష్టికి వచ్చాయి. అందుకు కొన్ని నిదర్శనలు ఈ కింద ఇవ్వటం జరిగింది.

| | | |
|---|---|---|
| పని | ఆర్ అండ్ బీ రోడ్డు నుంచి చెరువులోపాలెం వరకు రోడ్డు |  |
| జిల్లా | గుంటూరు | |
| మంజూరైనది | 2008-09 | |
| పూర్తిచేసినది | 2010 జూలై | |
| వ్యయం | ₹1.61 కోట్లు | |
| ఆడిట్ గమనించినది | రోడ్డు మీది బీటీ కొట్టుకుపోయి, ఉపరిభాగం దెబ్బతిన్నది (2.200 కి.మీ. నుంచి 2.600 కి.మీ.) | |
| పని | పుట్లూరివారిపాలెం నుంచి లింగంగుంట్ల రోడ్డు |  |
| జిల్లా | గుంటూరు | |
| మంజూరైనది | 2008-09 | |
| పూర్తిచేసినది | 2010 అక్టోబరు | |
| వ్యయం | ₹2.52 కోట్లు | |
| ఆడిట్ గమనించినది | రోడ్డుమీది బీటీ కొట్టుకుపోయి, ఉపరిభాగం పూర్తిగా శిధిలమయింది | |

రోడ్డు ఉపరిభాగానికి మరమ్మతు చేశారని ప్రభుత్వం తెలిపింది (2014 మార్చి). అయితే, 2014 ఏప్రిల్‌లో మరోమారు తనిఖీ చేయగా చెరువులోపాలెం, లింగంగుంట్ల దగ్గర రోడ్లు మరింత పాడయ్యాయని తెలిసింది.

## 2.12 ఆర్థిక నిర్వహణ, అంతర్గత నియంత్రణలు

### 2.12.1 ఫండ్ పద్దుల నిర్వహణ

ఏపీఎస్ఆర్ఆర్‌డీఏ, ప్రాజెక్టు అమలు సంస్థలు తమదగ్గర ఉన్న ప్రోగ్రాం ఫండ్, ఎడ్మినిస్ట్రేటివ్ ఫండ్, నిర్వహణ ఫండ్‌లకు సంబంధించిన ఆదాయవ్యయాలకు నియమాల ప్రకారం వేరువేరుగా పద్దులు నిర్వహిస్తాయి. ఏపీఎస్ఆర్ఆర్‌డీఏ పద్దులను, మచ్చుకు తనిఖీ చేసిన జిల్లాలలోని అమలు సంస్థల పద్దులను పరిశీలించగా ఈ దిగువ లోపాలు వెలుగుచూశాయి.

i. **సర్దుబాటు అవని అడ్వాన్సులు:** మచ్చుకు తనిఖీ చేసిన ఐదు జిల్లాలలోని అమలు సంస్థలు డీపీఆర్‌లను రూపొందించేందుకు ఖర్చుచేసిన ₹2.92 కోట్లు[19] ప్రోగ్రాం ఫండుకు సర్దుబాటు చేయలేదు. ప్రాజెక్టు అమలు సంస్థలు ఈ ఖర్చుల వివరాలు ఇవ్వలేదు. డీపీఆర్ అడ్వాన్సును సర్దుబాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ప్రభుత్వం తెలిపింది (2014 మార్చి).

[19] ఆదిలాబాద్ జిల్లాలో ₹0.62 కోటి; అనంతపురం జిల్లాలో ₹1.11 కోట్లు; తూర్పు గోదావరి జిల్లాలో ₹0.22 కోటి; ఖమ్మం జిల్లాలో ₹0.57 కోటి; మెదక్ జిల్లాలో ₹0.40 కోటి

ii. **డీపీఆర్ వ్యయాన్ని గ్రాంటుకు డెబిట్ చేయటం:** ఏపీఎస్ఆర్ఆర్డీఏ 2010 అక్టోబరు, 2012 ఫిబ్రవరి, మార్చి నెలల్లో డీపీఆర్ వ్యయం డెబిట్ చేసేందుకు మొత్తం ₹52.33 లక్షలకు[20] రిలీజ్ ఆర్డర్లు ఇచ్చింది. కృష్ణా, శ్రీకాకుళం జిల్లాలకు సంబంధించిన ఈ ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదు. ఈ డీపీఆర్లను ఇతర గ్రాంట్ల కింద శాంక్షన్లకు ఉపయోగిస్తామనీ, డీపీఆర్ ఖర్చులను ఆగ్రాంట్లకే డెబిట్ చేస్తామనీ ప్రభుత్వం సమాధానమిచ్చింది (2014 మార్చి). అయినా, ప్రాజెక్టుకు అనుమతి రాకుండానే దాని డీపీఆర్ వ్యయాన్ని ప్రోగ్రాం ఫండుకు డెబిట్ చేయటం నియమ విరుద్ధం.

iii. **పరిమితికి మించిన వ్యయం:** కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఎడ్మినిస్ట్రేటివ్ నిధులను నియమాల ప్రకారం రోజువారీ ఆఫీసు ఖర్చులకు, ఓఎమ్ఎమ్ఎస్ నిర్వహణకు, కంప్యూటర్ల నిర్వహణకు వినియోగించుకోవాలి. ఏపీఎస్ఆర్ఆర్డీఏ 2010-11, 2011-12 సంవత్సరాలలో సాలుసరి పరిమితి ₹50 లక్షలకు మించి ₹94.28 లక్షలు ఖర్చు పెట్టింది. ఇందుకు కారణాలను కూడా వివరించలేదు. భౌగోళిక సమాచార వ్యవస్థ (జీ ఐఎస్) కోసం ఏకమొత్తంగా ₹1.03 కోట్లు ఖర్చయినట్లు ప్రభుత్వం బదులిచ్చింది (2014 మార్చి). ఈ నిధినుంచి ఖర్చు చేసే ముందు కేంద్ర ప్రభుత్వ అనుమతి తప్పనిసరి కనుక ఈ సమాధానం సరికాదు.

iv. **కాలదోషం పట్టిన చెక్కులను రివర్స్ చేయకపోవటం:** 2005 నుండి 2011 సంవత్సరాలకు చెందిన 219 చెక్కులు కాలదోషంపట్టినవి ఉన్నాయి. వీటి మొత్తం విలువ ₹3.59 కోట్లు. ఆతర్వాతి సంవత్సరాల వివరాలు కూడా అందుబాటులో లేవు. ఈ చెక్కుల విషయంలో 2013 జూలై నాటికి చర్యలు తీసుకొన లేదు. మురిగిపోయిన చెక్కుల విలువను రద్దుచేశామని ప్రభుత్వం బదులిచ్చింది (2014 మార్చి). అయితే, ఇందుకు సంబంధించిన రికార్డులను ఆడిట్ ముందుంచలేదు.

### 2.12.2 కీలకమైన రిజిస్టర్ల నిర్వహణ లోపం

ప్రాజెక్టు అమలు సంస్థల రికార్డులు మచ్చుకు తనిఖీ చేయగా కొన్ని ముఖ్యమైన రిజిస్టర్లు నిర్వహించకపోవటం వెలుగుచూసింది. అందుకు కొన్ని నిదర్శనలు ఈ కింద ఇవ్వటం జరిగింది.

i. పీఎమ్జీ ఎస్వై విధివిధానాల ప్రకారం నిర్మాణ పనుల రిజిస్టరు, కాంట్రాక్టర్ల లెడ్జరు, డెబిట్ అండ్ క్రెడిట్ రిజిస్టరు, స్టాట్యుటరీ డిడక్షన్స్, వడ్డీతో కూడిన సెక్యూరిటీలు/బ్యాంకు గ్యారంటీలు, వర్క్ అడ్వాన్సులు, ఈఎమ్డీ, సెక్యూరిటీ డిపాజిట్, స్టాట్యుటరీ లయబిలిటీస్, శాంక్షన్డ్ ఎస్టిమేట్స్, కొలతల పుస్తకం, చెక్కు పుస్తకాలు/రశీదు పుస్తకాలు, ప్రయాణ ఖర్చులు, చెల్లింపుకాని బిల్లులు, ఆస్తుల రిజిస్టరు వంటివి నిర్వహించాలి. నమూనా తనిఖీ చేపట్టిన ఏ అమలు సంస్థలలోను ఈ రికార్డులు లేవు.

ii. అకౌంట్స్ మాన్యువల్లోని పేరా 4.1.1 ప్రకారం ప్రోగ్రాం ఫండ్, ఎడ్మినిస్ట్రేటివ్ ఫండ్, నిర్వహణ ఫండ్లకు విడివిడిగా పద్దు పుస్తకాలు నిర్ణీత ఫారంలో నిర్వహించాల్సిఉండగా నమూనా తనిఖీ చేసిన ఏ జిల్లాలోనూ 2009-12 సంవత్సరాలలో ఈ విధంగా చేయటంలేదు. దీనివలన పద్దుల వాస్తవికతను ఆడిట్ పరిశీలించలేదు.

ప్రోగ్రాం ఫండ్, ఎడ్మిస్ట్రేటివ్ ఫండ్లకు సంబంధించిన సమాచారం ఓఎమ్ఎమ్ఎస్లో లభ్యమవుతుందని ప్రభుత్వం బదులిచ్చింది (2014 మార్చి). అన్ని అమలు సంస్థలలో రికార్డులను అంతర్గతంగా తనిఖీ చేయిస్తామనీ, అన్ని రికార్డులూ నిర్వహిస్తామనికూడా ప్రభుత్వం చెప్పింది.

[20] శ్రీకాకుళం జిల్లాలో ₹37.45 లక్షలు (పనుల వివరాలు ఇవ్వలేదు), కృష్ణా జిల్లాలో 71 పనులకు ₹14.88 లక్షలు

iii. అకౌంట్స్ మాన్యువల్‌లోని పేరా 7.6.1 ప్రకారం నగదు పుస్తకం నిర్వహించవలసిఉండగా, తూర్పు గోదావరి జిల్లాలో మాత్రం 2008-12 సంవత్సరాల నడుమ నిర్వహణ ఫండ్ కోసం నగదు పుస్తకం రూపొందించలేదు. ఆతర్వాత ప్రోగ్రాం ఫండ్‌తో కలిపి ఉమ్మడిగా ఒక నగదు పుస్తకం పెట్టారు. ఎడ్మినిస్ట్రేటివ్ ఫండ్, ప్రోగ్రాం ఫండ్‌ల నగదు పుస్తకాలు 2008-13 మధ్యన క్లోజ్ చేయలేదు. బ్యాంకు పద్దులతో రికన్సిలియేషన్ కూడా చేయలేదు. ఇందుకు సంబంధించి ప్రభుత్వం వివరణ ఇవ్వలేదు (2014 మార్చి).

iv. అకౌంట్స్ మాన్యువల్ ప్రకారం పద్దులను నెలవారీగానూ, వార్షికంగానూ రూపొందించి గవర్నింగ్ కౌన్సిల్ ఆమోదానికి పంపించాలి. ఏపీఎస్ఆర్ఆర్‌డీఏ మాత్రం నిర్వహణ ఫండ్ కోసం 2008-13 సంవత్సరాలలో ఈవిధంగా పద్దులు రాయలేదు. ఎన్ఆర్ఆర్‌డీఏ నుంచి 2007లో ఈ విషయమై ప్రత్యేకంగా ఆదేశాలు కూడా అందాయి. అయితే, 2013 మార్చి వరకు వార్షిక పద్దులను ఆ సంవత్సరం 2013 నవంబరులో ఖరారు చేసినట్లు ప్రభుత్వం తెలిపింది (2014 మార్చి). ఆ వివరాలను మాత్రం ఆడిట్‌కు ఇవ్వలేదు.

## 2.13 ప్రభావ విశ్లేషణ

ఒక జిల్లాలో గ్రామాల మధ్య కొత్త రహదారుల ప్రభావం అవగతం చేసుకొనేందుకు ఎప్పటికప్పుడు స్వతంత్రంగా అధ్యయనం చేయటంకోసం ఎన్ఆర్ఆర్‌డీఏ నూరు శాతం ఆర్థిక సాయం అందిస్తుంది. అయితే, నమూనా తనిఖీ చేపట్టిన జిల్లాలలో ఎక్కడా ఈ విధమైన అధ్యయనం జరగలేదు. గ్రామీణ రహదారుల ప్రభావ విశ్లేషణ ఇక మీదట చేపడతామని ప్రభుత్వం చెప్పింది (2014 మార్చి).

## 2.14 సారాంశం

*అంతర్గత రహదారుల సమాహారం, సమగ్ర ప్రాజెక్టు నివేదికలు రూపొందించటంవంటి ప్రణాళికా ప్రక్రియలు లేకుండానే అవాస్తవికమైన సమాచారం ఆధారంగా కార్యక్రమం అమలు జరిగింది. ఫలితంగా రాష్ట్రంలో కొన్ని గ్రామాలకు రహదారి సౌకర్యాలు ఒనగూరలేదు. పలు నిర్మాణ పనులను ఆరంభించేముందు అవసరమైన సర్వేలు, సన్నాహక చర్యలు చేపట్టలేదు. పర్యవసానంగా, అనేక పనులు అర్ధంతరంగా ఆగిపోవటం, రద్దుకావటం, అసంపూర్తిగా మిగిలిపోవటం, అటవీ శాఖ అనుమతులు రాకపోవటం, స్థలవివాదాలు, డిజైన్లలో మార్పులు చోటుచేసుకోవటం, సవరించిన పాలనాపరమైన అనుమతులు లభించకపోవటం మొదలైన ఆటంకాలు ఎదురయ్యాయి. ఇక టెండరు ప్రక్రియ విషయానికొస్తే, సాంకేతిక అనుమతి పొందకుండానే టెండర్లు పిలిచారు. గుర్తించిన గ్రామాలకు పూర్తి స్థాయిలో రహదారి వసతి కల్పించకుండానే పనులు పూర్తిచేయటం, కార్యక్రమ విధివిధానాలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టటం వంటి లోపాలుకూడా కనిపించాయి. నాణ్యతానియంత్రణ తనిఖీలు కట్టుదిట్టంగా లేవు. నాణ్యత తనిఖీలలో గుర్తించిన లోటుపాట్లను సరిదిద్దేందుకు తగు చర్యలు తీసుకొనలేదు. ఆర్థిక నిర్వహణ కార్యసాధకంగా లేకపోవటంవలన రహదారుల మరమ్మతులకు తగినన్ని నిధులు ఇవ్వకపోవటం, అడ్వాన్సులు సర్దుబాటు చేయకపోవటం వంటివి చోటుచేసుకున్నాయి. కీలకమైన పలు రిజిస్టర్లు సక్రమంగా రాయకపోవటం, కొన్ని అసలే లేకపోవటం జరిగింది. ఆశించినవిధంగా ప్రభావ విశ్లేషణ చేపట్టలేదు.*

## 2.15 సిఫార్సులు

➢ రహదారుల నిర్మాణం సకాలంలో, సక్రమంగా పూర్తి చేసేందుకు వీలుగా ప్రభుత్వం ప్రణాళికా ప్రక్రియను విధివిధానాల ప్రకారం కట్టుదిట్టంగా అమలుచేయాలి. నిర్మాణ పనులకు అనుమతులు మంజూరు చేయవలసిన ఇతర శాఖలతో సమన్వయం సాధించాలి.

- విధివిధానాలలో నిర్దేశించిన టెండరు ప్రక్రియను కచ్చితంగా అమలుచేసి, నిర్మాణ పనులను సకాలంలో అప్పగించి, అవి సజావుగా పూర్తయ్యేలా చూడాలి.
- నిర్మాణాలకవసరమైన నిధుల విడుదల, వాటి వినియోగం సునిశితంగా పర్యవేక్షించాలి. రహదారుల చిరకాల మన్నిక కోసం వాటి నిర్వహణకు కూడా తగినన్ని నిధులు కేటాయించాలి.
- నాణ్యతా నియంత్రణ పరీక్షలు వివిధ దశలలో, విభిన్న స్థాయిలలో కచ్చితంగా జరిగేలా ప్రభుత్వం శ్రద్ధ వహించాలి. ఈ పరీక్షలలో గుర్తించిన లోటుపాట్లను వెనువెంటనే సరిదిద్దేందుకు చర్యలు చేపట్టాలి.

# అధ్యాయం-3

## సంపూర్ణ పారిశుధ్య పథకం/
## నిర్మల్ భారత్ అభియాన్‌పై ఆడిట్ సమీక్ష

**పంచాయతీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ**

పేజీలు 31 - 49

## 3.1 పరిచయం

సంపూర్ణ పారిశుధ్య పథకాన్ని (టీఎస్‌సీ) కేంద్ర ప్రభుత్వం 1999లో ప్రవేశపెట్టింది. గ్రామీణ పారిశుధ్య రంగంలో దీర్ఘకాలిక సంస్కరణలు తీసుకురావటం దీని లక్ష్యం. ఈ పథకానికి ప్రేరణనివ్వటం కోసం కేంద్ర ప్రభుత్వం 2003 లో నిర్మల్ గ్రామ పురస్కార్‌ను (ఎన్‌జీపీ) కూడా ఆరంభించింది. ఎన్‌జీపీ విజయం తాలుకు ఉత్సాహంతో టీఎస్‌సీని 2012 లో నిర్మల్ భారత్ అభియాన్ (ఎన్‌బీఏ)గా మార్చి పల్లెపట్టులలో పారిశుధ్య వికాసాన్ని మరింత వ్యూహాత్మకంగా విస్తృత ప్రాతిపదికన సాధించ సంకల్పించింది.

| *టీఎస్‌సీ/ఎన్‌బీఏ విశిష్టతలు* |
|---|
| • మరుగుదొడ్ల నిర్మాణానికి ప్రోత్సాహకమివ్వటం ద్వారా గ్రామీణ బీపీఎల్/ఏపీఎల్[1] కుటుంబాలన్నింటికీ 2012 లోగా ప్రయోజనాలను విస్తరింపచేయటం (*దీనిని 2011 లో 2022 వరకూ పొడిగించారు*); |
| • ఆరోగ్యంపట్ల ప్రజలకు అవగాహన కల్పించటం ద్వారా మన్నికైన పారిశుధ్య వసతులను పెంపొందించే లాగున పంచాయతీరాజ్ సంస్థలను, సమాజాన్నీ ప్రేరేపించటం; |
| • పాఠశాలలో మరుగుదొడ్ల నిర్మాణం (2008 మార్చి), అంగన్‌వాడీలలో కూడా మరుగుదొడ్ల సదుపాయం (2009 మార్చి) కల్పించటం (*దీనిని 2011 లో 2013 వరకూ పొడిగించారు);* |
| • గ్రామాలలో పారిశుధ్య సామాగ్రి దుకాణాలు, ఉత్పత్తి కేంద్రాలు స్థాపించి చవకగానూ జీవావరణపరంగా సురక్షితంగానూ ఉండే పారిశుధ్య విధానాలను ప్రోత్సహించటం; |
| • ఘనవ్యర్థాలు, ద్రవవ్యర్థాల నిర్మూలనపై దృష్టి సారించి పర్యావరణహితమైన పారిశుధ్య పద్ధతులను ప్రజా నిర్వహణలో అభివృద్ధి చేయటం. |

## 3.2 వ్యవస్థాగత నిర్మాణం

రాష్ట్ర నీటి సరఫరా, పారిశుధ్య మిషన్ (ఎస్‌డబ్ల్యూఎస్‌ఎమ్)[2] అనే సంస్థ రాష్ట్రంలో ఎన్‌బీఏ అమలుచేసేందుకు నోడల్ ఏజన్సీగా వ్యవహరిస్తుంది. ప్రాజెక్టు డైరెక్టరు దీనికి నేతృత్వం వహిస్తారు. గ్రామీణ నీటి సరఫరా మరియు పారిశుధ్యశాఖ (ఆర్‌డబ్ల్యూఎస్‌ఎస్) ముఖ్య కార్యదర్శి ఈ సంస్థకు ఛైర్మన్‌గా వ్యవహరిస్తూ విధానపరమైన నిర్దేశంతోపాటు సమగ్ర పర్యవేక్షణ కూడా చేస్తారు. ఇక జిల్లా స్థాయిలో జిల్లా నీటి సరఫరా, పారిశుధ్య మిషన్ (డీడబ్ల్యూఎస్‌ఎమ్) (దీనికి ఛైర్మన్ అధిపతి), జిల్లా ప్రజా పరిషత్, ఆర్‌డబ్ల్యూఎస్‌ఎస్ ఇంజనీరింగ్ డివిజన్లు, మండలపరిషత్ అభివృద్ధి అధికారులు, గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్య కమిటీలు ఉంటాయి.

## 3.3 ఆడిట్ విధివిధానాలు

### 3.3.1 ఆడిట్ లక్ష్యాలు

ఈ దిగువ అంశాలను నిర్ధారించుకోవటం కోసం ఆడిట్ ఈ సమీక్షను చేపట్టింది.

- గ్రామీణ ప్రాంతాలలో పారిశుధ్య విస్తరణ త్వరితంగా జరిగేందుకు తగు ప్రణాళిక రూపొందించారా;
- ప్రజలలో అవగాహన కల్పించి ఆసక్తిని పెంపొందించే విధంగా టీఎస్‌సీలోని అన్ని అంశాలనూ కట్టుదిట్టంగా అమలుచేశారా;

[1] దారిద్ర్యరేఖకు దిగువన, ఎగువన ఉన్న కుటుంబాలు, ఎస్సీ/ఎస్టీ, చిన్న, సన్నకారు రైతులు, భూమిలేని పేదలు, వికలాంగులు, మగదక్షత లేని కుటుంబాలు

[2] పంచాయతీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి (ఆర్‌డబ్ల్యూఎస్) శాఖ జీఓఎమ్ఎస్ నెం.460 తేదీ 19 డిసెంబరు 2002 ద్వారా ఆవిర్భవించింది. ఇందులో 17 మంది సభ్యులుంటారు

- పాఠశాలలు, అంగన్‌వాడీలు, వ్యక్తిగత కుటుంబాల విషయంలో లక్ష్యాలమేరకు కార్యక్రమాన్ని అమలు చేశారా;
- కార్యక్రమాన్ని ప్రభావశీలంగా అమలు చేసేందుకు తగిన నిధులు సమకూర్చి వాటిని కార్యసాధకంగా వినియోగించారా;
- పర్యవేక్షణ, మూల్య నిర్ధారణ వ్యవస్థలు సమర్ధవంతంగా పని చేస్తున్నాయా.

### 3.3.2 ఆడిట్ ప్రామాణికంగా తీసుకున్న అంశాలు

ఆడిట్ పరిశీలనలను ఈ కింది ప్రామాణికాంశాలతో సరిపోల్చుకోవటం జరిగింది:

- ఆయా సంవత్సరాలకు సంబంధించిన రాష్ట్ర బడ్జెట్‌లు;
- టీఎస్‌సీ, ఎన్‌బీఏ గురించి కేంద్ర ప్రభుత్వం పలు విడతలుగా జారీచేసిన మార్గదర్శకాలు;
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమయానుసారం వెలువరించిన ఆదేశాలు, మార్గసూచీలు, ఉత్తర్వులు;
- జిల్లాలవారీగా ప్రాజెక్టు అమలు ప్రణాళికలు, ఇంకా ఎస్‌డబ్ల్యూఎస్ఎమ్, డీడబ్ల్యుఎస్‌సీ సమావేశాలలో చేసిన నిర్ణయాలు;
- ఆంధ్రప్రదేశ్ ఆర్థిక నియమావళి.

### 3.3.3 ఆడిట్ పరిధి, ఆడిట్ పద్ధతి

ఆడిట్ తనిఖీలు 2013 జూలై, ఆగస్టు నెలల్లో చేపట్టి, ఇందులో 2008-13 సంవత్సరాల నడుమ టీఎస్‌సీ/ఎన్‌బీఏ అమలుతీరును సమీక్షించటం జరిగింది. ఈ ఆడిట్ విశ్లేషణలో భాగంగా యాదృచ్ఛిక నమూనా ప్రాతిపదికన ఎంపిక చేసుకున్న ఆరు జిల్లాలలో[3] ఆర్‌డబ్ల్యూఎస్ఎస్ శాఖ, ఎస్‌డబ్ల్యూఎస్ఎమ్, డీడబ్ల్యుఎస్ఎమ్ కార్యాలయాలలోని రికార్డులను తనిఖీ చేయటం జరిగింది. ఎంపికచేసిన ప్రతి జిల్లా నుంచి మూడు మండలాలను, అలాగే ప్రతి మండలం నుంచి పదేసి గ్రామ పంచాయతీలను రికార్డుల పరిశీలనకు తీసుకోవటం జరిగింది. నమూనా తనిఖీ చేసిన గ్రామాల నుంచి 1,427 యూనిట్లను[4] యాదృచ్ఛిక విధానంలో ఎంపిక చేసి క్షేత్రస్థాయి సర్వే, నిర్మాణాల ప్రత్యక్ష పరిశీలన చేయటం జరిగింది. కార్యక్రమం అమలుపై అభిప్రాయ సేకరణ కోసం 2,183 మంది లబ్ధిదారులను సంప్రతించటం జరిగింది. ఆడిట్ కోసం ఎంపిక చేసిన నమూనా వివరాలు ***అనుబంధం-3.1*** లో ఉన్నాయి. టీఎస్‌సీ/ఎన్‌బీఏ అమలుపై ఆడిట్ సమీక్ష చేపడుతున్న విషయం ప్రభుత్వానికి 2013 మే నెలలో తెలియచేసి ఆడిట్ లక్ష్యాలు, ఆడిట్ పరిధి, ఆడిట్ పద్ధతి, నమూనా ఎంపిక వివరాలను ఎస్‌డబ్ల్యూఎస్ఎమ్ అధికారులకు వివరించటం జరిగింది. సమీక్షానంతర సమావేశం 2014 మార్చి నెలలో నిర్వహించి, ఆడిట్ పరిశీలనలను అక్కడ చర్చించి, ప్రభుత్వం ఇచ్చిన సమాధానాలను ఈ నివేదికలో తగు రీతిన పొందుపరచటం జరిగింది.

## 3.4 నిధుల సమీకరణ

టీఎస్‌సీ కోసం నిధులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టిక 3.1 లో వివరించిన నిష్పత్తిలో సమకూరుస్తాయి. వ్యక్తిగత మరుగుదొడ్లకు లబ్ధిదారులు కూడా కొంత ఖర్చును భరించవలసి ఉంటుంది. ఆమోదం పొందిన జిల్లా ప్రణాళికల ప్రకారం కేంద్ర ప్రభుత్వం నిధులను 2010 సెప్టెంబరు వరకూ జిల్లా అమలు సంస్థలకే నేరుగా పంపించేది. తదుపరికాలంలో నిధులను కేంద్రీయ ప్రణాళికా పథకాల పర్యవేక్షణ వ్యవస్థ (సీపీఎస్ఎమ్ఎస్) ద్వారా

[3] అనంతపురం, కృష్ణా, మహబూబ్‌నగర్, నెల్లూరు, రంగారెడ్డి, వరంగల్

[4] వ్యక్తిగత మరుగుదొడ్లు (టీఎస్‌సీ అమలుచేసిన యూనిట్లు 971, టీఎస్‌సీ అమలు చేయనివి 346); పాఠశాల మరుగుదొడ్లు - 84; అంగన్‌వాడీ మరుగుదొడ్లు - 26 (మహబూబ్‌నగర్, రంగారెడ్డి, వరంగల్ జిల్లాలలో)

ఎస్‌డబ్ల్యూఎస్ఎమ్ నియమిత బ్యాంకు (యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా) ఖాతాకు విడుదల చేస్తున్నారు. టీఎస్‌సీ లోని కీలక అంశాలు (కాంపొనెంట్లు), మొత్తం కేటాయింపులో వాటి వాటా, ప్రతి సబ్ కాంపొనెంటుకూ నిధుల సమీకరణ వివరాలు పట్టిక 3.1 లో ఉన్నాయి.

**పట్టిక 3.1**


| క్రమ సంఖ్య | కాంపొనెంటు | మొత్తం ప్రాజెక్టు వ్యయంలో కేటాయింపు శాతం | నిధుల సమీకరణ | | |
|---|---|---|---|---|---|
| | | | కేంద్రం (%) | రాష్ట్రం (%) | లబ్ధిదారులు (%) |
| 1 | ఐఈసీ, ప్రేరణ, అవగాహన వంటి సన్నాహక కార్యక్రమాలు | 15% వరకు | 80 | 20 | 0 |
| 2 | ప్రత్యామ్నాయ పంపిణీ యంత్రాంగం (ఉత్పత్తి కేంద్రాలు (పీసీ)/గ్రామీణ పారిశుధ్య సామాగ్రి దుకాణాలు (ఆర్ఎస్ఎమ్) | 5% వరకు (జిల్లాకు గరిష్ఠంగా ₹35 లక్షలు - పీసీ/ఆర్ఎస్ఎమ్‌లకు, సామూహిక అరువు కింద రివాల్వింగ్ ఫండ్‌గా మరొక ₹50 లక్షలు) | 80 | 20 | 0 |
| | రివాల్వింగ్ ఫండ్ | 5% వరకు | 80 | 20 | 0 |
| 3 | (i) వ్యక్తిగత మరుగుదొడ్లు | సమగ్ర విస్తరణకు వాస్తవంగా అవసరమయ్యే మొత్తం | ₹3200 | ₹1400 | ₹900 |
| | (ii) సామూహిక మరుగుదొడ్లు | | 60 | 30 | 10 |
| 4 | పాఠశాల, అంగన్‌వాడీ మొదలైన వాటిలో మరుగుదొడ్లు (హార్డ్‌వేర్, సర్వీసులు) | సమగ్ర విస్తరణకు వాస్తవంగా అవసరమయ్యే మొత్తం | 70 | 30 | 0 |
| 5 | ఆఫీసు ఖర్చులు, శిక్షణ, సిబ్బంది, పర్యవేక్షణ, మూల్య నిర్ధారణ మొదలైనవి | 5% కన్నా తక్కువ (2011) | 80 | 20 | 0 |
| | | 4% వరకు (2012) | 80 | 20 | 0 |
| 6 | ఘనవ్యర్థాలు/ద్రవవ్యర్థాల నిర్మూలన (క్యాపిటల్ వ్యయం) | 10% వరకు (2011) | 60 | 20 | 20 |
| | | ఎస్ఎల్‌డబ్ల్యూఎమ్ ప్రకారం వాస్తవ వ్యయం పరిమితికి లోబడి (2012) | 70 | 30 | 0 |

కేంద్ర ప్రభుత్వం తన వాటాను రెండు విడతలుగా ఇస్తుంది. రెండవ వాయిదాను మాత్రం కొన్ని షరతులమేరకు విడుదల చేస్తుంది. అవి: లక్ష్యాలు సాధించటం, పదిహేను రోజులలోగా తన వాటా మొత్తం విడుదల చేస్తానని రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇవ్వటం, ఎస్‌డబ్ల్యూఎస్ఎమ్ దగ్గర ఉన్న నిధులలో 60 శాతం వినియోగించటం, ఆడిట్ సర్టిఫికెట్లు, వినియోగ ధృవపత్రాలు సమర్పించటం మొదలైనవి. కేంద్రం నుంచి నిధులు వచ్చిన 15 రోజులలోగా వాటిని ఎస్‌డబ్ల్యూఎస్ఎమ్ తనవాటాతో కలిపి డీడబ్ల్యూఎస్ఎమ్‌లకు విడుదల చేస్తుంది. తిరిగి డీడబ్ల్యూఎస్ఎమ్‌లు నిధులను వివిధ అమలు సంస్థలకు పంపిణీ చేస్తాయి.

## 3.5 ఆర్థిక, వాస్తవిక లక్ష్యసాధన

### 3.5.1 ఆదాయ వ్యయాలు

కేంద్ర ప్రభుత్వం ఈ నిధులను రాష్ట్ర బడ్జెటరీ వ్యవస్థతో సంబంధంలేకుండా నేరుగా ఇస్తుండటం వలన ఈ ఖర్చుల జాడలు వినిమయపద్దులలోకానీ, ఆర్థికపద్దులలోకానీ కనిపించవు. ఈ కార్యక్రమానికి సంబంధించి 2008-13 సంవత్సరాల నడుమ చోటుచేసుకున్న రాబడులు, ఖర్చుల వివరాలు చార్టు 3.1 లో ఉన్నాయి.




*మూలం: ఎస్‌డబ్ల్యూఎస్ఎమ్ ఆడిట్ నివేదికలు*

ఈ ప్రక్క చార్టులో వివరించిన విధంగా 2008-13 సంవత్సరాల నడుమ వచ్చిన నిధుల నుంచి చేసిన ఖర్చులు 21 నుండి 46 శాతం ఉన్నాయి. వినియోగం కాకుండా మిగిలి పోయిన నిధులు వివిధ డీడబ్ల్యూఎస్ఎమ్‌ల దగ్గర ఉన్నాయి. ఈ నిధులు పూర్తిగా వినియోగంకాక పోయినాగానీ ఎస్‌డబ్ల్యూఎస్ఎమ్ మాత్రం నిధులను ఇస్తూనే ఉంది.

### 3.5.2 వాస్తవ పురోగతి

టీఎస్‌సీ అమలుచేయటంలో 2009-13 సంవత్సరాల నడుమ రాష్ట్ర ప్రభుత్వం సాధించిన వాస్తవ పురోగతి ఈ కింది విధంగా ఉంది (2008-09 సంవత్సరపు వివరాలను ఎస్‌డబ్ల్యూఎస్ఎమ్ ఇవ్వలేదు):

**పట్టిక 3.2**

| సంవత్సరం | వ్యక్తిగత మరుగుదొడ్లు (లక్షలలో) | | వివిధ సంస్థలలో మరుగుదొడ్లు | | సామాజిక మరుగుదొడ్ల సముదాయాలు | | పారిశుధ్య సామాగ్రి దుకాణాలు/ ఉత్పత్తి కేంద్రాలు | | ఘన/ద్రవ వ్యర్థాల నిర్మూలన (ప్రాజెక్టులు) | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| | లక్ష్యం | నిర్మించినవి | లక్ష్యం | నిర్మించినవి | లక్ష్యం | నిర్మించినవి | లక్ష్యం | నిర్మించినవి | లక్ష్యం | నిర్మించినవి |
| **2009-10** | 13.73 | 5.83 (42%) | 30040 | 3001 (10%) | 0 | 13 | 0 | 0 | 0 | 0 |
| **2010-11** | 20.90 | 10.50 (50%) | 14392 | 4777 (33%) | 89 | 27 (30%) | 0 | 0 | 3378 | 289 (9%) |
| **2011-12** | 13.62 | 4.84 (36%) | 18403 | 6850 (37%) | 111 | 21 (19%) | 0 | 0 | 5365 | 673 (13%) |
| **2012-13** | 12.64 | 2.88 (23%) | 44049 | 5759 (13%) | 61 | 09 (15%) | 155 | 61 (39%) | 3482 | 0 (0%) |
| మొత్తం | **60.89** | **24.05** | **106884** | **20387** | **261** | **70** | **155** | **61** | **12225** | **962** |

*మూలం: ఎస్‌డబ్ల్యూఎస్ఎమ్ రికార్డులు*
*బ్రాకెట్లలో ఉన్న అంకెలు లక్ష్య సాధన శాతాన్ని సూచిస్తాయి*

వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం 2009-10 సంవత్సరంలోని 42 శాతం నుంచి 2010-11 సంవత్సరంలో 50 శాతానికి పెరిగినా, 2011-12లో 36 శాతానికీ, 2012-13లో ఏకంగా 23 శాతానికీ తగ్గిపోయింది. అదే విధంగా, వివిధ సంస్థలలో మరుగుదొడ్ల నిర్మాణం కూడా 2009-10 లోని 10 శాతం నుంచి 2010-11లో 33 శాతానికీ, 2011-12లో 37 శాతానికీ పెరిగి, 2012-13లో 13 శాతానికి పడిపోయింది. సామాజిక మరుగుదొడ్ల నిర్మాణం 2010-11 సంవత్సరంలో 30 శాతం ఉండగా అది 2012-13లో 15 శాతం మాత్రమే. అదేవిధంగా, ఘన/ద్రవ వ్యర్థాల నిర్మూలన ప్రాజెక్టుల లక్ష్యసాధన 2010-11లోని 9 శాతం నుంచి 2011-12 సంవత్సరంలో 13 శాతం నమోదుకాగా 2012-13లో ఇది సున్నాకు చేరుకుంది. ఇక గ్రామీణ పారిశుధ్య దుకాణాలు, ఉత్పత్తి కేంద్రాల కోసం 2009-12 సంవత్సరాల మధ్య లక్ష్యాలేవీ నిర్ణయించలేదు. ఐతే, 2012-13లో మాత్రం లక్ష్యాలను 39 శాతం మేర సాధించారు. ఆవిధంగా, టీఎస్‌సీ కార్యక్రమాన్ని కార్యసాధకంగా అమలుచేయటం కోసం తలపెట్టిన ప్రత్యామ్నాయ పంపిణీ యంత్రాంగం ఊపందుకోలేదు.

వార్షిక అమలు ప్రణాళిక (ఏఐపీ) కోసం నిర్దేశించిన లక్ష్యాలు ఉజ్జాయింపున లెక్క కట్టినవేననీ, కార్యక్రమాన్ని 2012 నాటికి పూర్తిచేయాలనే తలంపుతో లక్ష్యాలను చాలా హెచ్చుస్థాయిలో నిర్ణయించారనీ, అయితే లబ్ధిదారుల నుంచి డిమాండు లేనందున క్షేత్రస్థాయిలో లక్ష్యసాధన సాధ్యమవలేదనీ ప్రభుత్వం బదులిచ్చింది (2014 ఫిబ్రవరి). అయితే, ఇది ప్రజలలో చైతన్యం కల్పించి ప్రోత్సహించవలసిన కార్యక్రమం కనుక ప్రభుత్వం ఐఈసీ కార్యకలాపాలను మరింత శ్రద్ధగా చేపట్టి, ప్రజలకు అవగాహన కల్పించి, ఆసక్తిని పెంపొందించవలసి ఉంది.

## 3.6 ప్రణాళిక

### 3.6.1 స్థానిక సమాజం భాగస్వామ్యం

ఇళ్లలోనూ, పాఠశాలలలోనూ పారిశుధ్య వసతులు, పరిశుభ్రమైన పరిసరాలతోపాటు సమాజం అవసరాలకు తగినట్లు ప్రత్యామ్నాయ పంపిణీ యంత్రాంగం నెలకొల్పే దృఢ సంకల్పంతో ప్రజలలో అవగాహన పెంపొందించి ఆసక్తిని రేకెత్తించటం కోసం టీఎస్‌సీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ఒక 'సమాజ ప్రేరిత' 'ప్రజాముఖ' కార్యక్రమంగా ప్రవేశపెట్టింది.

పల్లెసీమలలోని ఇళ్లు, పాఠశాలలు, అంగన్‌వాడీలు, సామాజిక మరుగుదొడ్ల సముదాయాలలో పారిశుధ్య వసతులకు గుర్తింపును కలిగించటం కోసం ఐఈసీ కార్యకలాపాలు దోహదపడాలని టీఎస్‌సీ మార్గదర్శకాలలో సూచించారు. అంతేకాకుండా, గ్రామీణ నీటిసరఫరా, పారిశుధ్య కమిటీలను (వీడబ్ల్యూఎస్‌సీ) ఏర్పాటుచేసి ప్రతి గ్రామంలోనూ ప్రజలకు ప్రేరణ కల్పించి, సంఘటితం చేయటం ద్వారా కార్యక్రమం అమలుకు ఊతమివ్వాల్సి ఉంటుంది. అయితే, 2013-14 సంవత్సరపు వార్షిక ప్రణాళిక (ఏఐపీ) పరిశీలించగా 13,501 వీడబ్ల్యూఎస్‌సీలు ఏర్పడగా (21,757 గ్రామ పంచాయతీలకుగాను) వీటిలో 2013 జనవరి చివరినాటికి కేవలం 10,132 వీడబ్ల్యూఎస్‌సీలు మాత్రమే (47 శాతం) పనిచేస్తున్నాయి. వీడబ్ల్యూఎస్‌సీలను ఏర్పాటుచేసే పని జరుగుతున్నదనీ 2014 మార్చిలోగా ఇది పూర్తవుతుందనీ ప్రభుత్వం బదులిచ్చింది (2014 ఫిబ్రవరి).

### 3.6.2 నైపుణ్య వికాసం

వీడబ్ల్యూఎస్‌సీ, పీఆర్ఐ సభ్యులతోపాటు బ్లాకు, మండల, జిల్లాస్థాయి నిర్వాహకులకూ, అదేవిధంగా నియోజిత ప్రజారోగ్య కార్యకర్తలు (ఆశా), ఇంకా ఆరోగ్య శిక్షణా నిర్వాహకులు, అంగన్‌వాడీ కార్యకర్తలకు అవసరమైన శిక్షణ[5] కల్పించవలసి ఉంటుంది. స్వయం సహాయక బృందాలకు తాపీ పనులు, ఇటుకల ఉత్పత్తి, పారిశుధ్య పరికరాల ఉత్పత్తిలో శిక్షణనివ్వాలి. ఆదేవిధంగా బ్లాకు/మండలస్థాయి, బ్లాకు రిసోర్స్ సెంటర్లు (బీఆర్‌సీ) ఏర్పరచి గ్రామీణ సమాజాన్ని, గ్రామపంచాయతీలను, వీడబ్ల్యూఎస్‌సీలను తగు శిక్షణ, ప్రేరణతో ప్రోత్సహించాలి.

నమూనా తనిఖీ చేసిన యూనిట్లలో రికార్డులు పరిశీలించగా మహబూబ్‌నగర్ జిల్లాలో శిక్షణ తరగతులు ప్రోత్సాహకరంగానే ఉండగా, నెల్లూరు జిల్లాలో మాత్రం గ్రామపంచాయతీలలో శిక్షణకు తగు ఏర్పాట్లులేవని తెలిసింది. అనంతపురం, కృష్ణా, రంగారెడ్డి జిల్లాలలో ఇవి అంత సమర్ధవంతంగా లేవు. ఇక వరంగల్ జిల్లాలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమాల వివరాలను డీడబ్ల్యూఎస్ఎమ్ కార్యాలయం ఆడిట్‌కు అందచేయలేదు.

వరంగల్ జిల్లాలో బీఆర్‌సీలు ఏర్పాటు కాలేదు. ఇక కృష్ణా, అనంతపురం జిల్లాలలో బీఆర్‌సీలను ఏర్పాటు చేసినాగానీ వాటి పనితీరు కార్యసాధకంగా లేదు. అలాగే, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, నెల్లూరు జిల్లాలలో బీఆర్‌సీలు ఏర్పడినాగానీ వాటి కార్యకలాపాల ఆనవాళ్లు రికార్డులలో లభ్యం కాలేదు. కృష్ణాజిల్లాలో ఆడిట్ గమనించిన విషయాలను ప్రభుత్వం అంగీకరిస్తూ (2014 ఫిబ్రవరి), రంగారెడ్డి జిల్లాలో వీడబ్ల్యూఎస్‌సీ సభ్యులకు, స్వయం సహాయక బృందాలకూ 2012-13 సంవత్సరంలో మాత్రం శిక్షణ ఇచ్చినట్టు తెలిపింది. ఇతర జిల్లాల వివరాలు చెప్పలేదు.

[5] టీఎస్‌సీ కార్యక్రమం కోసం కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన ఐఈసీ మార్గదర్శకాలు 2010

## 3.7 కార్యక్రమం అమలు

### 3.7.1 సమాచారం, శిక్షణ, ప్రచారం (ఐఈసీ)

గ్రామీణుల నడవడిలో మార్పులు తీసుకురావటం ద్వారా పల్లెపట్టులలోని ఇళ్లు, పాఠశాలలు, అంగన్‌వాడీలు, సామాజిక మరుగుదొడ్ల సముదాయాలలో పారిశుధ్య వసతులపట్ల ఆసక్తిని ఇనుమడింపచేసే దిశలో ఐఈసీ కార్యకలాపాలు అత్యంత కీలకమవుతాయి. ఈ కార్యకలాపాలు[6] నిరంతరం కొనసాగుతూ పాలనావ్యవస్థలోని అన్ని అంచెలకూ (జాతీయ, రాష్ట్రీయ, జిల్లా, బ్లాకు, మండల, గ్రామపంచాయతీ) విస్తరించవలసి ఉంటుంది.

i. **ఐఈసీ కార్యకలాపాలలో లోటు :** ఐఈసీ కార్యకలాపాలలో భాగంగా నిర్వహించవలసిన పాటలు, నాటకాలు, వీధినాటికలు, మేళా, హోర్డింగులు, బ్యానర్లు, సమావేశాలు, పాఠశాల ర్యాలీలు, రేడియో కార్యక్రమాలు, ఎగ్జిబిషన్లు, గ్రామీణ కార్యక్రమాలు, అవగాహన సదస్సులు, గోడలపై ప్రకటనలు, మొదలైన వాటి నిర్వహణ విషయంలో 2010-13 నడుమ లక్ష్యసాధనలోటు[7] 13 నుంచి 99 శాతం వరకు ఉన్నట్టు రికార్డుల పరిశీలనలో తెలిసింది. ఫలితంగా 2008-13 సంవత్సరాలలో ₹469.63 కోట్లకుగాను కేవలం ₹32.41 కోట్లు (7 శాతం) మాత్రమే ఖర్చుయింది. నిర్దేశించిన 15 శాతంకంటే తక్కువగా ఖర్చుచేశారు. మాస్‌మీడియా ద్వారా రాష్ట్రస్థాయిలో బహుళప్రచారం కల్పించాలని మార్గదర్శకాలలో స్పష్టం చేసినాగానీ గత ఐదు సంవత్సరాలలో ఇందుకోసం అసలు ఖర్చుచేయలేదు. ఇక నమూనా తనిఖీ చేసిన జిల్లాల[8] విషయానికొస్తే నిధుల వినియోగం 11 నుండి 81 శాతం మధ్యన ఉన్నది (అనంతపురం జిల్లాలో 51 శాతం, కృష్ణాజిల్లాలో 81 శాతం, మహబూబ్‌నగర్ జిల్లాలో 11 శాతం, నెల్లూరు జిల్లాలో 23 శాతం, రంగారెడ్డి జిల్లాలో 48 శాతం). ఇందుకు సంబంధించి ఆడిట్ పరిశీలనలను ప్రభుత్వం అంగీకరించింది (2014 ఫిబ్రవరి). ఐఈసీ కార్యకలాపాలను తీవ్రతరం చేసేందుకు ఎన్ఆర్‌డీడబ్ల్యూపీ[9] ద్వారా మరింత శ్రద్ధ చూపుతున్నట్టు కూడా తెలిపింది.

ii. **స్వచ్ఛతా దూతలు పని చేయకపోవటం :** గ్రామీణులలో పారిశుధ్య వసతులపై ఆసక్తిని పెంపొందించి, వారి నడవడిలో మార్పులు తీసుకు వచ్చేందుకుగాను ఊరి జనసంఖ్యను బట్టి గ్రామస్థాయిలో మోటివేటర్లను (స్వచ్ఛతా దూతలను) నియోగించాలని మార్గదర్శకాలలో పేర్కొన్నారు. ఆమేరకు జనాభా 2000 లోపున ఉన్న గ్రామ పంచాయతీలలో ఒకరినీ, 2000 లకు మించిన జనాభా ఉన్న చోట ఇద్దరు స్వచ్ఛతా దూతలను ఐఈసీ కార్యకలాపాలలో భాగంగా పెట్టుకోవాలి. ఆవిధంగా స్వచ్ఛతా దూతలను నియమించేందుకు తగినవిగా 13,438 గ్రామ పంచాయతీలను గుర్తించగా, 807 మందిని మాత్రమే అలా నియమించారు. అంతేకాక, 2013 ఆగస్టు నాటికి వీరిలో ఎవరూ పనిచేయటంలేదు. స్వచ్ఛతా దూతలుగా పనిచేసేందుకు గ్రామీణులు ముందుకు రావటంలేదని ప్రభుత్వం తెలిపింది (2014 ఫిబ్రవరి). ఇది గ్రామస్థాయిలో ప్రేరణ కొరవడటాన్ని ఇది సూచిస్తుంది. రాష్ట్రంలో ఐఈసీ కార్యకలాపాలమీద ప్రతికూల ప్రభావం చూపుతున్నది.

---

[6] ఆరోగ్యకర విధానాలు, పారిశుధ్యపు అలవాట్లు, పరిసరాల పరిశుభ్రత అంశాలపై జానపద ప్రదర్శనలు, పాటక కళలు, ఆరుబయలు కార్యక్రమాలను నిర్వహించటం

[7] పాటలు, నాటకాలు (85 శాతం), వీధి నాటికలు (71 శాతం), హోర్డింగులు, బ్యానర్లు (86 శాతం), పాఠశాల ర్యాలీలు (51 శాతం), రేడియో కార్యక్రమాలు (99 శాతం), ఎగ్జిబిషన్లు (89 శాతం), గ్రామీణ కార్యక్రమాలు (36 శాతం), అవగాహన సదస్సులు (33 శాతం), గోడలపై ప్రకటనలు (34 శాతం), సమావేశాలు (13 శాతం).

[8] వరంగల్ జిల్లా వివరాలు ఇవ్వలేదు

[9] జాతీయ గ్రామీణ తాగునీటి సరఫరా కార్యక్రమం

ఈ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టి 15 సంవత్సరాలు గడిచి, సమృద్ధిగా నిధులున్నాగానీ ఐఈసీ కార్యకలాపాలపై తగుశ్రద్ధ లోపించటం ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోలేకపోవటానికి పరోక్షంగా దోహదపడుతోంది. టీఎస్‌సీ కార్యక్రమంపై అవగాహన లేకపోవటం (టీఎస్‌సీ అమలుచేయని యూనిట్లలో 53 శాతం మంది తమకు ఈ కార్యక్రమం గురించి తెలియదని చెప్పారు), బహిరంగ విసర్జన ఇంకా కొనసాగుతుండటం (52 శాతం మంది ధృవీకరించారు) ఐఈసీ కార్యకలాపాలు తగినంతగా అమలుకాకపోవటాన్ని సూచిస్తున్నాయి. గ్రామీణ నీటిసరఫరా మరియు పారిశుధ్యశాఖ నియంత్రణలో ప్రచార, వ్యక్తిత్వ వికాస కేంద్రాలను (సీసీడీయూ) నెలకొల్పి గ్రామీణ సమాజం నడవడిలో పరివర్తనకు దోహదపడే విధంగా చర్యలు చేపట్టామనీ, అదేవిధంగా యూనిసెఫ్ తోడ్పాటుతోనూ ఎమ్‌జీఎన్‌ఆర్‌ఈజీఎస్ కు అనుబంధంగానూ పలు కార్యకలాపాలు చేపడుతున్నామనీ ప్రభుత్వం తెలిపింది (2014 ఫిబ్రవరి).

### 3.7.2 వ్యక్తిగత మరుగుదొడ్లు (ఐహెచ్‌హెచ్‌ఎల్)

మార్గనిర్దేశకాల ప్రకారం బీపీఎల్ కుటుంబాలు వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం స్వయంగా చేపట్టి, అవి పూర్తయి వాడుకలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వం నగదు ప్రోత్సాహకం అందచేస్తుంది. ఇక దారిద్ర్యరేఖకు ఎగువన ఉన్న వారి విషయంలో ఈ కార్యక్రమం ప్రయోజనాలను ఎస్సీ/ఎస్టీ, చిన్నసన్నకారు రైతులు, భూమిలేని కూలీలు, వికలాంగులు, మగదక్షతలేని కుటుంబాలకు మాత్రమే పరిమితం చేశారు.

డీడబ్ల్యూఎస్‌సీ ఇచ్చిన నిధులను ఎమ్‌పీడీఓ అర్హులైన లబ్ధిదారులకు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహనిర్మాణ సంస్థకూ (ఏపీఎస్‌హెచ్‌సీఎల్) విడుదల చేస్తారు (టీఎస్‌సీ పథకాన్ని రాష్ట్ర ప్రాయోజిత పథకమైన ఇందిరమ్మ/ఐఏవైతో[10] అమలుచేస్తున్నప్పుడు).

నమూనా పరిశీలన చేసిన యూనిట్లలో వ్యక్తిగత మరుగుదొడ్లకు సంబంధించి ఆడిట్ పరిశీలనలు ఈ కింది విధంగా ఉన్నాయి:

i. **ఒకే రేషన్ కార్డుపై పలు మరుగుదొడ్ల మంజూరు:** ఒక రేషన్ కార్డు, విశిష్ట గుర్తింపు సంఖ్య ఆధారంగా ఒక ఐహెచ్‌హెచ్‌ఎల్ మాత్రమే మంజూరు చేయవలసి ఉండగా, అనంతపురం, మహబూబ్‌నగర్, నెల్లూరు, రంగారెడ్డి జిల్లాలలో ఒకదానికన్నా ఎక్కువ ఐహెచ్‌హెచ్‌ఎల్[11] ఒకే రేషను కార్డు మీద వేరువేరు లబ్ధిదారుల పేర్లతో అనుమతించారు. ఈ పరిస్థితులలో, నిధుల దుర్వినియోగానికి అవకాశం లేకపోలేదు. ఆడిట్ పరిశీలనను ప్రభుత్వం అంగీకరించి, ఈ విషయంలో తగిన చర్యలు తీసుకుంటామని తెలిపింది (2014 ఫిబ్రవరి).

ii. **ఒకే లబ్ధిదారునికి పలు మరుగుదొడ్ల మంజూరు:** అనంతపురం, మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాలలో మొత్తం 27,954 కేసులకుగాను 79 చోట్ల ఒకే లబ్ధిదారునికి రెండు అంతకన్నా ఎక్కువ ఐహెచ్‌హెచ్‌ఎల్ మంజూరు చేసారు. ఈ విషయం ప్రభుత్వం అంగీకరించి అవసరమైన చర్యలు చేపడతామని బదులిచ్చింది (2014 ఫిబ్రవరి).

iii. **మంజూరులో ఇతర లోటుపాట్లు:** నెల్లూరు జిల్లాలో 93 కేసులను మచ్చుకు పరిశీలించగా వాటిలో పలు లోటుపాట్లు కనిపించాయి. తొమ్మిది దరఖాస్తులలో కోడ్ నెంబర్లు రాయలేదు. నాలుగు కేసులలో నిర్మాణానికి ముందు, ఆ తర్వాత ఫోటోలు తీయలేదు. కొన్ని ఓచర్ల మీద సంతకాలు లేవు. కొన్ని దరఖాస్తులు నిర్ణీత నమూనాలో లేవు. కొన్ని చోట్ల చెక్కు ముట్టినట్టు దరఖాస్తుదారుని సంతకం తీసుకోలేదు.

[10] గ్రామీణ మరియు ఆదర్శ పట్టణ ప్రాంతాలలో సమీకృత ఆధునిక అభివృద్ధి, ఇందిరా ఆవాస్ యోజన

[11] నెల్లూరు జిల్లాలో 107 రేషన్ కార్డులపై 274, మహబూబ్‌నగర్ జిల్లాలో 21 రేషన్ కార్డులపై 91, అనంతపురం జిల్లాలో 69 రేషన్ కార్డులపై 259, రంగారెడ్డి జిల్లాలో 69 రేషన్ కార్డులపై 510

కొలతల పుస్తకాలు లేవు. మరో 25 కేసులలో ఒకే మరుగుదొడ్డి[12] కోసం ఇద్దరు ముగ్గురికి ప్రోత్సాహకాలు చెల్లించారు. అనుమతి మంజూరు చేసేముందు సబ్ డివిజన్లు అన్ని విషయాలూ పరిశీలిస్తున్నాయని ప్రభుత్వం బదులిచ్చింది (2014 ఫిబ్రవరి).

iv. **డిజైన్లకు విరుద్ధంగా నిర్మాణాలు:** ప్రభుత్వం ఖరారు చేసిన డిజైను ప్రకారం, 1.0 మీ. వ్యాసం కలిగిన రెండు గుంటలు తవ్వి అందులో ఒకటి నిండిపోగానే అది ఎరువుగా మారేందుకుగాను ఆ గుంటను వేరుచేసేందుకు వీలుగా నిర్మాణం చేయాలి. అయితే, రంగారెడ్డి జిల్లాలోని 15 గ్రామాలలో సర్వే నిర్వహించినప్పుడు పది పదిహేను రింగులు కల సెప్టిక్ టాంక్‌తో, ఎగ్జాస్ట్ పైపుతో నిర్మాణం జరిగినట్లు ఎనిమిది మంది లబ్ధిదారులు పేర్కొన్నారు. ఇది పథకం నిర్దేశించిన డిజైనుకు విరుద్ధం. పది పదిహేను రింగులు వేయటం వలన భూగర్భ జలాలు కలుషితం కావచ్చును. ఎగ్జాస్ట్ పైపువలన ఆక్సిజన్ పోయి ఎరువుగా మారే అవకాశం ఉండదు. ఆడిట్ పరిశీలనతో ప్రభుత్వం ఏకీభవించింది (2014 ఫిబ్రవరి).

v. **పట్టణ ప్రాంతాలలో నిర్మాణాలకు నిధుల వినియోగం:** వరంగల్ జిల్లాలో గృహ నిర్మాణ సంస్థ ఇచ్చిన వినియోగ ధృవపత్రాలు పరిశీలించగా, గ్రామీణ మరుగుదొడ్లకు ఉద్దేశించిన నిధులను 2008-12 సంవత్సరాల నడుమ పట్టణ ప్రాంతాలైన జనగాంలో 420 యూనిట్లు, వరంగల్‌లో 1,939 యూనిట్లకు ఒక్కొక్క దానికీ ₹2,750 వంతున మొత్తం ₹64.87 లక్షలు వెచ్చించారు. ఈ సొమ్ము రికూప్‌మెంట్‌కు చర్య తీసుకుంటామని సమీక్షానంతర సమావేశంలో ఈఎన్‌సీ హామీ ఇచ్చారు (2014 మార్చి).

vi. **అసంపూర్తిగా ఉన్న నిర్మాణాలు:** నమూనా తనిఖీ చేసిన జిల్లాలలో టీఎస్‌సీ కింద నిర్మించిన 971 యూనిట్లను స్వయంగా పరిశీలించగా వీటిలో 400 మరుగుదొడ్లకు (41 శాతం) పైకప్పు లేదు. అలాగే 382 మరుగుదొడ్లకు (39 శాతం) తలుపులు లేవు. ఉదాహరణకు కొన్నింటి ఛాయా చిత్రాలు ఈ దిగువ ఇవ్వటం జరిగింది. బహిరంగ విసర్జన మానిపించటం, ప్రజల నడవడిలో మార్పు తీసుకురావటం తమ లక్ష్యమని ప్రభుత్వం తెలిపింది (2014 ఫిబ్రవరి). అయితే, ఈ కింది ఛాయా చిత్రాలలో ధృవీకరించినట్లు యూనిట్లు నిరూపయోగంగా ఉండటం వలన ప్రజలు అనారోగ్యకరమైన పాత పద్ధతులు అనుసరించటం తప్ప మరో మార్గం లేదు.



గ్రామ పంచాయతీ : బండ రవిర్యాల
మండలం : హయత్‌నగర్
జిల్లా : రంగారెడ్డి
*మరుగుదొడ్డిని సామాను గదిగా వాడుతున్నారు*



గ్రామ పంచాయతీ : తుమ్మల చెరువు
మండలం : ఘట్టు
జిల్లా : మహబూబ్‌నగర్
*తలుపు, పైకప్పు, నీళ్ళులేని మరుగుదొడ్డి*

---

[12] ఆర్‌డబ్ల్యూఎస్ అండ్ ఎస్ సబ్ డివిజన్లు వింజమూరులో ఒక రేషన్ కార్డుపై రెండు ప్రోత్సాహకాలు, ఉదయగిరిలో రెండు రేషన్ కార్డులపై ఐదు ప్రోత్సాహకాలు

అంతేకాకుండా, 971 మంది లబ్ధిదారులలో 111 మంది (11 శాతం) తాము నిర్మించిన మరుగుదొడ్లను ఉపయోగించటంలేదని చెప్పారు. వీరిలో 24 మంది నీటి వసతి లేదనీ, మరో 953 మంది గుంటలను తరచుగా శుభ్రం చేయటంలేదనీ తెలిపారు. పారిశుధ్యం, నీటి సరఫరా పనులను జమిలిగా చేపడతామని ప్రభుత్వం తెలిపింది (2014 ఫిబ్రవరి). మరుగుదొడ్లను శుభ్రపర్చుకునే బాధ్యత లబ్ధిదారులదేనని కూడా ప్రభుత్వం బదులిచ్చింది. అయితే ఈ విషయం లబ్ధిదారులకు తెలియచెప్పే విధంగా ప్రభుత్వం ఐఈసీ కార్యకలాపాలను చేపట్టి ఉండవలసింది.

### 3.7.3 పాఠశాల మరుగుదొడ్లు

టీఎస్సీ విధివిధానాల ప్రకారం ప్రభుత్వ పాఠశాలలన్నింటికీ మరుగుదొడ్లు ఉండాలి. ముఖ్యంగా బాలికలకు ప్రత్యేక ఏర్పాట్లు ఉండాలి. ఆరోగ్యకరమైన అలవాట్లపై వారికి అవగాహన కలిగించేందుకు ప్రతి పాఠశాలలో కనీసం ఒక టీచరుకు శిక్షణ ఇవ్వాలి. మరుగుదొడ్ల నిర్మాణ పనులను ఆర్‌డబ్ల్యూఎస్ డివిజన్లు చేపడుతుండగా, గిరిజన ప్రాంతాల పాఠశాలల్లో సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థలు (ఐటీడీఏ) ఈ బాధ్యత వహిస్తున్నాయి. ఈ విషయమై నమూనా తనిఖీ చేసిన జిల్లాలలో 2008-13 సంవత్సరాలకు నిర్ణయించిన లక్ష్యాలు, వాస్తవంగా సాధించిన వాటి వివరాలు ఈ కింది విధంగా ఉన్నాయిః

**పట్టిక 3.3**

| జిల్లా | 2008-09 | | 2009-10 | | 2010-11 | | 2011-12 | | 2012-13 | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| | లక్ష్యం | నిర్మించినవి | లక్ష్యం | నిర్మించినవి | లక్ష్యం | నిర్మించినవి | లక్ష్యం | నిర్మించినవి | లక్ష్యం | నిర్మించినవి |
| అనంతపురం | శూన్యం | శూన్యం | శూన్యం | శూన్యం | శూన్యం | శూన్యం | శూన్యం | శూన్యం | 391 | 250 |
| కృష్ణా | శూన్యం | శూన్యం | 976 | శూన్యం | 976 | 976 | 172 | 172 | శూన్యం | శూన్యం |
| మహబూబ్‌నగర్ | 1372 | 1372 | 956 | శూన్యం | 956 | 126 | 830 | 829 | 2 | 2 |
| నెల్లూరు | 6415 | 5188 | 1227 | శూన్యం | 751 | శూన్యం | 1227 | 471 | 370 | 112 |
| రంగారెడ్డి | 1121 | 770 | 351 | 99 | 252 | 135 | 117 | 117 | 2564 | 262 |
| వరంగల్ | 1630 | 1150 | 480 | 172 | 308 | 236 | 72 | 72 | శూన్యం | శూన్యం |

*మూలం : డీడబ్ల్యూఎస్ఎమ్ రికార్డులు*

ఈ పట్టికలోని వివరాలను చూస్తే కృష్ణా, వరంగల్, నెల్లూరు జిల్లాలలో నిర్మాణం పనులు ప్రోత్సాహకరంగా ఉండగా, అనంతపురం జిల్లాలో మాత్రం నిర్మాణాలు 2012-13 లోనే ఆరంభించినట్లు తెలుస్తోంది. ఇక మహబూబ్‌నగర్ జిల్లా విషయానికొస్తే, నూరు శాతం లక్ష్యాలు సాధించినట్లు డీడబ్ల్యూఎస్ఎమ్ నివేదికలలో పేర్కొనగా, నమూనా తనిఖీ చేసిన యూనిట్లలో రికార్డులు పరిశీలించినమీదట మరుగుదొడ్ల నిర్మాణ పనులలో కొరత ఉన్నట్లు తెలిసింది. దీనినిబట్టి జిల్లా స్థాయి సమాచారం అసమగ్రంగానూ, అవాస్తవికంగానూ ఉన్నట్లు తేలుతోంది. ఆడిట్ పరిశీలించిన విషయాలను ప్రభుత్వం తన సమాధానంలో అంగీకరించింది (2014 ఫిబ్రవరి).

i. **అవసరం ఉన్నా నిధులు ఇవ్వకపోవటం, నిర్మాణాలు చేపట్టక పోవటంః** పాఠశాలల్లో 1,027 మరుగుదొడ్లు నిర్మించమని మహబూబ్‌నగర్ జిల్లా డీడబ్ల్యూఎస్ఎమ్ ₹2.05 కోట్ల మొత్తాన్ని రాజీవ్ విద్యా మిషన్‌కు 2008 మార్చి నెలలో అందచేయగా 2010 జూన్ నెలాఖరు నాటికి 723 యూనిట్లను మాత్రమే పూర్తిచేసి మిగతా మొత్తం ₹60.84 లక్షలను డీడబ్ల్యూఎస్ఎమ్‌కు తిరిగి ఇచ్చేసారు. ఇందుకు కారణాలను కూడా నమోదు చేయలేదు. నమూనా తనిఖీ జరిగిన ఘట్టు, దామరగిద్ద మండలాలలో ఉన్న 98 పాఠశాలలకుగాను 49 చోట్ల ఈ వసతులు లేకపోయినాగానీ 2008-13 సంవత్సరాలలో నిధులేవీ ఇవ్వలేదు. నిర్మాణ వ్యయం పెరగటం వలన నిర్మాణాలు అనుకున్నమేరకు జరగటం లేదని ప్రభుత్వం బదులిచ్చింది (2014 ఫిబ్రవరి). అయితే, నిర్మాణ వ్యయం లెక్కలను సమీక్షించేందుకు ప్రభుత్వం చర్యలేవీ చేపట్టలేదు. కాబట్టి ఈ సమాధానం సరికాదు. అంతేకాక ఘట్టు, దామరగిద్ద మండలాలలో మరుగుదొడ్ల అవసరం ఉన్నాగానీ అందుకు నిధులు ఇవ్వకపోవటానికి కారణాలను ప్రభుత్వం వివరించలేదు.

ii. **ఖర్చుల వివరాలు చెప్పకపోవటం:** మహబూబ్‌నగర్ జిల్లాలో 125 పాఠశాలలకు మరుగుదొడ్లు నిర్మించటం కోసం ఆ జిల్లా డీడబ్ల్యూఎస్ఎమ్ 2011 నవంబరులో ₹43.75 లక్షల మొత్తాన్ని ఆంధ్రప్రదేశ్ విద్య మరియు సంక్షేమ మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ (ఏపీఈడబ్ల్యూఐడీసీ) కు అందచేసింది. అయితే, వీటికి సంబంధించిన ఖర్చుల వివరాలు 2013 జూలై నాటికి డీడబ్ల్యూఎస్ఎమ్ కార్యాలయానికి అందలేదు. ఏపీఈడబ్ల్యూఐడీసీ, మహబూబ్‌నగర్ కార్యనిర్వాహక ఇంజినీరు ఈ మొత్తానికి వినియోగ ధృవపత్రాలు 2014 ఫిబ్రవరిలో పంపించినట్లు ప్రభుత్వం తెలిపింది (2014 ఫిబ్రవరి). అయితే, ఖర్చులలోని యదార్థతను పరిశీలించేందుకు వీలుగా ఓచర్లను, బిల్లులను ఆడిట్ ముందుంచలేదు కనుక ఈ సమాధానం సరికాదు.

iii. **నిధులను వినియోగించకపోవటం:** అదేవిధంగా, రంగారెడ్డి జిల్లాలోని 75 పాఠశాలలకు ఈ వసతులు కల్పించటం కోసం ఆర్‌వీఎమ్ ప్రాజెక్టు డైరెక్టరుకు 2009 మే నెలలో ఇచ్చిన ₹24.60 లక్షల మొత్తాన్ని అసలు వినియోగించకనే ఏడాది తర్వాత 2010 అక్టోబరులో తిప్పిపంపించారు. ఈ మొత్తంమీద వడ్డీ వసూలు చేస్తామని ప్రభుత్వం తెలిపింది (2014 ఫిబ్రవరి).

iv. **బాలికలకు ప్రత్యేక వసతులు లేకపోవటం:** సహవిద్య అమలులో ఉన్న పాఠశాలలో బాలికలకు విడిగా ఏర్పాట్లు ఉండాలని కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలు నొక్కి చెబుతున్నాయి. అయితే, ఆడిట్ స్వయంగా పరిశీలించిన 84 పాఠశాలలకుగాను 40 చోట్ల బాలికలకు ప్రత్యేక వసతులు లేవు. మిగతా 44 పాఠశాలలో సైతం 19 మరుగుదొడ్లు శిధిలమైపోయాయి. మరో 12 పాఠశాలలకు నీటి వసతి లేకపోవటంతో వీటిని వాడటం లేదు.

పాఠశాలలు, అంగన్‌వాడీలలో మరుగుదొడ్ల నిర్వహణ అవసరాలకు కావలసిన నిధులను సంబంధిత శాఖలు సమకూర్చవలసి ఉన్నప్పటికీ పాఠశాలలు, అంగన్‌వాడీలలో పారిశుధ్య నిర్వహణ విషయమై పంచాయతీరాజ్ సంస్థల పాత్ర కూడా కీలకమైనదే. నమూనా తనిఖీ చేపట్టిన జిల్లాలలో 84 మరుగుదొడ్లను స్వయంగా పరిశీలించగా పలుచోట్ల ఇవి శిధిలావస్థకు చేరుకుని నిర్వహణ లోపాన్ని సూచిస్తున్నాయి. వాటిలో కొన్ని ఈ దిగువ ఛాయా చిత్రాలలో చూడవచ్చును:



పాఠశాల: ప్రాథమిక పాఠశాల
గ్రామ పంచాయతీ: సిరిగిరిపూర్ తండా
మండలం : మహేశ్వరం
జిల్లా : రంగారెడ్డి
*నీటి కొరత వలన ఈ మరుగుదొడ్లను వాడటం లేదు*



పాఠశాల : మండల ప్రజా పరిషత్ పాఠశాల
గ్రామ పంచాయతీ: గుడి ముంకంపల్లి
మండలం : దామరగిద్ద
జిల్లా : మహబూబ్‌నగర్
*శిధిలావస్థలో ఉన్న ఈ మరుగుదొడ్లను వాడటం లేదు*

పాఠశాలలు, అంగన్‌వాడీలలోని మరుగుదొడ్ల నిర్వహణ సంబంధిత శాఖలదేనని ప్రభుత్వం బదులిచ్చింది (2014 ఫిబ్రవరి). అయితే, పాఠశాలలో పరిశుభ్రత పాటించే విషయంలో పంచాయతీరాజ్ సంస్థల పాత్ర గురించి మార్గదర్శకాలలో విపులంగా పేర్కొన్నారు.

### 3.7.4 అంగన్‌వాడీలలో మరుగుదొడ్లు

పిల్లలు మరుగుదొడ్లను ఉపయోగించటం చిన్నతనంలోనే అలవరచే దిశగా పిల్లలతోపాటుగా వారి తల్లుల నడవడిలో కూడా మార్పు తెచ్చేందుకు అంగన్‌వాడీలను ఒక వేదికగా పరిగణిస్తున్నారు. కాబట్టి, ప్రతి అంగన్‌వాడీలోనూ చిన్న పిల్లలకు అనువైన మరుగుదొడ్లు ఉండాలి. అంగన్‌వాడీ కేంద్రాలలో మరుగుదొడ్ల నిర్మాణ వ్యయం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 70:30 నిష్పత్తిలో భరిస్తాయి. నిర్మాణం పనులను ఆర్‌డబ్ల్యూఎస్ డివిజన్లు, స్త్రీ - శిశు సంక్షేమ శాఖ చేపడతాయి. నమూనా తనిఖీ చేసిన జిల్లాలలో ఇందుకు సంబంధించి 2008-13 సంవత్సరాలకు లక్ష్యాలు, వాస్తవ పురోగతి (లక్ష్య సాధన) పట్టిక 3.4 లో ఉన్నాయి:

**పట్టిక 3.4**

| జిల్లా | 2008-09 | | 2009-10 | | 2010-11 | | 2011-12 | | 2012-13 | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| | లక్ష్యం | లక్ష్య సాధన | లక్ష్యం | లక్ష్య సాధన | లక్ష్యం | లక్ష్య సాధన | లక్ష్యం | లక్ష్య సాధన | లక్ష్యం | లక్ష్య సాధన |
| అనంతపురం | శూన్యం | శూన్యం | శూన్యం | శూన్యం | శూన్యం | శూన్యం | శూన్యం | శూన్యం | శూన్యం | శూన్యం |
| కృష్ణా | శూన్యం | శూన్యం | శూన్యం | శూన్యం | శూన్యం | శూన్యం | శూన్యం | శూన్యం | శూన్యం | శూన్యం |
| మహబూబ్‌నగర్ | శూన్యం | శూన్యం | 357 | 142 | శూన్యం | శూన్యం | 215 | 215 | 1677 | శూన్యం |
| నెల్లూరు | 1396 | 197 | 1199 | శూన్యం | శూన్యం | శూన్యం | 498 | 128 | 1726 | 148 |
| రంగారెడ్డి | 265 | 26 | 239 | 125 | 114 | 42 | 72 | 72 | 1395 | శూన్యం |
| వరంగల్ | 419 | శూన్యం | 419 | శూన్యం | 130 | శూన్యం | 464 | 54 | 410 | 287 |

*మూలం : డీడబ్ల్యూఎస్ఎమ్ కార్యాలయాల రికార్డులు*

అనంతపురం, కృష్ణా జిల్లాలలో లక్ష్యాలను ప్రభుత్వం 2008 కి ముందే పూర్తిచేసినందున ఇక్కడ 2008-13 సంవత్సరాలలో అంగన్‌వాడీ కేంద్రాల మరుగుదొడ్ల నిర్మాణం తలపెట్టలేదని చెబుతున్నారు. మహబూబ్‌నగర్, నెల్లూరు, రంగారెడ్డి జిల్లాలలో 2012-13 సంవత్సరానికి అధిక లక్ష్యాలను నిర్ణయించి అంగన్‌వాడీ మరుగుదొడ్ల నిర్మాణానికి ప్రేరణ కలిగించాలని తలపెట్టినా, మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాలలో సాధించినది శూన్యం. నెల్లూరు జిల్లాలో కూడా ఇది తొమ్మిది శాతం మాత్రమే. మహబూబ్‌నగర్, నెల్లూరు, రంగారెడ్డి జిల్లాలలో నిర్మాణం పనులు జరుగుతున్నాయనీ, త్వరలోనే ఇవి పూర్తవుతాయనీ ప్రభుత్వం బదులిచ్చింది (2014 ఫిబ్రవరి).

నమూనా తనిఖీ చేపట్టిన యూనిట్ల రికార్డుల పరిశీలనలో ఈ కింది విషయాలు తెలిశాయి:

i. **నిర్మాణాలు పూర్తికాకపోవటం:** మహబూబ్‌నగర్ జిల్లా ఘట్టు, దామరగిద్ద మండలాలలో 2008-13 సంవత్సరాల నడుమ 65 అంగన్‌వాడీ కేంద్రాలకు ఈ వసతులు లేవని గుర్తించగా, ప్రభుత్వం ఈ ఐదు సంవత్సరాలలో 26 మరుగుదొడ్లను మాత్రమే మంజూరు చేసింది. వీటిని సైతం పూర్తిచేయలేకపోయింది. ఈ పనులు పురోగతిలో ఉన్నట్టు ఆడిట్‌కు బదులిచ్చింది (2014 ఫిబ్రవరి).

ii. **మరుగుదొడ్లలో వసతుల లేమి:** ఆడిట్ అధికారులు 26 అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించగా, ఈ 26 కేంద్రాలలోని ఆయాలు అక్కడ పిల్లలకు అనువైన మరుగుదొడ్లు లేవని నివేదించారు. మరుగుదొడ్లకు తలుపులుగానీ, పైకప్పుగానీ లేవని లబ్ధిదారులలో 35 - 54 శాతం మంది పేర్కొన్నారు. వీటిలో నీటి సరఫరా లేదని 88 శాతం మంది తెలిపారు. మరుగుదొడ్లలో నీటి వసతి కల్పిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది (2014 ఫిబ్రవరి). కానీ బాలలకు హితవైన మరుగుదొడ్లకు తలుపులు, పైకప్పు సమకూర్చేందుకు మార్గదర్శకాలలో వెసులుబాటు లేదని మాత్రం తెలిపింది. అయితే, ఆడిట్ పరిశీలనలు పిల్లల మరుగుదొడ్లకు సంబంధించినవి కావు కనుక, వీటికి తలుపులు, పైకప్పు అమరిక మార్గదర్శకాలలోనే నిర్దేశించారు కనుక ఈ సమాధానం సముచితం కాదు.

### 3.7.5 రివాల్వింగ్ ఫండ్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 80:20 నిష్పత్తిలో నిధులు సమకూర్చి ఒక రివాల్వింగ్ ఫండ్‌ను ఏర్పాటు చేసి మంచి పరపతి కలిగిన సహకార సంఘాలకు, స్వయం సహాయ బృందాలకు నిధులు విడుదల చేయాలని ఆపరేషనల్ గైడ్‌లైన్స్ (ఎన్‌బీఏ గైడ్‌లైన్స్, 2012) లో స్పష్టం చేసారు. టీసీఎస్ కార్యక్రమం కింద ప్రోత్సాహకాలకు అర్హతలేని ఏపీఎల్ కుటుంబాలకు ఈ నిధి ఉపయోగపడుతుంది. ఈ నిధి కింద ఇచ్చిన ఋణాలను 12 నుండి 18 వాయిదాలలో వసూలు చేయాలి. వీటి విషయమై ఎస్‌డబ్ల్యూఎస్ఎమ్ కార్యాలయం, ఎంపిక చేసిన యూనిట్ కార్యాలయాల రికార్డులు పరిశీలించగా ఈ కింది విషయాలు తెలిశాయిః

i. **రాష్ట్రం వాటా విడుదల చేయకపోవటంః** రాష్ట్ర ప్రభుత్వం తన వంతుగా ఇవ్వవలసిన ₹67.50 లక్షలను విడుదల చేయకుండానే కేంద్రం సమకూర్చిన నిధులనుంచి 2011-12, 2012-13 సంవత్సరాలలో మొత్తం ₹2.70 కోట్లు వినియోగించారు. అంతేకాకుండా, లబ్ధిదారులనుంచి వాయిదా మొత్తాలను 2013 మార్చి నాటికి వసూలు చేయలేదు. నిధులు రాగానే రాష్ట్రం వాటాను విడుదల చేస్తామని ప్రభుత్వం బదులిచ్చింది (2014 ఫిబ్రవరి).

ii. **నిధులను ఆలస్యంగా అందచేయటంః** వరంగల్ డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టరుకు అందచేసేందుకు వీలుగా ఎస్‌డబ్ల్యూఎస్ఎమ్ 2013 మార్చి నెలలో ₹50 లక్షలను డీడబ్ల్యూఎస్‌సీ కార్యాలయానికి రివాల్వింగ్ ఫండ్ రూపేణా విడుదల చేసింది[13]. ఇటువంటి నిధులను 15 రోజులలోగా తర్వాతి స్థాయి కార్యాలయానికి పంపించాలని మార్గదర్శకాలలో స్పష్టం చేసినాగానీ, 2013 ఆగస్టు నాటికి డీడబ్ల్యూఎస్ఎమ్ ఈ విషయం పట్టించుకొనక పోవటంవలన నిధులు జిల్లా స్థాయిలోనే ఉండిపోవటం, ఆశించిన లక్ష్యాలు సాధించక పోవటానికి ఇది దారితీసింది. నిధులను డీఆర్‌డీఏ కార్యాలయానికి 2013 డిసెంబరులో అందచేసినట్లు ప్రభుత్వం బదులిచ్చింది (2014 ఫిబ్రవరి). ఈ విధంగా చూసినా, నిధుల పంపిణీలో 9 నెలల జాప్యం చోటుచేసుకుంది. ఇది పనుల నిర్వహణలో పురోగతిమీద ప్రభావం చూపింది.

iii. **నిధులను వినియోగించకపోవటంః** నెల్లూరు జిల్లాకు 2002లో అందిన ₹26.68 లక్షలు 2013 జూలై నాటికి వినియోగించుకొనలేదు (ఇందులో కేంద్రం నుంచి వచ్చినవి ₹21.50 లక్షలు కాగా రాష్ట్రం వాటా ₹5.18 లక్షలు). జాప్యాన్ని ధృవీకరిస్తూనే, 2013 డిసెంబరులో నిధులను విడుదల చేసినట్లు ప్రభుత్వం తెలిపింది (2014 ఫిబ్రవరి).

iv. **ఖర్చుల వివరాలు అందచేయకపోవటంః** రంగారెడ్డి జిల్లా డీఆర్‌డీఏ సంస్థకు 2013 మార్చి నెలలో ఇచ్చిన ₹50 లక్షలకు సంబంధించిన ఖర్చుల వివరాలు ఇవ్వలేదు. ఇందుకు సంబంధించిన వినియోగ ధృవపత్రాలు అందినట్లు ప్రభుత్వం చెప్పింది (2014 ఫిబ్రవరి) కానీ సంబంధిత రికార్డులను ఆడిట్ ముందుంచలేదు.

### 3.7.6 ప్రాధాన్యత లోపించిన సామాజిక మరుగుదొడ్ల సముదాయాలు

సామాజిక మరుగుదొడ్ల సముదాయాల నిర్మాణాన్ని ఎన్‌బీఏ ఉద్యమంలో ఎంతో ముఖ్యమైన అంశంగా భావించారు. గ్రామంలో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణానికి తగిన స్థలం లేనప్పుడు, నిర్మాణానంతర నిర్వహణ బాధ్యతను వహించేందుకు అక్కడి సమాజం సన్నద్ధమైన పరిస్థితులలో ఈ తరహా సామాజిక మరుగుదొడ్ల నిర్మాణం విషయం ఆలోచిస్తారు. వీటి నిర్మాణ వ్యయాన్ని కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక సమాజం 60:30:10 వంతున భరిస్తాయి. ఇక వీటి నిర్వహణ కోసం పంచాయతీ రాజ్ సంస్థలు వినియోగదారుల నుంచి రుసుములు వసూలు చేయటం వంటి విధానాల ద్వారా నిధులు సమకూర్చుకుంటాయి.

[13] ప్రొసీడింగ్స్ నెం.744/ఎస్‌డబ్ల్యూఎస్ఎమ్/టీఎస్‌సీ/జీఓఐ రిలీజ్/639/2010/2, తేదీ 20 మార్చి 2013

ఆరు జిల్లాలలో నమూనా తనిఖీ చేపట్టగా, కేవలం మహబూబ్‌నగర్, కృష్ణా జిల్లాలలో మాత్రమే సామాజిక మరుగుదొడ్ల నిర్మాణానికి లక్ష్యాలను నిర్ణయించారు. ఈ రెండు జిల్లాలలో కలిపి 2008-09 సంవత్సరంలో 20 నిర్మాణాలు చేపట్టవలసి ఉండగా, 2013 మార్చి నాటికి 17 మాత్రమే నిర్మించారు[14]. ఈ ఆడిట్ సమీక్ష పరిధిలోని తర్వాతి సంవత్సరాలలో ఇందుకోసం ఇక లక్ష్యాలేవీ నిర్దేశించలేదు. ఈ అంశానికి తగు ప్రాధాన్యత ఇవ్వక పోవటాన్ని ఇది సూచిస్తుంది. వీటి నిర్మాణానికి స్థానిక ప్రజలు అంతగా ముందుకు రాకపోవటం వలన నిర్వహణ సమస్యలు తలెత్తుతాయని వీటికి బదులు వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణానికే ప్రాధాన్యతనిస్తున్నామని ప్రభుత్వం చెప్పింది (2014 ఫిబ్రవరి).

### 3.7.7 గ్రామీణ పారిశుధ్య పరికరాల దుకాణాలు, ఉత్పత్తి కేంద్రాలు

పారిశుధ్య మరుగుదొడ్లు, సోకేజ మరియు కంపోస్టు గుంటలు, వెర్మి కంపోస్టింగ్, వాషింగ్ ప్లాట్‌ఫారాలు, వాటర్ ఫిల్టర్లు మొదలైన పారిశుధ్య సామగ్రి, హార్డ్‌వేర్, డిజైన్లు వంటివి సరఫరా చేయటం కోసం ఉత్పత్తి కేంద్రాలను, గ్రామీణ పారిశుధ్య సామగ్రి దుకాణాలను (ఆర్ఎస్ఎమ్) నెలకొల్పాలని టీఎస్‌సీ, ఎన్‌బీఏ విధివిధానాలలో సూచించారు.

i. **ఆర్ఎస్ఎమ్‌లను నెలకొల్పటంలో లోటు:** మహబూబ్‌నగర్ జిల్లాలో ఉన్న 15 తప్ప నమూనా తనిఖీ చేపట్టిన జిల్లాలలో ఎక్కడా ఆర్ఎస్ఎమ్‌లను నెలకొల్పలేదు. అంతేకాకుండా, కృష్ణా జిల్లా గుడివాడ, బంటుమిల్లి సబ్ డివిజన్లలో ఆర్ఎస్ఎమ్ స్థాపించటం కోసం ఇద్దరు కాంట్రాక్టర్లకు ₹4 లక్షల చొప్పున మొత్తం ₹8 లక్షలు 2008 జూలై నెలలో ఇవ్వగా ఐదు సంవత్సరాలు దాటినా వీటిని ఆరంభించలేదు. ఇటువంటి యూనిట్లను ప్రారంభించేందుకు స్వయం సహాయక బృందాలు ముందుకు రాకపోవటం వలన మహబూబ్‌నగర్ జిల్లా తప్ప నమూనా తనిఖీ జరిగిన మిగతా జిల్లాలలో వీటిని ప్రారంభించలేదని ప్రభుత్వం బదులిచ్చింది (2014 ఫిబ్రవరి). కృష్ణా జిల్లాలో ఇదివరకు ఇచ్చిన మొత్తాలను వసూలు చేయమని ఆదేశాలు జారీ చేసినట్టుకూడా ప్రభుత్వం తెలిపింది.

ii. **ఉత్పత్తి కేంద్రాలను నెలకొల్పకపోవటం :** ఉత్పత్తి కేంద్రాలను నెలకొల్పటంలో ప్రభుత్వం తగిన చొరవ చూపకపోవటం వలన రివాల్వింగ్ ఫండ్‌ను వినియోగించుకోలేక పోవటమే కాక, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణానికి అవసరమయ్యే సామగ్రిని తక్కువ ధరకు తమ గ్రామంలోనే పొందే అవకాశం లబ్ధిదారులకు కలగటం లేదు. అంతేకాక, ఈ రూపేణా లభించే ఉపాధి అవకాశాలను కూడా గ్రామీణులు కోల్పోతున్నారు. లబ్ధిదారుల నుంచి వచ్చే డిమాండును అనుసరించి యూనిట్లను నెలకొల్పే విషయం జిల్లా స్థాయిలో నిర్ణయిస్తారని ప్రభుత్వం బదులిచ్చింది (2014 ఫిబ్రవరి). ఈ ఆడిట్ నివేదికలోని పేరా 3.7.1 లో వివరించిన విధంగా, అల్ప స్థాయిలో సాగిన ఐఈసీ కార్యకలాపాలు, ఈ యూనిట్లను స్థాపించటం వలన కలిగే ప్రయోజనాల పట్ల ప్రభుత్వం అవగాహన కల్పించలేకపోవటం కొంతమేర ఇందుకు దారితీశాయి.

### 3.7.8 ఘన, ద్రవ వ్యర్థాల నిర్మూలన (ఎస్ఎల్‌డబ్ల్యూఎమ్)

ఈ అంశం కింద కంపోస్టు గుంటల తవ్వకం, వెర్మి కంపోస్టింగ్, ఉమ్మడి మరియు వ్యక్తిగత బయోగ్యాస్ ప్లాంట్లు, చౌక ధరల్లో డ్రైనేజీ, సోకేజీ ఛానల్స్/గుంటలు, నీటి పునర్వినియోగం, సేకరణ వ్యవస్థ, ఇంటింటి చెత్త సేకరణ, నిర్మూలన మొదలైన వాటిని చేపట్టాలి. ప్రాజెక్టు వ్యయాన్ని 2008-12 సంవత్సరాల మధ్య కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం, గ్రామపంచాయతీ 60:20:20 చొప్పున భరించేవి. ఈ ఖర్చును 2012-13 నుంచి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలే 70:30 వంతున పెట్టుకుంటున్నాయి.

---

[14] కృష్ణా జిల్లాలో 8, మహబూబ్‌నగర్ జిల్లాలో 9

నమూనా తనిఖీ చేసిన యూనిట్లలో రికార్డులు పరిశీలించగా ఈ కింది విషయాలు తెలిశాయి:

i. **నిధులను పూర్తిగా వాడుకొనకపోవటం:** నిధులు ₹31.64 కోట్ల మేర అందుబాటులో ఉన్నాగానీ (కేంద్రం వాటా ₹23.31 కోట్లు, రాష్ట్రం వాటా ₹8.33 కోట్లు) రాష్ట్ర ప్రభుత్వం 2008-12 సంవత్సరాలలో కేవలం ₹2.60 కోట్లు మాత్రమే (8 శాతం) వాడుకోగలిగింది. ఇందుకు సమాధానమిస్తూ ప్రభుత్వం 3,482 గ్రామ పంచాయతీలలో ఎస్‌ఎల్‌డబ్ల్యూఎమ్ ప్రాజెక్టులకు 2013 జనవరిలో అనుమతినిచ్చామనీ, వాటిలో నల్గొండ, మెదక్, తూర్పు గోదావరి, అనంతపురం జిల్లాలలోని నాలుగు గ్రామ పంచాయతీలలో నాలుగు ప్రాజెక్టులు ప్రయోగాత్మకంగా చేపట్టామనీ తెలిపింది (2014 ఫిబ్రవరి).

ii. **ఘన వ్యర్థాల నిర్మూలన పనులు చేపట్టకపోవటం:** వరంగల్ జిల్లాలో మొత్తం ప్రాజెక్టు విలువ ₹60.27 కోట్లు కాగా, 2008-13 సంవత్సరాలలో భూగర్భ డ్రైనేజీ, సైడు కాలువల నిర్మాణానికి కేవలం ₹6.72 లక్షలు (0.11 శాతం) మాత్రమే వినియోగించారు. ఎస్‌ఎల్‌డబ్ల్యూఎమ్ కింద పనులు చేపట్టకపోవటానికి కారణంగా స్పష్టమైన మార్గదర్శకాలు లేకపోవటమేనని ప్రభుత్వం తెలిపింది (2014 ఫిబ్రవరి). అయితే, ఎస్‌ఎల్‌డబ్ల్యూఎమ్ కింద నిధుల కేటాయింపు గురించి కేంద్ర ప్రభుత్వం ఇదివరకే మార్గదర్శకాలలో స్పష్టం చేసింది.

iii. **ఘన వ్యర్థాల నిర్మూలన పనులకు నిధులు సరిగా వినియోగించకపోవటం:** రంగారెడ్డి జిల్లా డీడబ్ల్యూఎస్ఎమ్ ₹1.26 కోట్లకుగాను 2008-13 సంవత్సరాలలో ₹51.06 లక్షలను మాత్రమే ఖర్చు చేసింది. ఇందులో 127 సైకిల్ రిక్షాలు, 25,400 చెత్తకుండీల కోసం ₹31.06 లక్షలను వెచ్చించింది. జిల్లాలోని 14 మండలాలకు పంపిణీ చేసేందుకు వీటిని తెప్పించారు. ఈ పనులను త్వరలోనే పూర్తి చేస్తారని ప్రభుత్వం బదులిచ్చింది (2014 ఫిబ్రవరి).


   అదేవిధంగా, కృష్ణా జిల్లాలో ఈ అంశం కింద కేటాయించిన ₹2.72 కోట్లకుగాను ₹51.56 లక్షలు (19 శాతం) మాత్రమే ఖర్చయింది. ఈ విషయాన్ని ప్రభుత్వం అంగీకరించింది (2014 ఫిబ్రవరి).

iv. **అదనంగా ఇచ్చిన నిధులు:** విధివిధానాల ప్రకారం, 500 కుటుంబాలు కల గ్రామపంచాయతీలకు ఈ అంశం కింద ₹20 లక్షల వరకు ఇవ్వవచ్చును. అయితే రంగారెడ్డి జిల్లా పుప్పలగూడ గ్రామ పంచాయతీకి భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ, మురుగునీటి శుద్ధి పరికరాల కోసం 2012-13 లో నిబంధనలు అతిక్రమించి ₹28 లక్షలు ఇచ్చారు. మార్గదర్శకాల ప్రకారం అదనపు వ్యయాన్ని రాష్ట్ర ప్రభుత్వంగానీ గ్రామ పంచాయతీగానీ భరించాలి. ఇందుకు ప్రభుత్వం ప్రత్యేకించి సమాధానమివ్వలేదు.

రంగారెడ్డి జిల్లాలోని 15 గ్రామ పంచాయతీలలో ప్రత్యక్ష పరిశీలన చేపట్టగా, మురుగునీటిని పంట పొలాలు, చెరువులు, మూసీనది, దానికి ఆనుకుని ఉన్న చెరువులలోకి వదులుతున్నారని తెలిసింది. ఇది అంతిమంగా జలాశయాలను కలుషితం చేసి పలు వ్యాధులకు కారణమవుతుంది. నమూనా తనిఖీ చేపట్టిన మిగతా జిల్లాలైన అనంతపురం, మహబూబ్‌నగర్, నెల్లూరులలో ఈ అంశం కింద ప్రాజెక్టులేవీ తలపెట్టలేదు. అనంతపురం, నెల్లూరు జిల్లాలలో ఆడిట్ పరిశీలనలను ప్రభుత్వం అంగీకరించింది. మహబూబ్‌నగర్ జిల్లాలో మాత్రం ఎస్‌ఎల్‌డబ్ల్యూఎమ్ పనులను చేపట్టినట్లు తెలిపింది (2014 ఫిబ్రవరి). అయితే, ఇందుకు సంబంధించిన రికార్డులేవీ ఆడిట్‌కు చూపించలేదు. రంగారెడ్డి జిల్లాలో ఎస్‌ఎల్‌డబ్ల్యూఎమ్ కింద ఆరంభించిన ప్రాజెక్టులు వివిధ దశలలో ఉన్నాయనీ, అవి పూర్తయ్యాక కాలుష్యపరమైన ప్రధాన సమస్యలు పరిష్కారమవుతాయనీ ప్రభుత్వం తెలిపింది.

## 3.8 ఆర్థిక నిర్వహణ

టీఎస్‌సీ అమలు చేయటం కోసం కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం 2008-13 సంవత్సరాలలో విడుదల చేసిన నిధుల వివరాలు చార్టు 3.2 లో ఉన్నాయి.




*మూలం: ఆయా సంవత్సరాల వినిమయ పద్దులు*

రాష్ట్ర ప్రభుత్వం 2008-09, 2009-10, 2012-13 సంవత్సరాలలో అసలు నిధులేవీ విడుదల చేయలేదని దీనిని బట్టి తెలుస్తోంది. ఇందుకు ప్రభుత్వం సమాధాన మేమీ ఇవ్వలేదు. రాష్ట్ర ప్రభుత్వం 2011-12లో తన వంతు వాటాగా ₹100 కోట్లకు బడ్జెట్ విడుదల ఉత్తర్వులు (బీఆర్ఓ) జారీ చేసింది. ఎస్‌డబ్ల్యూఎస్‌ఎమ్ ₹28 కోట్లు ఖర్చుగా చూపించగా, సంబంధిత రికార్డులను ఆడిట్ పరిశీలించినప్పుడు ఎస్‌డబ్ల్యూఎస్‌ఎమ్ కేవలం ₹14.57 కోట్లు మాత్రమే ఖర్చు చేసినట్లు తెలిసింది. ఆడిట్ గమనించిన విషయాలను ప్రభుత్వం అంగీకరించింది (2014 ఫిబ్రవరి).

కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చిన ₹5.48 కోట్ల[15] నిధులను 2011-12 లో రాష్ట్రం వాటాకు మళ్లించారు. తిరిగి భర్తీచేసే పద్ధతిన ఈ మళ్లింపు జరిగిందని చెబుతున్నాగానీ రాష్ట్ర ప్రభుత్వం ఈ మొత్తాన్ని 2013 ఆగస్టు నాటికి రీఇంబర్స్ చేయలేదు. ఆడిట్ పరిశీలనను ప్రభుత్వం అంగీకరించింది (2014 ఫిబ్రవరి). ఈ మొత్తాన్ని సర్దుబాటు చేస్తామని కూడా తెలిపింది.

### 3.8.1 నిధుల విడుదలలో జాప్యం

ఎస్‌డబ్ల్యూఎస్‌ఎమ్ అందుకున్న నిధులను 15 రోజులలోగా ప్రాజెక్టు అమలు సంస్థలకు పంపిణీ చేయాలని కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలలో స్పష్టం చేశారు. అయితే 2010 ఆగస్టు నుంచి 2012 మే నెలల మధ్యన ఎస్‌డబ్ల్యూఎస్‌ఎమ్ నుంచి ₹174.18 కోట్ల మొత్తాన్ని వివిధ డీడబ్ల్యూఎస్‌ఎమ్ కార్యాలయాలకు అందచేయటంలో 28 నుంచి 301 రోజుల వరకూ జాప్యం జరిగింది. జిల్లాలకు నిధులను అవసరాన్ని అనుసరించి అందచేస్తున్నట్లు ప్రభుత్వం బదులిచ్చింది (2014 ఫిబ్రవరి). అయితే, టీఎస్‌సీ అమలుచేసేందుకు జిల్లాస్థాయి కార్యాలయాన్ని ఒక యూనిట్‌గా పరిగణించాలనీ, ప్రణాళికాబద్ధంగా అందచేస్తున్న నిధులను జిల్లాస్థాయిలో సక్రమంగా వినియోగించుకుని కార్యక్రమాన్ని ప్రభావశీలంగా అమలుచేసేలాగున ప్రభుత్వం ఆయాసంస్థల సామర్థ్యం పెంపొందించాలని కేంద్రం తన మార్గదర్శకాలలో సూచించింది.

అనంతపురం డీడబ్ల్యూఎస్‌ఎమ్ దగ్గర ₹15.14 కోట్ల మేర నిధులు అందుబాటులో ఉన్నా, ప్రాజెక్టు అమలుచేసే సంస్థలకు 2010-13 సంవత్సరాల మధ్యన కేవలం ₹25.19 లక్షలు మాత్రమే ఇచ్చింది. ఇక్కడ 2010-11 సంవత్సరంలో ఆమోదించిన 5,290 వ్యక్తిగత మరుగుదొడ్లలో 907 నిర్మాణాలను చేపట్టేందుకు ఈ మొత్తం అందచేసింది. అన్ని పనులనూ త్వరలో పూర్తి చేయిస్తామని సమీక్షానంతర సమావేశంలో (2014 మార్చి) ఈఎన్‌సీ హామీ ఇచ్చారు.

[15] వరంగల్ జిల్లాలో ₹44.20 లక్షలు, కృష్ణా జిల్లాలో ₹5.04 కోట్లు

### 3.8.2 నిధులను బ్యాంకు డిపాజిట్లలో పెట్టటం

విధివిధానాలను అతిక్రమించి ఎస్‌డబ్ల్యూఎస్‌ఎమ్ 2008-09, 2010-11 సంవత్సరాలలో ₹8.50 కోట్లమేర పథకం నిధులను కాలపరిమితి డిపాజిట్లలో పెట్టింది. నమూనా తనిఖీ చేసిన జిల్లాలలో కూడా మొత్తం ₹25.86 కోట్లను కాలపరిమితి డిపాజిట్లలో[16] ఉంచారు. ఆడిట్ పరిశీలనలను ప్రభుత్వం అంగీకరించింది (2014 ఫిబ్రవరి).

### 3.8.3 వినియోగ ధృవపత్రాల పెండింగు

నమూనా తనిఖీ చేసిన జిల్లాలలో టీఎస్‌సీ నిధులకు సంబంధించి ఈ కింద వివరించిన విధంగా ప్రాజెక్టు అమలు సంస్థలనుంచి వినియోగ ధృవపత్రాలు అందవలసి ఉంది.

పట్టిక 3.5

| క్రమ సంఖ్య | యూనిట్ పేరు | వినియోగ ధృవపత్రాల బకాయిల వివరాలు | | |
|---|---|---|---|---|
| | | మొత్తం (₹ కోట్లలో) | బకాయిపడిన సంస్థ | ఎప్పటినుంచి బకాయి |
| 1 | ఎస్‌డబ్ల్యూఎస్‌ఎమ్ | 0.68 | 22 జిల్లాల డీడబ్ల్యూ&సీడీఏల ప్రాజెక్టు డైరెక్టర్లు[17] | 2010 ఆగస్టు |
| 2 | డీడబ్ల్యూఎస్‌ఎమ్, రంగారెడ్డి | 4.99 | మండల పరిషత్ అభివృద్ధి అధికారులు | 2008-12 |
| | | 6.13 | ఆర్‌డబ్ల్యూఎస్ సబ్ డివిజన్లు | 2007-13 |
| 3 | డీడబ్ల్యూఎస్‌ఎమ్, వరంగల్ | 0.26 | సాంఘిక సంక్షేమశాఖ ఈఈ (2008-09), స్త్రీ-శిశు సంక్షేమం పీడీ (2009-10, 2010-11) | 2008-11 |
| 4 | డీడబ్ల్యూఎస్‌ఎమ్, అనంతపురం | 0.04 | పీడీ, ఐటీడీఏ, శ్రీశైలం | 2008 జూలై |
| 5 | డీడబ్ల్యూఎస్‌ఎమ్, నెల్లూరు | 3.47 | ఆర్‌డబ్ల్యూఎస్ డివిజన్లు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు | 2011-12 |
| మొత్తం | | **15.57** | | |

*మూలం: నమూనా తనిఖీ చేసిన యూనిట్ల రికార్డులు*

ఐటీడిఏ, శ్రీశైలం 2014 ఫిబ్రవరిలో మొత్తం ₹4 లక్షలు వడ్డీతో సహా తిరిగి ఇచ్చిందని ప్రభుత్వం తెలిపింది (2014 ఫిబ్రవరి). అయితే, ఇందుకు సంబంధించిన పత్రాలను మాత్రం ఆడిట్ పరిశీలనకు ఇవ్వలేదు. మిగతా జిల్లాలలో నిధులను త్వరలో వినియోగిస్తామని తెలిపారు.

i. డీడబ్ల్యూఎస్‌ఎమ్, రంగారెడ్డి జిల్లా తమకు 2011 మార్చి నెలలో వచ్చిన ₹4.05 కోట్లు ఖర్చు చేసినట్లు చూపుతున్నా ఈ మొత్తం 2012 మే నాటికి ఆర్‌డబ్ల్యూఎస్ హైదరాబాదు డివిజనులోనే ఉన్నది (ఇది రంగారెడ్డి జిల్లా డీడబ్ల్యూఎస్‌ఎమ్ నియంత్రణలో ఉండి టీఎస్‌సీ పనులు నిర్వహిస్తున్న సంస్థ).

ii. ఐదు జిల్లాలలో డీడబ్ల్యూఎస్‌ఎమ్ కార్యాలయాలు[18] సిబ్బందికీ, అమలు సంస్థలకూ 2008-12 సంవత్సరాలలో ఇచ్చిన అడ్వాన్సులు మొత్తం ₹3.67 కోట్లు 2013 ఆగస్టు నాటికి సర్దుబాటుకాలేదు. సంబంధిత శాఖలనుంచి అడ్వాన్సులను వసూలు చేస్తున్నామని ప్రభుత్వం తెలిపింది (2014 ఫిబ్రవరి). అయితే, రికవరీ వివరాలు 2014 మే వరకు ఆడిట్‌కు అందలేదు.

---

[16] అనంతపురం జిల్లాలో ₹5 కోట్లు (2007 జూన్ నుంచి 2010 ఏప్రిల్ వరకు); నెల్లూరు జిల్లాలో ₹7కోట్లు (2010-11), మహబూబ్‌నగర్ జిల్లాలో ₹12.56 కోట్లు, రంగారెడ్డి జిల్లాలో ₹1.30 కోట్లు (2009 జూన్ నుంచి 2010 సెప్టెంబరు వరకు)

[17] జిల్లా స్త్రీ-శిశు సంక్షేమ సంస్థలు

[18] అనంతపురం జిల్లాలో ₹1 కోటి, కృష్ణా జిల్లాలో ₹1.44 కోట్లు, మహబూబ్‌నగర్ జిల్లాలో ₹9.76 లక్షలు, రంగారెడ్డి జిల్లాలో ₹80 లక్షలు,వరంగల్ జిల్లాలో ₹32.63 లక్షలు

### 3.8.4 పాలనాపరమైన ఖర్చులలో అవకతవకలు

కార్యక్రమం విధివిధానాల ప్రకారం, 2008-12 సంవత్సరాల మధ్య పాలనాపరమైన ఖర్చులు జిల్లాలోని మొత్తం ప్రాజెక్టు వ్యయంలో ఐదు శాతం వరకు ఉండవచ్చును. తదుపరి సంవత్సరాలలో ఇది నాలుగు శాతం చేసారు. పాలనాపరమైన ఖర్చులలో శిక్షణపై చేసిన వ్యయం, ప్రాజెక్టు కాలంలో నియమించిన తాత్కాలిక సిబ్బంది జీతాలు, సపోర్టు సర్వీసులు, ఇంధన ఖర్చులు, వాహనాల అద్దెలు, వ్రాత సామగ్రి, టీఎస్‌సీ ప్రాజెక్టు పర్యవేక్షణ - మూల్యాంకనం ఖర్చులు ఉంటాయి. మానవవనరుల అభివృద్ధి రంగంలో నియోగించిన అధ్యాపకుల వేతనాలు, పాఠశాల పారిశుధ్యం-ఆరోగ్యంపట్ల అవగాహన, పర్యవేక్షణ, జిల్లాకు ఒక కంప్యూటరు, దాని అనుబంధ పరికరాల కొనుగోలు ఖర్చులుకూడా ఈ అంశంకింద చేయవచ్చును.

నమూనా తనిఖీ చేసిన యూనిట్లలో పాలనాపరమైన ఖర్చులకు సంబంధించి ₹18.44 లక్షల మేర ఈ కింది అవకతవకలు బయటపడ్డాయి.

i. **చెల్లింపుల వివరాలు లేకపోవటం:** కృష్ణా జిల్లా నందిగామ సబ్ డివిజనులో ₹12.30 లక్షలను 2008లో సెల్ఫ్ చెక్కు ద్వారా డ్రా చేస్తూ డిప్యూటీ కార్యనిర్వాహక ఇంజనీరు నగదు తీసుకున్న ప్రయోజనం పేర్కొనలేదు. ఇందుకు సంబంధించిన ఓచర్లు, ఎక్విటెన్సులు కూడా ఆడిట్ పరిశీలనకు అందచేయలేదు. చెల్లింపుల వివరాలు నగదు పుస్తకంలో కానీ బ్యాంకు ఖాతాలోకానీ కనిపించకపోవటం, ఓచర్లు, ఎక్విటెన్సులు కూడా లేకపోవటం వలన నగదు అపహరణకు అవకాశం లేకపోలేదు. ఈ చెల్లింపులకు ఎక్విటెన్సులు అన్నీ ఉన్నాయని ప్రభుత్వం బదులిచ్చింది (2014 ఫిబ్రవరి). కానీ వాటిని ఆడిట్ పరిశీలనకు అందచేయలేదు.

ii. **చెల్లింపుల వివరాలు చూపించకపోవటం:** కృష్ణా జిల్లా డీడబ్ల్యూఎస్ఎమ్ అక్కడ ఐఈసీ కార్యకలాపాలకోసం 2010 ఫిబ్రవరి, మే నెలల్లో మొత్తం ₹6.14 లక్షలను ఎన్‌జీఓలకు అందచేశారు. వీటికి సంబంధించిన ఓచర్లు, ఎక్విటెన్సులు తనిఖీ కోసం ఆడిట్ ముందుంచలేదు. కాబట్టి ఈ ఖర్చుల వాస్తవికతను ఆడిట్ రూఢి చేసుకొనలేదు. ఈ ఎక్విటెన్సులు అన్నీ ఉన్నాయని ప్రభుత్వం తెలిపింది (2014 ఫిబ్రవరి). కానీ వాటిని ఆడిట్‌కు చూపించలేదు.

### 3.8.5 బహుళ బ్యాంకు ఖాతాల నిర్వహణ

టీఎస్‌సీ, ఎన్‌బీఏ విధివిధానాల ప్రకారం ఎస్‌డబ్ల్యూఎస్ఎమ్ ఒకే సేవింగ్స్ బ్యాంకు ఖాతాను ప్రారంభించి అన్ని లావాదేవీలను దీని ద్వారానే సాగించవలసి ఉంటుంది. అయితే, ఎస్‌డబ్ల్యూఎస్ఎమ్ ఆరు ఖాతాలు నిర్వహిస్తుండగా నమూనా తనిఖీ చేసిన అన్ని జిల్లాలలో[19] ఒకటికన్నా ఎక్కువ ఖాతాలు నిర్వహిస్తున్నారు. బహుళ ఖాతాలు నిర్వహించటానికి గల కారణాలను ఆడిట్ ప్రత్యేకించి అడిగినా బదులివ్వలేదు. ప్రభుత్వం మాత్రం దిద్దుబాటు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చింది (2014 ఫిబ్రవరి).

### 3.8.6 నగదు పుస్తకం నిర్వహణ లోపాలు

టీఎస్‌సీ/ఎన్‌బీఏ నగదు పుస్తకాలు పరిశీలించగా ఈ కింది విషయాలు తెలిశాయి :

i. ఎస్‌డబ్ల్యూఎస్ఎమ్ 2009 జూన్ 2 నుంచి 2010 ఆగస్టు 17 వరకు నగదు పుస్తకం నిర్వహించలేదు. ఈ మధ్య కాలంలో రాబడికి సంబంధించినవి ఆరు లావాదేవీలు (వీటి మొత్తం విలువ ₹4.70 కోట్లు) అలాగే ఖర్చులకు సంబంధించినవి 16 లావాదేవీలు (వీటి మొత్తం విలువ ₹4.49 కోట్లు) ఆడిట్ పరిశీలనకు వీలుకాలేదు. తర్వాతికాలంలో నగదుపుస్తకం రాసినాగానీ దీనిని క్లోజ్ చేయటం, బ్యాంకు

[19] అనంతపురం జిల్లా డీడబ్ల్యూఎస్ఎమ్ మూడు ఖాతాలు, కృష్ణా జిల్లా డీడబ్ల్యూఎస్ఎమ్ ఐదు ఖాతాలు, మహబూబ్‌నగర్ జిల్లా డీడబ్ల్యూఎస్ఎమ్ రెండు ఖాతాలు, నెల్లూరు జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్-సూళ్లూరుపేట, కావలి, వింజమూరు ఆరు ఖాతాలు, రంగారెడ్డి జిల్లా డీడబ్ల్యూఎస్ఎమ్ తొమ్మిది ఖాతాలు, వరంగల్ జిల్లా డీడబ్ల్యూఎస్ఎమ్ రెండు ఖాతాలు, వరంగల్ ఆర్‌డబ్ల్యూఎస్ డివిజన్ మూడు ఖాతాలు, హనుమకొండ ఆర్‌డబ్ల్యూఎస్ డివిజన్ మూడు ఖాతాలు

రికార్డులతో రికన్సైల్ చేయటం జరగలేదు. నెల్లూరు ఆర్‌డబ్ల్యూఎస్ సబ్ డివిజనులోనూ, మహబూబ్‌నగర్ డీడబ్ల్యూఎస్ఎమ్ కార్యాలయంలోనూ నగదు పుస్తకం క్లోజింగులలో లోపాలున్నాయి.

ii. రంగారెడ్డి జిల్లాలో డీడబ్ల్యూఎస్ఎమ్ ఇబ్రహీంపట్నం, ఆర్‌డబ్ల్యూఎస్ సబ్‌డివిజన్‌లకు చెందిన బ్యాంకు బ్యాలెన్సుల మధ్య 2013 ఆగస్టు నాటికి ₹31.92 లక్షల వ్యత్యాసం ఉన్నది. ఈ ఖాతానుంచి నగదును సెల్ఫ్ చెక్కుల ద్వారానే డ్రా చేస్తున్నారు. వీటి నగదుపుస్తకాన్ని ఆడిట్ పరిశీలనకు అందచేయలేదు. అంతేకాకుండా, డీడబ్ల్యూఎస్ఎమ్ 2008-09లో ఇబ్రహీంపట్నం సబ్ డివిజన్‌కు ఇచ్చిన ₹15 లక్షలు బ్యాంకు ఖాతాలో నమోదుకాలేదు. ఆవిధంగా ఇది లెక్కలలోకి రాలేదు. టీఎస్‌సీ, పన్నెండవ ఆర్థిక సంఘం గ్రాంట్లు, రాష్ట్ర ఆర్థిక సంఘం గ్రాంట్లు, వర్క్ ఛార్జ్‌డ్ సిబ్బంది జీతాలు మొదలైన అన్ని రాబడులకూ కలిపి ఇబ్రహింపట్నం సబ్ డివిజన్‌లో ఒకే ఖాతా పెట్టటం వలన ఈ వ్యత్యాసాలు ఏర్పడినట్టు రంగారెడ్డి జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ఎస్ పర్యవేక్షక ఇంజనీరు బదులిచ్చారు (2014 ఫిబ్రవరి). అంతేకాక, ₹15 లక్షల మొత్తాన్ని ఇబ్రహింపట్నంకు కాక వేరే సబ్ డివిజన్‌కు ఇచ్చినట్టు కూడా చెప్పారు. అయితే తన వాదనకు ఊతంగా బ్యాంకు రికన్సిలియేషన్ నివేదికలుగానీ, మరే ఇతర పత్రాలనుగానీ ఆడిట్‌కు చూపించలేదు.

పైన వివరించిన సందర్భాలలో ఆదాయ వ్యయాలను సరిగా లెక్కచెప్పకపోవటంవలన వంచన, అపహరణలకు అవకాశం లేకపోలేదు.

## 3.9 పర్యవేక్షణ యంత్రాంగం

ప్రాజెక్టు అమలును ఆన్‌లైన్‌లో పర్యవేక్షించేందుకు రాష్ట్రస్థాయిలో ప్రాజెక్టు పర్యవేక్షణ విభాగం (పీఎమ్‌యూ) 2002 డిసెంబరులో ఏర్పడింది[20]. ఇది పంచాయతీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్యకార్యదర్శి కింద పనిచేస్తుంది. రాష్ట్రస్థాయిలో మధ్యంతర సమావేశాలు జరుగుతున్నాయి. ఎస్‌డబ్ల్యూఎస్ఎమ్ కార్యాలయంలోనూ, ఎంపికచేసిన యూనిట్‌లలోనూ రికార్డులు పరిశీలించగా ఈ దిగువ వివరించిన లోపాలు బయటపడ్డాయి. రాష్ట్ర స్థాయిలో పర్యవేక్షణ లోపాలను ఇవి సూచిస్తున్నాయి.

### 3.9.1 క్షేత్రస్థాయి తనిఖీలు

మార్గదర్శకాలలో స్పష్టంగా నిర్దేశించినాగానీ నెల్లూరు, వరంగల్లు డీడబ్ల్యూఎస్ఎమ్ అధికారులు తమ జిల్లాలలో 2009-13 సంవత్సరాల నడుమ క్షేత్రస్థాయి తనిఖీలు చేపట్టలేదని చెప్పారు. అనంతపురం, కృష్ణా, రంగారెడ్డి జిల్లాలలో క్రమం తప్పకుండా తనిఖీలు చేసినట్టు సంబంధిత డీడబ్ల్యూఎస్ఎమ్ అధికారులు చెప్పినా అందుకు సంబంధించిన రికార్డులను ఆడిట్ పరిశీలనకు ఇవ్వలేదు. ఇక మహబూబ్‌నగర్ జిల్లా గురించి ఆడిట్ అడిగిన దానికి బదులివ్వలేదు. వరంగల్లు, నెల్లూరు జిల్లాలలో సిబ్బంది కొరత కారణంగా అక్కడ క్షేత్రస్థాయి తనిఖీలు జరగలేదని ప్రభుత్వం అంగీకరించింది (2014 ఫిబ్రవరి). ఇతర జిల్లాలలో తనిఖీలు జరుగుతున్నాయని చెప్పినా, అందుకు సంబంధించిన రికార్డులు ఆడిట్‌కు చూపించలేదు.

### 3.9.2 గ్రామపంచాయతీలలో స్వచ్ఛతాదివస్ పాటించకపోవటం

నిర్మల్ భారత్ అభియాన్‌లో పారదర్శకత, ప్రజా భాగస్వామ్యం, సమాలోచన, ప్రజామోదం, జవాబుదారీతనం, సమస్యల నివారణ వంటివి పెంపొందించే దిశగా ప్రతి గ్రామపంచాయతీ నెలలో ఒకరోజును స్వచ్ఛతా దివస్ (పరిశుభ్రత దినం) గా పాటించాలి. తదుపరి, ఆరుమాసాలకొకమారు గ్రామ స్వచ్ఛతా సభలను నిర్వహించి నెలవారీ ప్రణాళికల కింద సాధించిన పురోగతిని అక్కడ చర్చకు పెట్టాలి. నమూనా తనిఖీ చేసిన ఏ మండలం లోనూ స్వచ్ఛతాదివస్‌ను ఒక్క గ్రామపంచాయతీ కూడా పాటించటంలేదు. ఈ విషయంలో తగు చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం హామీ ఇచ్చింది (2014 ఫిబ్రవరి).

[20] జీ.ఓ.ఎమ్ఎస్.నెం.460, పీఆర్&ఆర్‌డీ (ఆర్‌డబ్ల్యూఎస్) శాఖ, తేదీ 19 డిసెంబరు 2002

## 3.10 మూల్యనిర్ధారణ అధ్యయనం

కార్యక్రమం అమలుపై మూల్య నిర్ధారణ అధ్యయనం చేపట్టి అక్కడ గమనించిన అంశాలపై దిద్దుబాటు చర్యలు చేపట్టవలసిందిగా విధివిధానాలలో సూచించారు. అయితే, రాష్ట్ర ప్రభుత్వం (ఎస్‌డబ్ల్యూఎస్ఎమ్) ఈ విధమైన అధ్యయనం ఏదీ నిర్వహించలేదు. ఇందుకోసం నిధులను వెచ్చించలేదు. పర్యవసానంగా, ఇందలి లోపాలను సరిదిద్ది, లక్షిత గమ్యాన్ని సాధించేందుకు చొరవచూపలేదు. నిర్మల గ్రామ పురస్కారం పొందిన గ్రామ పంచాయతీల విషయంలో ఒక ఎన్‌జీఓ ద్వారా ఈ తరహా అధ్యయనం 2012-13 లో చేపట్టినట్టు ప్రభుత్వం బదులిచ్చింది (2014 ఫిబ్రవరి). కేంద్ర ప్రభుత్వం ఆశించినట్టు ఈ కార్యక్రమాన్ని కార్యసాధకంగా అమలుచేసేందుకూ, గుర్తించిన లోపాలను ఎప్పటికప్పుడు సరిదిద్దేందుకూ ప్రభుత్వం చేపట్టిన ఈ పరిమిత చర్యలు సరిపోవు.

## 3.11 సారాంశం

*ఈ కార్యక్రమం 15 సంవత్సరాలుగా ఆచరణలో ఉన్నా, ఇందలి కీలకాంశమైన ఐఈసీ కట్టుదిట్టంగా అమలుచేయక పోవటంవలన గ్రామీణ ప్రజల నడవడిలో మార్పు తీసుకువచ్చి, బహిరంగ విసర్జన అలవాటును మానిపించి, పారిశుధ్య వసతులపట్ల వారిలో ఆసక్తి పెంపొందించే లక్ష్యం పెద్దగా నెరవేరలేదు. రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమానికి చాలినన్ని నిధులు కేటాయించకపోవటం వలన దీనికి ప్రాధాన్యత కొరవడి, కార్యక్రమం అమలుమీద తగు పర్యవేక్షణకూడా లేకపోవడంతో ఏ అంశంలోనూ ఆశయాలను అందుకోలేదు. కార్యక్రమం అమలుకు ఊతమిచ్చే విధంగా గ్రామీణ పారిశుధ్య సామగ్రి దుకాణాలు, ఉత్పత్తి కేంద్రాల ద్వారా ప్రత్యమ్నాయ పంపిణీ వ్యవస్థ రూపుకట్టలేదు. రివాల్వింగ్ ఫండ్‌నూ సక్రమంగా వినియోగించుకొనలేదు. ఫలితంగా, పారిశుధ్య సామగ్రి తక్కువ ధరకు పొందే అవకాశం గ్రామీణులకు కలగటం లేదు. ఈ రూపేణా లభించే ఉపాధి అవకాశాలనుకూడా వారు కోల్పోతున్నారు. పాఠశాలలు, తదితర సంస్థలలో ఆరోగ్యకర పారిశుధ్య పరిస్థితులు నెలకొనే విధంగా ప్రభుత్వం కట్టుదిట్టం చేయలేదు. బాలికలకు ప్రత్యేక వసతులనూ కల్పించలేదు. మొత్తంమీద, కార్యక్రమం అమలు పలు అభావాలకు తావిచ్చింది.*

## 3.12 సిఫార్సులు

- ➢ రాష్ట్ర ప్రభుత్వం ఐఈసీ కార్యకలాపాలను బలోపేతం చేసేందుకు తగు చర్యలు చేపట్టి, టీఎస్‌సీ/ఎన్‌బీఏ అపేక్ష ప్రేరిత గమనాన్ని విజయవంతం చేసేందుకు పూనుకోవాలి.
- ➢ పాఠశాలలలో బాలికలకు ప్రత్యేకంగా మరుగుదొడ్లు సమకూరే విధంగా చర్యలు చేపట్టాలి.
- ➢ కార్యక్రమం సక్రమంగా అమలు జరిగేందుకు ఆలంబనగా ప్రభుత్వం ప్రత్యామ్నాయ పంపిణీ విధానాలకు తావు కల్పించాలి.
- ➢ కార్యక్రమం అమలును నిరంతరం కనిపెడుతూ అవసరమైన చోట దిద్దుబాటు చర్యలు చేపట్టేందుకు, సమాచారం విశ్వసనీయతను దృఢీకరించుకునేందుకు తగినట్టు పర్యవేక్షణ యంత్రాంగాన్ని పటిష్టం చేయాలి.

# అధ్యాయం-4

## నియమాల పాటింపుపై ఆడిట్ పరిశీలనలు

పేజీలు 51 - 52

## మునిసిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ

### 4.1 సంగారెడ్డి పురపాలక సంఘంలో వసూళ్ళ దుర్వినియోగం

**ప్రభుత్వ నిబంధనలు పాటించకపోవటం, అంతర్గత నియంత్రణలు కొరవడటంవలన ₹84.67 లక్షల మేర వసూళ్లు దుర్వినియోగం అయేందుకు ఆస్కారం ఏర్పడటమేకాక ₹36.43 లక్షల మొత్తం తాత్కాలికంగా దుర్వినియోగం అయింది.**

ప్రభుత్వ ఉద్యోగులు వసూలు చేసిన మొత్తాలను, వారికి జమ చేసిన మొత్తాలను ఆలస్యం లేకుండా వెంటనే ప్రభుత్వ ఖాతాలో జమ చేయాలని ఆంధ్రప్రదేశ్ ఖజానా నియమావళిలో[1] స్పష్టం చేశారు. మునిసిపాలిటీ తరపున చేసిన వసూళ్ళను ఆదే రోజునగానీ, మరుసటి రోజునగానీ బ్యాంకు లేదా ఖజానాకు పంపి మునిసిపాలిటీ సాధారణ నిధులకు జమ చేయాలని మునిసిపల్ మాన్యువల్‌లో కూడా సూచించారు. ఈవిధంగా వసూలు చేసిన మొత్తాలను కార్యాలయ అవసరాలకు వాడుకోవటంకానీ, ప్రభుత్వ పద్దులకు అవతల ఉంచటంకానీ చేయకూడదు. జీతాలకు, ఆఫీసు పరమైన చిన్నచిన్న ఖర్చులకు తప్ప మరే అవసరాలకూ మునిసిపల్ సాధారణ నిధులనుంచి సెల్ఫ్ చెక్కుల ద్వారా సొమ్ము డ్రా చేయకూడదు.

సంగారెడ్డి మునిసిపాలిటీలో రికార్డుల పరిశీలన చేసినప్పుడు (2013 జనవరి/అక్టోబరు) ఈ కింది విషయాలు తెలిశాయి :

i. పన్నులు, పన్నులుకాని ఇతర ఆదాయాల రూపేణా 2008-13 సంవత్సరాల మధ్య వచ్చిన రోజువారీ వసూళ్లు మొత్తం ₹2.39 కోట్లు 'సాధారణ నిధి'కి జమచేసే బదులు స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్‌లో చెల్లించారు (ఇందులో ₹1.97 కోట్ల మొత్తాన్ని సంగారెడ్డి మునిసిపాలిటీ కమీషనర్ సేవింగ్స్ ఖాతాలోనూ, ₹42.37 లక్షలను వివిధ పథకాలకు చెందిన ఖాతాలలోనూ వేశారు).

ii. రోజువారీ వసూళ్లకు సంబంధించిన చిట్టా రిజిస్టరు ప్రకారం ₹2.39 కోట్లు సేవింగ్స్ ఖాతాలో జమ చేసినట్లు కనిపిస్తున్నా, ఇందులో ₹36.43 లక్షల మొత్తాన్ని వాస్తవానికి ఏడాదిపైగా జాప్యంతో జమచేశారు. ఇది తాత్కాలికంగా నిధుల దుర్వినియోగాన్ని సూచిస్తుంది.

iii. ఇతర పథకాల పద్దులకు[2] జమ చేసినట్టుగా చిట్టా రిజిస్టరులో చూపుతున్న (2011 ఆగస్టు-2012 సెప్టెంబరు) ₹42.37 లక్షలకుగాను ₹1.88 లక్షల మొత్తాన్ని 2013 అక్టోబరు నాటికి జమచేయలేదు.

iv. వివిధ ఖర్చుల కోసం కమీషనరు 2009 - 2012 మధ్య సెల్ఫ్ చెక్కుల ద్వారా మొత్తం ₹82.79 లక్షలు ఎస్‌బీహెచ్ నుంచి డ్రాచేసారు. అయితే, ఇందుకు సంబంధించిన ఓచర్లను ఆడిట్ ముందుంచలేదు. కనుక ఈ ఖర్చుల యథార్థతను పరిశీలించటం వీలు కాలేదు.

ప్రభుత్వ నియమాలు పాటించకపోవటం, అంతర్గత నియంత్రణలు కొరవడటంవలన ₹84.67 లక్షలమేర[3] వసూళ్లు దుర్వినియోగం అయేందుకు ఆస్కారమేర్పడటమేకాక ₹36.43 లక్షల మొత్తం తాత్కాలికంగా దుర్వినియోగం అయింది.

---

[1] ఆంధ్రప్రదేశ్ ఖజానా నియమావళి మొదటి భాగంలోని 7వ నిబంధన

[2] వెనుకబడిన ప్రాంతాల గ్రాంటు నిధి, రాజీవ్ నగరబాట, పదమూడవ ఆర్థిక సంఘం

[3] ₹1.88 లక్షలు, ₹82.79 లక్షలు కలిపి

సంబంధిత మునిసిపల్ అధికారులపై తగు చర్యలు ఆరంభించవలసిందిగా మునిసిపల్ పరిపాలన కమీషనర్ మరియు డైరెక్టర్‌ను ఆదేశించామని ప్రభుత్వం బదులిచ్చింది (2014 మే). అదేవిధంగా సంగారెడ్డి మునిసిపాలిటీ పద్దులను 2008-13 సంవత్సరాలకు ప్రత్యేక తనిఖీ నిర్వహించమని రాష్ట్ర తనిఖీ శాఖ డైరెక్టరును కోరినట్టుకూడా తెలిపింది.

(వాణీ శ్రీరామ్)

హైదరాబాదు

ప్రధాన మహాగణకాధికారి (జీఎస్ఎస్ఏ)
ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ

ధృవీకరించడమైనది

(శశికాంత్ శర్మ)

కొత్త ఢిల్లీ

భారత కంప్ట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్

# అనుబంధాలు

పేజీలు 53 - 64

**అనుబంధం - 1**

**(అవలోకనం పేజీ vii)**

**పంచాయతీరాజ్ సంస్థలలో స్థాయిలవారీగా బాధ్యతలు తెలిపే పట్టిక**

| క్రమ సంఖ్య | సంస్థ/అధికారి/పదవి | పాత్ర | విధులు |
|---|---|---|---|
| 1 | పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి | - | విధానాలు రూపొందించటంలో ప్రభుత్వానికి సాయపడతారు. |
| 2 | పంచాయతీరాజ్ మరియు గ్రామీణ ఉపాధిశాఖ కమిషనరు | శాఖాధిపతి | రాష్ట్రంలో పంచాయతీరాజ్ మరియు గ్రామీణ ఉపాధి శాఖకు బాధ్యుడు. |
| జిల్లా ప్రజాపరిషత్తులు (జడ్పీపీ) | | | |
| 3 | ఛైర్‌పర్సన్ | జడ్పీపీ అధినేత | స్థాయీ సంఘం సమావేశాలు, సాధారణ సమావేశాలను నిర్వహించి వాటికి అధ్యక్షత వహించటం, జిల్లాకు సంబంధించి తక్షణం ప్రభుత్వ సాయం అవసరమయే విషయాలను ప్రభుత్వ దృష్టికి తీసుకురావటం. |
| 4 | వైస్ ఛైర్‌మన్ | ఛైర్‌పర్సన్ 15 రోజులకు మించి అందుబాటులో లేనప్పుడు ఆయన అధికారాలు, విధులు నిర్వర్తిస్తారు. | ఛైర్‌పర్సన్ 15 రోజులకు మించి అందుబాటులో లేనప్పుడు ఆయన అధికారాలు, విధులు నిర్వర్తించటం. |
| 5 | స్థాయీ సంఘాలు | జడ్పీపీ కార్యకలాపాలను పరిశీలించేందుకు ఏడు స్థాయీ సంఘాలను చట్టం నిర్దేశించింది. | తమకు అప్పగించిన అంశాలకు సంబంధించిన పథకాలు, అభివృద్ధి పనుల పురోగతిని గమనించటం. |
| 6 | ముఖ్య కార్యనిర్వహణాధికారి | జడ్పీపీ కార్యకలాపాల నిర్వహణ బాధ్యత వహించే ప్రధానాధికారి. | • చట్టం నిర్దేశించిన విధుల నిర్వహణకు తగు అధికారాలు కలిగి ఉంటారు.<br>• స్థాయీసంఘం తీర్మానాలను అమలు చేస్తారు.<br>• జడ్పీపీ కార్యకలాపాలను పర్యవేక్షిస్తారు.<br>• ఛైర్మన్ ఆదేశాలు, అనుమతి మేరకు కనీసం నెలకొకమారు జడ్పీపీ సమావేశాలు నిర్వహిస్తారు.<br>• జడ్పీపీ కింద పనిచేసే కార్యాలయాలన్నింటి మీదా పాలనాపరమైన నియంత్రణ కలిగి ఉంటారు.<br>• జిల్లా విద్యా సంఘం మెంబర్ కన్వీనర్ హోదాలో జిల్లా విద్యా సంఘం సమావేశాలు నిర్వహించాలి. |
| మండల ప్రజాపరిషత్తులు (ఎమ్పీపీ) | | | |
| 7 | ఎమ్పీపీ అధ్యక్షుడు | పంచవర్ష ప్రణాళికల మేరకు ప్రభుత్వ కార్యక్రమాలను అమలు చేసేందుకు గ్రామాలలో ప్రజల భాగస్వామ్యం సాధించటం. | • ఎమ్పీపీ సమావేశాలు నిర్వహించి ఎజెండాను ఆమోదించటం.<br>• ఎమ్పీపీ తీర్మానాల అమలు విషయమై ఎమ్పీడీఓను నియంత్రించటం.<br>• ప్రభుత్వ నిధులతో అమలవుతున్న పథకాలను పరిశీలించటం. |

| క్రమ సంఖ్య | సంస్థ/అధికారి/పదవి | పాత్ర | విధులు |
|---|---|---|---|
| 8 | మండల పరిషత్ అభివృద్ధి అధికారి | మండల స్థాయి కార్యనిర్వహణాధికారి. | • ఎమ్‌పీపీ కౌన్సిల్ చేసిన తీర్మానాలను అమలు చేయాలి.<br>• ప్రభుత్వం నుంచి వచ్చే అన్ని గ్రాంటులను సకాలంలో సర్దుబాటు చేయాలి. గ్రామపంచాయతీల పర్యవేక్షణ వహించాలి. |
| గ్రామపంచాయతీలు | | | |
| 9 | సర్పంచి | గ్రామపంచాయతీకి ఎంపికైన సభ్యులు ఎన్నుకున్న అధినేత. | • గ్రామ పంచాయతీ సమావేశాలకు అధ్యక్షత వహిస్తారు.<br>• గ్రామపంచాయతీ కార్యకలాపాలు, అభివృద్ధి పథకాల అమలును పర్యవేక్షిస్తారు. |
| 10 | ఉప సర్పంచి | సర్పంచి పదవి ఖాళీ అయినప్పుడు కొత్త సర్పంచిని ఎన్నుకొనే వరకు ఆయన అధికారాలు, బాధ్యతలు వహిస్తారు. | • ఈయన సర్పంచి బాధ్యతలు వహించినంత కాలం ఆ పదవికి సంబంధించిన విధులన్నీ నిర్వర్తించాలి. |
| 11 | సభ్యులు | సభ్యులందరూ గ్రామంలోని వివిధ వార్డుల నుంచి ఎన్నికైన ప్రజాప్రతినిధులు. | తీర్మానాలు ప్రవేశపెట్టేందుకూ, పంచాయతీ పరిపాలన పరమైన విషయాలలో జోక్యం చేసుకొనేందుకూ వీరికి అధికారం ఉంటుంది. |
| 12 | పంచాయతీ కార్యదర్శి | గ్రామ పంచాయతీలో పూర్తి కాలానికి లేదా పాక్షిక సమయానికి కార్యనిర్వహణాధికారి. | పంచాయతీరాజ్ చట్టంలో సూచించిన అంశాల నిర్వహణకు తగు అధికారాలు, బాధ్యతలు కలిగిఉంటారు. ఈ చట్టం అమలుకు నేరుగా బాధ్యత వహిస్తారు. |

## అనుబంధం - 1.1

(పేరా 1.2, పేజీ 3)

## పంచాయతీరాజ్ సంస్థలకు 2011-12లో జిల్లాలవారీగా, విధులవారీగా వచ్చిన నిధుల వివరాలు

(₹ లక్షల్లో)

| క్రమ సంఖ్య | జిల్లా ప్రజా పరిషత్ పేరు | శాఖ పేరు | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| | | వ్యవసాయం | పశు సంవర్ధక | మత్స్య | సాంఘిక సంక్షేమం | వెనుకబడిన తరగతుల సంక్షేమం | మొత్తం |
| 1 | ఆదిలాబాదు | 28.93 | 7.93 | 5.25 | 0 | 0 | 42.11 |
| 2 | అనంతపురం | 36.36 | 4.89 | 2.50 | 0 | 0 | 43.75 |
| 3 | చిత్తూరు | 17.12 | 20.01 | 0.50 | 0 | 0 | 37.63 |
| 4 | తూర్పు గోదావరి | 0 | 4.18 | 1.00 | 0 | 0 | 5.18 |
| 5 | గుంటూరు | 0 | 29.77 | 1.50 | 0 | 0 | 31.27 |
| 6 | కరీంనగర్ | 6.00 | 2.00 | 2.00 | 0 | 0 | 10.00 |
| 7 | ఖమ్మం | 3.67 | 7.32 | 0 | 22.32 | 0 | 33.31 |
| 8 | కృష్ణా | 0 | 0 | 1.75 | 0 | 0 | 1.75 |
| 9 | కర్నూలు | 30.28 | 6.03 | 1.50 | 0 | 0 | 37.81 |
| 10 | మహబూబ్‌నగర్ | 58.50 | 22.16 | 5.00 | 0 | 0 | 85.66 |
| 11 | మెదక్ | 20.19 | 31.88 | 1.50 | 0 | 0 | 53.57 |
| 12 | నల్గొండ | 18.17 | 60.35 | 1.50 | 0 | 0 | 80.02 |
| 13 | నెల్లూరు | 11.00 | 0 | 0 | 0 | 0 | 11.00 |
| 14 | నిజామాబాదు | 10.09 | 0 | 0 | 0 | 0 | 10.09 |
| 15 | ప్రకాశం | 0 | 1.84 | 0 | 0 | 0 | 1.84 |
| 16 | రంగారెడ్డి | 31.75 | 30.06 | 1.75 | 0 | 0.30 | 63.86 |
| 17 | శ్రీకాకుళం | 6.11 | 42.23 | 2.75 | 0 | 0 | 51.09 |
| 18 | విశాఖపట్టణం | 14.38 | 0 | 0.50 | 0 | 0 | 14.88 |
| 19 | విజయనగరం | 10.09 | 0 | 2.25 | 0 | 0 | 12.34 |
| 20 | వరంగల్ | 6.65 | 93.80 | 0 | 0.24 | 0 | 100.69 |
| 21 | పశ్చిమ గోదావరి | 0 | 10.09 | 0 | 0 | 0 | 10.09 |
| 22 | వైఎస్ఆర్ కడప | 52.63 | 28.20 | 1.25 | 0 | 0 | 82.08 |
| మొత్తం | | 361.92 | 402.74 | 32.50 | 22.56 | 0.30 | 820.02 |

**అనుబంధం - 1.2**

**(పేరా 1.5.2, పేజీ 7)**

**ముగిసిన పథకాల మిగులు నిధులను పట్టణ స్థానిక సంస్థలు అట్టిపెట్టుకున్న వివరాలు**

**(₹ లక్షల్లో)**

| క్రమ సంఖ్య | మునిసిపాలిటీ పేరు | పథకం వివరాలు | నిధులు నిరుపయోగంగా పడిఉన్న కాలం | మొత్తం |
|---|---|---|---|---|
| 1 | మహబూబ్‌నగర్ | పన్నెండవ ఆర్థిక సంఘం (టీఎఫ్‌సీ) | 2005-06 నుండి 2009-10 వరకు | 36.43 |
| 2 | గూడూరు | టీఎఫ్‌సీ | 2009-10 | 6.82 |
| | | స్వర్ణ జయంతి గ్రామీణ స్వరోజ్‌గార్ యోజన (ఎస్‌జీఎస్‌ఆర్‌వై), జాతీయ మురికివాడల అభివృద్ధి పథకం ( ఎన్‌ఎస్‌డీపీ), చిన్నతరహా, మధ్యతరహా పట్టణాల సమీకృత అభివృద్ధి (ఐడీఎస్‌ఎమ్‌టీ), మొదలైనవి | 2010-11 | 41.14 |
| | | ఐడీఎస్‌ఎమ్‌టీ | 2005-06 | 05.78 |
| 3 | నల్గొండ | ఆంధ్రప్రదేశ్ పట్టణ పేదల సముద్ధరణ (ఏపీయూఎస్‌పీ), ఆంధ్రప్రదేశ్ పట్టణ సంస్కరణలు మరియు మునిసిపల్ సేవల పథకం (ఏపీయూఆర్‌ఎమ్‌ఎస్‌పీ) | 2009-10 నుండి 2011-12 వరకు | 7.10 |
| 4 | హిందూపూర్ | జన్మభూమి, ఎమ్‌ఎల్‌ఏ నిధులు, నీరు మీరు, ఏపీయూఆర్‌ఎమ్‌ఎస్‌పీ, ముఖ్యమంత్రి సహాయ నిధి, మొదలైనవి | 2011-12 | 33.57 |
| 5 | నంద్యాల | ఎన్‌ఎస్‌డీపీ, అక్షర జ్యోతి, జన్మభూమి, ప్రతికూల వాతావరణ సాయం, ప్రజాపథం, మొదలైనవి | 2005-06 | 40.48 |
| 6 | గుంతకల్ | జన్మభూమి, నీరు - మీరు | సమాచారం లేదు | 70.71 |
| | | వెనుబడిన ప్రాంతాల సహాయ నిధి (బీఆర్‌జీఎఫ్) | 2009-10 నుండి 2012-13 వరకు | 26.88 |
| 7 | తాడేపల్లిగూడెం | ఐడీఎస్‌ఎమ్‌టీ | 2005-06 | 11.59 |
| 8 | సంగారెడ్డి | ఐడీఎస్‌ఎమ్‌టీ | 2005-06 | 72.42 |
| 9 | కదిరి | ఏపీయూఆర్‌ఎమ్‌ఎస్‌పీ, ఐడీఎస్‌ఎమ్‌టీ, బీఆర్‌జీఎఫ్, నిర్మాణాల క్రమబద్ధీకరణ పథకం | 2013 | 7.54 |
| 10 | కావలి | పావలా వడ్డీ, బీపీఎస్, టీఎఫ్‌సీ, మొదలైనవి | 2010-11 నుండి 2011-12 వరకు | 294.40 |
| | | మొత్తం | | **654.86** |

## అనుబంధం - 1.3

**(పేరా 1.5.3, పేజీ 7)**

### సర్దుబాటుకాని అడ్వాన్సుల వివరాలు

**(₹ లక్షల్లో)**

| క్రమ సంఖ్య | మునిసిపాలిటీ పేరు | అడ్వాన్సు తీసుకున్న సమయం | మొత్తం |
|---|---|---|---|
| 1 | కదిరి | 2008-09 | 18.83 |
| 2 | శ్రీకాళహస్తి | 2011-12 | 3.44 |
| 3 | సాలూరు | 2001-02 | 5.60 |
| 4 | జగ్గయ్యపేట | 2007-08 నుండి 2010-11 వరకు | 7.15 |
| 5 | ఆదోని | 2003-04 | 13.94 |
| 6 | డోన్ | 2009-10 నుండి 2012-13 వరకు | 12.45 |
| 7 | వనపర్తి | 2006 నుండి 2012 వరకు | 1.95 |
| 8 | హిందూపురం | 2005 నుండి 2009 వరకు | 52.35 |
| 9 | నంద్యాల | 1994-95 నుండి 2010-11 వరకు | 30.98 |
| 10 | సూర్యాపేట | 2008-09 నుండి 2011-12 వరకు | 14.62 |
| 11 | తెనాలి | 1984-85 నుండి 2011-12 వరకు | 49.20 |
| 12 | గుంతకల్ | 2006-07 నుండి 2011-12 వరకు | 0.68 |
| 13 | నూజివీడు | 2003-04 నుండి 2010-11 వరకు | 3.90 |
| 14 | మచిలీపట్నం | 2006-07 నుండి 2011-12 వరకు | 70.29 |
| 15 | విజయనగరం | 2006-07 నుండి 2011-12 వరకు | 2.06 |
| | | 2000-01 నుండి 2011-12 వరకు | 26.23 |
| 16 | బోధన్ | 2002-03 నుండి 2010-11 వరకు | 7.12 |
| 17 | కావలి | 2005-06 నుండి 2011-12 వరకు | 6.80 |
| 18 | సంగారెడ్డి | 2006-07 నుండి 2010-11 వరకు | 11.65 |
| 19 | పొన్నూరు | 2000-01 నుండి 2007-08 వరకు | 1.41 |
| 20 | తాడిపత్రి | 2008-09 నుండి 2011-12 వరకు | 1.91 |
| మొత్తం | | | **342.56** |

## అనుబంధం - 1.4

**(పేరా 1.5.8, పేజీ 8)**

### పద్దులు రూపొందించని పట్టణ స్థానిక సంస్థల వివరాలు

| క్రమ సంఖ్య | పట్టణ స్థానిక సంస్థల పేర్లు | సంవత్సరాల సంఖ్య |
|---|---|---|
| 1 | హైదరాబాదు మహానగరపాలక సంస్థ | 21 |
| 2 | విశాఖపట్నం మహానగరపాలక సంస్థ | 12 |
| 3 | విజయవాడ నగరపాలక సంస్థ | 6 |
| 4 | కర్నూలు నగరపాలక సంస్థ | 10 |
| 5 | కడప నగరపాలక సంస్థ | 13 |
| 6 | అనంతపురం నగరపాలక సంస్థ | 1 |
| 7 | తిరుపతి నగరపాలక సంస్థ | 5 |
| 8 | వరంగల్ నగరపాలక సంస్థ | 8 |
| 9 | కరీంనగర్ నగరపాలక సంస్థ | 1 |

| | | |
|---|---|---|
| 10 | రామగుండం నగరపాలక సంస్థ | 1 |
| 11 | ఇచ్ఛాపురం పురపాలక సంస్థ | 1 |
| 12 | రాజాం పురపాలక సంస్థ | 1 |
| 13 | అనకాపల్లి పురపాలక సంస్థ | 1 |
| 14 | తాడేపల్లిగూడెం పురపాలక సంస్థ | 2 |
| 15 | నిడదవోలు పురపాలక సంస్థ | 1 |
| 16 | మచిలీపట్నం పురపాలక సంస్థ | 8 |
| 17 | జగ్గయ్యపేట పురపాలక సంస్థ | 5 |
| 18 | నూజివీడు పురపాలక సంస్థ | 1 |
| 19 | గుడివాడ పురపాలక సంస్థ | 1 |
| 20 | పెడన పురపాలక సంస్థ | 1 |
| 21 | మాచెర్ల పురపాలక సంస్థ | 3 |
| 22 | గూడూరు పురపాలక సంస్థ | 28 |
| 23 | వెంకటగిరి పురపాలక సంస్థ | 2 |
| 24 | మార్కాపురం పురపాలక సంస్థ | 3 |
| 25 | డోన్ పురపాలక సంస్థ | 1 |
| 26 | ధర్మవరం పురపాలక సంస్థ | 1 |
| 27 | కదిరి పురపాలక సంస్థ | 2 |
| 28 | జమ్మలమడుగు పురపాలక సంస్థ | 1 |
| 29 | ఖమ్మం పురపాలక సంస్థ (2012 డిసెంబరు 19 నుండి నగరపాలక సంస్థ) | 5 |
| 30 | కొత్తగూడెం పురపాలక సంస్థ | 1 |
| 31 | పాల్వంచ పురపాలక సంస్థ | 1 |
| 32 | ఎల్లందు పురపాలక సంస్థ | 1 |
| 33 | ఆదిలాబాదు పురపాలక సంస్థ | 1 |
| 34 | బెల్లంపల్లి పురపాలక సంస్థ | 1 |
| 35 | మంచిర్యాల పురపాలక సంస్థ | 1 |
| 36 | నిర్మల్ పురపాలక సంస్థ | 1 |
| 37 | కాగజ్‌నగర్ పురపాలక సంస్థ | 1 |
| 38 | మందమర్రి పురపాలక సంస్థ | 1 |
| 39 | భైంసా పురపాలక సంస్థ | 1 |
| 40 | జనగామ పురపాలక సంస్థ | 1 |
| 41 | మహబూబ్‌నగర్ పురపాలక సంస్థ | 3 |
| 42 | నారాయణపేట పురపాలక సంస్థ | 1 |
| 43 | వనపర్తి పురపాలక సంస్థ | 2 |
| 44 | గద్వాల్ పురపాలక సంస్థ | 2 |
| 45 | సంగారెడ్డి పురపాలక సంస్థ | 2 |

## అనుబంధం - 2.1

(పేరా 2.9.1, పేజీ 20)

### ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజన నమూనా తనిఖీ వివరాలు

ఎ. ప్రారంభించిన పనులు (₹ కోట్లలో)

| క్రమ సంఖ్య | జిల్లా | ప్యాకేజీ నెం. | పని పేరు | మంజూరైన సంవత్సరం | ఆమోదిత విలువ | ఖర్చు | ప్రస్తుత స్థితి |
|---|---|---|---|---|---|---|---|
| 1 | ఆదిలాబాదు | ఏపీVIII0114 | దహెగాం మండలం మోట్లగూడ నుంచి వెంకటాపూర్ వరకు రహదారిపై బీటీ పూత వేయటం | 2008-09 | 5.52 | 5.47 | పూర్తయింది |
| 2 | ఆదిలాబాదు | ఏపీ VIII0112 | చిత్తాపూర్ - గుండ్లసోమారం రహదారిపై బీటీ పూత | 2008-09 | 3.99 | 3.67 | పూర్తయింది |
| 3 | ఆదిలాబాదు | ఏపీ VIII0102 | ఆర్ అండ్ బీ రోడ్డు నుండి బీరవెల్లి వయా పుక్కూరు, కొమ్మెర, ఎర్రగుంటపల్లి రహదారి | 2008-09 | 4.07 | 3.44 | పూర్తయింది |
| 4 | ఆదిలాబాదు | ఏపీ VIII0103 | అంగరాజుపల్లి నుంచి ముత్తారావుపల్లి వయా సుందరశాల రహదారి | 2008-09 | 3.40 | 2.88 | పూర్తయింది |
| 5 | ఆదిలాబాదు | ఏపీ VIII0113 | ఆర్ అండ్ బీ రోడ్డు నుండి భామననగర్ వరకు రహదారిపై బీటీ పూత వేయటం | 2008-09 | 2.21 | 2.16 | పూర్తయింది |
| 6 | ఆదిలాబాదు | ఏపీ VIII0105 | రాంపూర్ నుండి దిగడ వరకు రహదారి | 2008-09 | 2.09 | 2.07 | పూర్తయింది |
| 7 | ఆదిలాబాదు | ఏపీ VIII0120 | ఆర్ అండ్ బీ రోడ్డు నుండి రవీంద్ర నగర్ వరకు రహదారిపై బీటీ పూత వేయటం | 2008-09 | 1.62 | 1.47 | పూర్తయింది |
| 8 | ఆదిలాబాదు | ఏపీ VIII0124 | పీడబ్ల్యూడీ రోడ్డు మబెగాం - బోరెగాం రహదారిపై బీటీ పూత వేయటం | 2008-09 | 1.42 | 1.34 | పూర్తయింది |
| 9 | ఆదిలాబాదు | ఏపీ VIII0117 | ఆర్ అండ్ బీ రోడ్డు - కొత్త రాహపల్లి | 2008-09 | 1.39 | 1.18 | పూర్తయింది |
| 10 | ఆదిలాబాదు | ఏపీ VIII0115 | పీడబ్ల్యూడీ రోడ్డు - బోరేగాం | 2008-09 | 1.66 | 1.11 | పూర్తయింది |
| 11 | ఆదిలాబాదు | ఏపీ 01IXLB04 | బెజ్జూరు (ఏటిగూడ) నుండి అగర్‌గూడ వయా గుండేపల్లి | 2010-11 | 1.51 | 1.12 | పూర్తయింది |
| 12 | ఆదిలాబాదు | ఏపీ 01IXLB05 | పీడబ్ల్యూడీ రోడ్డు నుండి పొన్నాల (కొల్లంగూడ) | 2010-11 | 1.31 | 0.55 | పురోగతిలో ఉంది |
| 13 | ఆదిలాబాదు | ఏపీ 01IXLB09 | పీడబ్ల్యూడీ రోడ్డు నుండి చౌక (బెజ్జూరు నుండి పప్పనపేట, గంగాపూర్ నుండి కొసిగి) | 2010-11 | 1.47 | 0.69 | పురోగతిలో ఉంది |
| 14 | అనంతపురం | ఏపీ 02IX0203 | దడితోట - నాయనిపల్లి దారిలో 0/0 - 1/0 కిమీ దగ్గర కాజ్‌వే నిర్మాణం | 2010-11 | 6.42 | 4.71 | పురోగతిలో ఉంది |
| 15 | అనంతపురం | VIII0231 | వెంకటంపల్లి - మంగళకుంట రహదారిపై బీటీ పూత | 2008-09 | 3.61 | 3.28 | పూర్తయింది |
| 16 | అనంతపురం | VIII0213 | ఎర్రోనిపల్లి - కేడీ రోడ్డు రహదారిపై బీటీ పూత | 2008-09 | 2.89 | 2.86 | పూర్తయింది |
| 17 | అనంతపురం | VIII0273 | గూగూడు - మద్దిపల్లి రోడ్డు నుండి మాడుగుపల్లిరహదారిపై బీటీ పూత | 2008-09 | 2.68 | 2.68 | పూర్తయింది |
| 18 | అనంతపురం | VIII0249 | ఎమ్‌బీ రోడ్డు - పి.కొట్టల రహదారిపై బీటీ పూత | 2008-09 | 2.28 | 2.24 | పూర్తయింది |
| 19 | అనంతపురం | VIII0209 | గొల్ల - బెలుగుప్ప - విరుపపల్లి వయా సీర్పి రహదారికి బీటీ పూత | 2008-09 | 2.47 | 2.22 | పూర్తయింది |
| 20 | అనంతపురం | VIII0297 | ఆర్ అండ్ బీ రోడ్డు - రామన్నగుడిశలు రహదారికి బీటీ పూత | 2008-09 | 1.80 | 1.81 | పూర్తయింది |
| 21 | అనంతపురం | VIII0268 | ఆర్ అండ్ బీ రోడ్డు - వెంగన్నపల్లి వయా గోపరాజుపల్లి రహదారికి బీటీ పూత | 2008-09 | 1.89 | 1.69 | పూర్తయింది |

| క్రమ సంఖ్య | జిల్లా | ప్యాకేజీ నెం. | పని పేరు | మంజూరైన సంవత్సరం | ఆమోదిత విలువ | ఖర్చు | ప్రస్తుత స్థితి |
|---|---|---|---|---|---|---|---|
| 22 | అనంతపురం | VIII0219 | ఆర్‌జే రోడ్డు - జీఎస్ తండా రహదారికి బీటీ పూత | 2008-09 | 1.72 | 1.67 | పూర్తయింది |
| 23 | అనంతపురం | VIII0295 | కొక్కంటి - ఈ.చెక్కవారిపల్లి రహదారికి బీటీ పూత | 2008-09 | 1.61 | 1.61 | పూర్తయింది |
| 24 | అనంతపురం | VIII02100 | ఎల్లనూరు - కోడుమూర్తి రహదారికి బీటీ పూత | 2008-09 | 1.78 | 1.58 | పూర్తయింది |
| 25 | అనంతపురం | ఏపీ 02IX0209 | రొద్దం - చెరుకూరు రోడ్డు రహదారిపై కాజ్‌వే నిర్మాణం 8/6-8/8 | 2010-11 | 0.18 | 0.00 | పురోగతిలో ఉంది |
| 26 | అనంతపురం | VIII0288 | ఆర్‌జే రోడ్డు - జీజీ హట్టి | 2008-09 | 0.60 | 0.00 | పూర్తైంది కానీ చెల్లింపు చేయలేదు |
| 27 | అనంతపురం | ఏపీ 02IX0203 | డి.హోసూరు - హోసహళ్ళి వయా హొన్నళ్ళి రహదారిపై కల్వర్టు నిర్మాణం | 2010-11 | 0.16 | 0.00 | పురోగతిలో ఉంది |
| 28 | అనంతపురం | ఏపీ 02IX0212 | బీకే రోడ్డు - ఆర్‌కే రోడ్డు వయా పులిచెర్ల | 2010-11 | 0.28 | 0.00 | పురోగతిలో ఉంది |
| 29 | అనంతపురం | ఏపీ 02IX27 | కంబదూరు - ఓబిగానిపల్లి రోడ్డు | 2010-11 | 0.88 | 0.00 | పురోగతిలో ఉంది |
| 30 | తూర్పు గోదావరి | ఏపీ VIII0509 | T02 లోని 49/7 నుంచి ఉడిముడిలంక వరకు రహదారి | 2008-09 | 1.47 | 1.25 | పూర్తయింది |
| 31 | తూర్పు గోదావరి | ఏపీ VIII0510 | ట్రంకు రోడ్డు నుంచి వజ్రకూటం | 2008-09 | 2.02 | 1.05 | పూర్తయింది |
| 32 | తూర్పు గోదావరి | ఏపీ 05IXLB02 | హెచ్‌ఎల్‌బీ రామేశ్వరం - ఆళ్ళవరం | 2010-11 | 8.35 | 4.70 | పురోగతిలో ఉంది |
| 33 | తూర్పు గోదావరి | ఏపీ VIII0508 | వేటుకూరు - సిరిపురం రహదారి | 2008-09 | 9.87 | 7.42 | పూర్తయింది |
| 34 | తూర్పు గోదావరి | ఏపీ 05IXLB07 | డి.పోలవరం - సుభద్రాయమ్మపేట హైలెవల్ వంతెన | 2010-11 | 7.94 | 1.66 | పురోగతిలో ఉంది |
| 35 | తూర్పు గోదావరి | ఏపీ 05IXLB08 | ఎన్.కొత్తపల్లిలో ఇనపురం కాలువపై వంతెన | 2010-11 | 1.82 | 1.82 | పూర్తయింది |
| 36 | తూర్పు గోదావరి | ఏపీ VIII0506 | బోడిలంక - తుర్రువాడ | 2008-09 | 2.38 | 1.09 | పురోగతిలో ఉంది |
| 37 | తూర్పు గోదావరి | ఏపీ VIII0507 | జీఎమ్‌వలస ఇజ్జలూరు రహదారి | 2008-09 | 2.15 | 2.14 | పూర్తయింది |
| 38 | తూర్పు గోదావరి | ఏపీ VIII0505 | బ్రహ్మసమేధ్యం వరకు రహదారి | 2008-09 | 4.40 | 4.25 | పూర్తయింది |
| 39 | తూర్పు గోదావరి | ఏపీ 05LB09 | గొల్లగుంట దగ్గర హైలెవల్ వంతెన నిర్మాణం | 2010-11 | 0.50 | 0.42 | పూర్తయింది |
| 40 | గుంటూరు | ఏపీ VIII0601 | నందిరాజాపాలెం - గంగిరెడ్డిపాలెం | 2008-09 | 1.65 | 1.60 | పూర్తయింది |
| 41 | గుంటూరు | ఏపీ VIII0604 | ఆర్ అండ్ బీ రోడ్డు - నాగభైరవపాలెం | 2008-09 | 1.51 | 1.34 | పూర్తయింది |
| 42 | గుంటూరు | ఏపీ VIII0615 | ఎమ్.ఎన్ ఆర్ అండ్ బీ రోడ్డు - మందేవారిమాలపల్లి | 2008-09 | 1.46 | 1.34 | పూర్తయింది |
| 43 | గుంటూరు | ఏపీ VIII0620 | ఆర్ అండ్ బీ రోడ్డు - చెరువులోపాలెం | 2008-09 | 1.61 | 1.61 | పూర్తయింది |
| 44 | గుంటూరు | ఏపీ VIII0628 | కంచరగుంట - మించాలంపాడు | 2008-09 | 4.60 | 4.81 | పూర్తయింది |
| 45 | గుంటూరు | ఏపీ VIII6029 | ఓబులేశునిపల్లి - గాజపురం | 2008-09 | 2.96 | 3.09 | పూర్తయింది |
| 46 | గుంటూరు | ఏపీ VIII6030 | సీపీటీ - ఎన్‌ఆర్‌టీ ఆర్ అండ్ బీ రోడ్డు - వేలూరు | 2008-09 | 4.94 | 4.94 | పూర్తయింది |
| 47 | గుంటూరు | ఏపీ VIII0631 | సాతులూరు - సంక్రాంతిపాడు | 2008-09 | 2.34 | 2.34 | పూర్తయింది |
| 48 | గుంటూరు | ఏపీ VIII0634 | పెట్లూరివారిపాలెం - లింగంగుంట్ల | 2008-09 | 2.51 | 2.52 | పూర్తయింది |
| 49 | గుంటూరు | ఏపీ VIII0635 | కుంకలగుంట - పాపిసెట్టిపాలెం | 2008-09 | 1.64 | 1.64 | పూర్తయింది |
| 50 | కరీంనగర్ | ఏపీ 07VIII01 | పీడబ్ల్యూడీ రోడ్డు కాళేశ్వరం - T02 లోని 86/0 కిమీ - పాలుగుల | 2008-09 | 3.14 | 3.16 | పూర్తయింది |
| 51 | ఖమ్మం | ఏపీ 08LW105 | ఆర్ అండ్ బీ రోడ్డు - మామిడిగుండల | 2010-11 | 3.50 | 3.50 | పూర్తయింది |
| 52 | ఖమ్మం | ఏపీ 08LW104 | మద్రిగూడెం నుండి ఏడుపులగూడెం | 2010-11 | 1.37 | 1.30 | పూర్తయింది |
| 53 | ఖమ్మం | ఏపీ 08LW078 | పీడబ్ల్యూడీ రోడ్డు నుండి ఎర్రబోడు | 2010-11 | 4.23 | 2.85 | పూర్తయింది |

| క్రమ సంఖ్య | జిల్లా | ప్యాకేజీ నెం. | పని పేరు | మంజూరైన సంవత్సరం | ఆమోదిత విలువ | ఖర్చు | ప్రస్తుత స్థితి |
|---|---|---|---|---|---|---|---|
| 54 | ఖమ్మం | ఎపి 08LW69 | ముల్కలపల్లి నుండి మంగలిగుట్ట | 2010-11 | 2.82 | 2.67 | పూర్తయింది |
| 55 | ఖమ్మం | ఎపి 08LW34 | ఆర్ అండ్ బి రోడ్డు నుండి దబ్బనూతల (కొత్తూరు) | 2010-11 | 1.98 | 1.93 | పూర్తయింది |
| 56 | ఖమ్మం | ఎపి 08LW41 | గుండాల నుండి శెట్టిపల్లి | 2010-11 | 4.02 | 0.59 | పురోగతిలో ఉంది |
| 57 | ఖమ్మం | ఎపి 08LW12 | బూర్గంపహాడ్ నుండి సోంపల్లి | 2010-11 | 2.89 | 0 | పురోగతిలో ఉంది |
| 58 | ఖమ్మం | ఎపి 08IXLB03 | కంచనపల్లి నుండి అనంతోగు | 2010-11 | 3.39 | 0.45 | పురోగతిలో ఉంది |
| 59 | ఖమ్మం | ఎపి 08LW84 | అనిశెట్టిపల్లి నుండి మార్కోడు | 2010-11 | 14.41 | 8.07 | పురోగతిలో ఉంది |
| 60 | ఖమ్మం | ఎపి 08LW66 | పిడబ్ల్యూడి రోడ్డు నుండి చిన్నవారిగూడెం | 2010-11 | 2.34 | 0 | పురోగతిలో ఉంది |
| 61 | ఖమ్మం | ఎపి 08LW83 | ఆర్ అండ్ బి రోడ్డు నుండి లచ్చగూడెం | 2010-11 | 3.47 | 2.43 | పురోగతిలో ఉంది |
| 62 | ఖమ్మం | ఎపి 08LB75 | జడ్‌పి రోడ్డు నుండి కిష్టాపురం | 2010-11 | 1.94 | 1.80 | పూర్తైంది |
| 63 | ఖమ్మం | ఎపి 08LW07 | ఆర్ అండ్ బి రోడ్డు నుండి కుసుమనపల్లి | 2010-11 | 1.56 | 1.30 | పూర్తైంది |
| 64 | ఖమ్మం | ఎపి 08LW78 | పిడబ్ల్యూడి రోడ్డు నుండి కొత్తరేలకాయలపల్లి | 2010-11 | 4.23 | 0.21 | పురోగతిలో ఉంది |
| 65 | కృష్ణా | ఎపి VIII0901 | గరిసపాడు నుండి చిన్నగొల్లపాలెం | 2008-09 | 3.44 | 3.51 | పూర్తయింది |
| 66 | మహబూబ్‌నగర్ | ఎపి VIII1205 | పిడబ్ల్యూడి రోడ్డు వెల్దండ నుండి అంకమోనికుంట | 2008-09 | 5.05 | 4.05 | పూర్తయింది |
| 67 | మెదక్ | ఎపి VIII1110 | పిటి వెంకటాపూర్ నుండి మునిగడప | 2008-09 | 4.97 | 4.84 | పూర్తయింది |
| 68 | మెదక్ | ఎపి VIII1112 | తీగుల్ - యూసుఫ్‌ఖాన్ పల్లి | 2008-09 | 5.32 | 4.57 | పూర్తయింది |
| 69 | మెదక్ | ఎపి 12IXLB06 | ఔదుత్‌పూర్ రోడ్డు మీద గొండగాం వరంకు (6/4 నుండి 6/6 కి.మీ వరకు) వంతెన | 2010-11 | 3.26 | 2.72 | పురోగతిలో ఉంది |
| 70 | మెదక్ | ఎపి VIII1123 | గొల్లపల్లి నుండి కొండాపూర్ మండల కేంద్రం వరకు రహదారి | 2008-09 | 2.87 | 2.71 | పూర్తయింది |
| 71 | మెదక్ | ఎపి VIII1104 | పిడబ్ల్యూడి రోడ్డు - బంగ్లా వెంకటాపూర్ | 2008-09 | 2.70 | 2.70 | పూర్తయింది |
| 72 | మెదక్ | ఎపి VIII1107 | ఎంకేపల్లి - మావినల్లి వయా ఉట్‌పల్లి | 2008-09 | 2.65 | 2.65 | పూర్తయింది |
| 73 | మెదక్ | ఎపి VIII1119 | ముంద్రాయి - మాండపల్లి | 2008-09 | 2.70 | 2.61 | పూర్తయింది |
| 74 | మెదక్ | ఎపి VIII1103 | అల్లాదర్గా మెటల్‌కుంట పిడబ్ల్యూడి రోడ్డు నుండి ముస్లాపూర్ వయా బైరాన్‌దిబ్బ | 2008-09 | 2.06 | 1.89 | పూర్తయింది |
| 75 | మెదక్ | ఎపి 12IXLB03 | పిడబ్ల్యూడి రోడ్డు నుండి తిప్పారం వరకు వంతెన | 2010-11 | 2.94 | 1.84 | పూర్తయింది |
| 76 | మెదక్ | ఎపి VIII1114 | పిడబ్ల్యూడి రోడ్డు - అనంతసాగర్ వయా జుకల్, చందాపూర్ | 2008-09 | 1.76 | 1.78 | పూర్తయింది |
| 77 | మెదక్ | ఎపి VIII1109 | పిడబ్ల్యూడి రోడ్డు - గోప్య తండా | 2008-09 | 1.73 | 1.73 | పూర్తయింది |
| 78 | మెదక్ | ఎపి VIII1121 | మాటిండ్ల నుండి ఇబ్రహీంపూర్ | 2008-09 | 1.91 | 1.60 | పూర్తయింది |
| 79 | ప్రకాశం | ఎపి 16IXLB03 | ఎమ్‌సీ రోడ్డు - రామాయపట్నం 8/6 నుండి 8/8 వరకు | 2010-11 | 1.67 | 1.65 | పూర్తయింది |
| 80 | ప్రకాశం | ఎపి VIII1601 | ఎన్‌హెచ్ 5 నుండి రామకూరు (338/6 కిమీ దగ్గర) | 2008-09 | 1.73 | 1.72 | పూర్తయింది |
| 81 | ప్రకాశం | ఎపి VIII1602 | టంగుటూరు - వెంకటాయపాలెం రోడ్డు నుండి కేశుపాలెం | 2008-09 | 2.87 | 2.48 | పూర్తయింది |
| 82 | ప్రకాశం | ఎపి VIII1606 | మొగల్లూరు 14/8 కిమీ - చీర్ల దిన్నె | 2008-09 | 2.66 | 2.71 | పూర్తయింది |
| 83 | ప్రకాశం | ఎపి VIII1608 | నేరేడుపల్లి - మురుగమ్మి | 2008-09 | 2.36 | 2.46 | పూర్తయింది |
| 84 | ప్రకాశం | ఎపి VIII1609 | ఒవి రోడ్డు - పీసపల్లి వయా ఎరువారిపల్లి బట్టుపల్లి | 2008-09 | 3.55 | 3.37 | పూర్తయింది |

| క్రమ సంఖ్య | జిల్లా | ప్యాకేజీ నెం. | పని పేరు | మంజూరైన సంవత్సరం | ఆమోదిత విలువ | ఖర్చు | ప్రస్తుత స్థితి |
|---|---|---|---|---|---|---|---|
| 85 | ప్రకాశం | ఏపీ VIII1615 | పేడైర్లపాడు - లక్ష్మక్కపల్లి | 2008-09 | 3.24 | 3.06 | పూర్తయింది |
| 86 | ప్రకాశం | ఏపీ VIII1616 | పామూరు - కందుకూరు ఆర్ అండ్ బీ - అయ్యన్నకోట | 2008-09 | 1.64 | 1.68 | పూర్తయింది |
| 87 | ప్రకాశం | ఏపీ VIII1619 | కందుకూరు - నరిశెట్టివారిపాలెం | 2008-09 | 2.69 | 2.69 | పూర్తయింది |
| 88 | ప్రకాశం | ఏపీ VIII1620 | ఒవీ రోడ్డు నుండి రామనాధపురం | 2008-09 | 2.90 | 2.90 | పూర్తయింది |
| 89 | ప్రకాశం | ఏపీ VIII1621 | బీ అగ్రహారం రోడ్డు - పొలినేని చెరువు | 2008-09 | 3.77 | 3.72 | పూర్తయింది |
| 90 | ప్రకాశం | ఏపీ VIII1622 | పొలినేని చెరువు రోడ్డు - గాంధీనగర్ | 2008-09 | 1.96 | 1.98 | పూర్తయింది |
| 91 | ప్రకాశం | ఏపీ VIII1625 | మాలకొండరాయునిపాలెం - కేవీ రోడ్డు బంగారక్కపాలెం | 2008-09 | 1.82 | 1.82 | పూర్తయింది |
| 92 | ప్రకాశం | ఏపీ VIII1626 | దోనకొండ - గజ్జలకొండ | 2008-09 | 3.72 | 3.23 | పూర్తయింది |
| 93 | ప్రకాశం | ఏపీ VIII1638 | కోకవానికుంట - గంజివారిపల్లి రోడ్డు 10/8 కీమీ - తంబడపల్లి | 2008-09 | 3.27 | 3.10 | పూర్తయింది |
| 94 | శ్రీకాకుళం | ఏపీ VIII1808 | కుసుంపురం నుండి కళింగపట్నం | 2008-09 | 4.55 | 3.58 | రద్దయింది |
| 95 | విజయనగరం | ఏపీ VIII2009 | ఎస్‌డీ రోడ్డు నుండి ఎగువగంజాయిభద్ర వరకు | 2008-09 | 8.43 | 6.39 | రద్దయింది |
| 96 | వరంగల్ | ఏపీ 21IXLB14 | ఆర్ అండ్ బీ రోడ్డు నర్లపూర్ నుండి కాల్వపల్లి వరకు రహదారిపై తుమ్మలవాగుమీద కాజ్‌వే నిర్మాణం | 2010-11 | 3.83 | 3.10 | పూర్తయింది |

## బి. మంజూరైనట్టు చూపించినా అప్పగించని పనులు

| క్రమ సంఖ్య | జిల్లా | ప్యాకేజీ | పని పేరు | మంజూరైన సంవత్సరం | 2013 జూన్‌నాటికి పని స్థితి |
|---|---|---|---|---|---|
| 1 | ఆదిలాబాదు | ఏపీ VIII0119 | పీడబ్ల్యూడీ హంగిగిర్గా 6/0 - డహేగాం | 2008-2009 | అప్పగించలేదు |
| 2 | ఆదిలాబాదు | ఏపీ VIII0123 | పీడబ్ల్యూడీ - సంగ్వీ | 2008-2009 | అప్పగించలేదు |
| 3 | ఆదిలాబాదు | ఏపీ VIII0126 | జెడ్‌పీ రోడ్డు - రంజని | 2008-2009 | అప్పగించలేదు |
| 4 | ఆదిలాబాదు | ఏపీ 01IXLB07 | కర్జెల్లీ నుండి మొట్లగూడ (బెజ్జూరు నుండి సోమిని) | 2010-2011 | పురోగతిలో ఉంది |
| 5 | ఆదిలాబాదు | ఏపీ 01IXLB08 | పీడబ్ల్యూడీ రోడ్డు నుండి లక్ష్మీపూర్ | 2010-2011 | పురోగతిలో ఉంది |
| 6 | ఆదిలాబాదు | ఏపీ 01IXLB11 | పీడబ్ల్యూడీ రోడ్డు నుండి కిషన్‌తండా | 2010-2011 | అప్పగించలేదు |
| 7 | ఆదిలాబాదు | ఏపీ 01IXLB12 | కరంజీవాడ నుండి లెండిగూడ | 2010-2011 | అప్పగించలేదు |
| 8 | ఆదిలాబాదు | ఏపీ 01IXLB13 | కరంజీవాడ నుండి లెండిగూడ | 2010-2011 | పురోగతిలో ఉంది |
| 9 | ఆదిలాబాదు | ఏపీ 01IXLB14 | ఆర్/ఎఫ్ కోసగుట్ట నుండి యాపల్‌గూడ | 2010-2011 | అప్పగించారు కానీ అటవీ అనుమతి రానందున మొదలుపెట్టలేదు |
| 10 | ఆదిలాబాదు | ఏపీ 01IXLB15 | ఆర్/ఎఫ్ కుంతల కే నుండి మధురతండా | 2010-2011 | పురోగతిలో ఉంది |
| 11 | ఆదిలాబాదు | ఏపీ 01IXLB16 | ఆర్/ఎఫ్ కుంతల కే నుండి మధురతండా | 2010-2011 | పురోగతిలో ఉంది |
| 12 | అనంతపురం | ఏపీ VIII0229 | అగలి - రత్నగిరి రోడ్డు - జంగమానహళ్లి | 2008-2009 | పూర్తయింది |
| 13 | అనంతపురం | ఏపీ VIII0258 | అల్లిపూర్‌తండా - చౌటితండా | 2008-2009 | పురోగతిలో ఉంది |
| 14 | అనంతపురం | VIII02105 | ధర్మవరం - మామిళ్లపల్లి రోడ్డు - కామిరెడ్డిపల్లి | 2008-2009 | పూర్తయింది |
| 15 | అనంతపురం | VIII02106 | ఎన్‌హెచ్ రోడ్డు - అప్పరచెరువు | 2008-2009 | పూర్తయింది |
| 16 | అనంతపురం | VIII02107 | ఏకే రోడ్డు - లింగారెడ్డిపల్లి | 2008-2009 | పూర్తయింది |
| 17 | అనంతపురం | ఏపీ 02IX0207 | జాతీయ రహదారి 7 - రాజీ వ్ కాలనీ | 2010-2011 | అప్పగించలేదు |

| క్రమ సంఖ్య | జిల్లా | ప్యాకేజీ | పని పేరు | మంజూరైన సంవత్సరం | 2013 జూన్‌నాటికి పని స్థితి |
|---|---|---|---|---|---|
| 18 | అనంతపురం | ఏపీ 02IX0210 | కొండపల్లి - పేరూరు | 2010-2011 | రద్దయింది |
| 19 | అనంతపురం | ఏపీ 02IX0216 | ఏ కొండాపురం - పెదపప్పూరు | 2010-2011 | అప్పగించలేదు |
| 20 | అనంతపురం | ఏపీ 02IX0226 | వజ్రకరూరు - వేలుపుమడుగు | 2010-2011 | పని మంజూరు కాలేదు |
| 21 | అనంతపురం | ఏపీ 02IX0227 | మల్లాపురం - పాల్తూరు | 2010-2011 | పురోగతిలో ఉంది |
| 22 | అనంతపురం | ఏపీ 02IX0228 | మల్లాపురం - పాల్తూరు | 2010-2011 | పురోగతిలో ఉంది |
| 23 | అనంతపురం | ఏపీ 02IX0229 | మల్లాపురం - పాల్తూరు | 2010-2011 | పురోగతిలో ఉంది |
| 24 | అనంతపురం | ఏపీ 02IX0231 | పాల్తూరు - మల్లాపురం | 2010-2011 | పురోగతిలో ఉంది |
| 25 | అనంతపురం | ఏపీ 02IX10 | జాతీయ రహదారి 63 - అమ్మెనపల్లి | 2010-2011 | పురోగతిలో ఉంది |
| 26 | అనంతపురం | ఏపీ 02IX16 | కొండపల్లి - పేరూరు 5/0 నుండి 6/0 | 2010-2011 | రద్దయింది |
| 27 | అనంతపురం | ఏపీ 02IX27 | కంబదూరు - ఒబిగానిపల్లి | 2010-2011 | పురోగతిలో ఉంది |
| 28 | తూర్పు గోదావరి | ఏపీ 05IXLB01 | ఏఆర్ రోడ్డు - మట్లపాడు | 2010-2011 | అప్పగించలేదు |
| 29 | తూర్పు గోదావరి | ఏపీ 05IXLB03 | T01 లోని 75/4 - వలసలతిప్ప | 2010-2011 | అప్పగించలేదు |
| 30 | తూర్పు గోదావరి | ఏపీ 05IXLB04 | T02 లోని 49/7 కీమీ - ఉడిముడిలంక | 2010-2011 | అప్పగించలేదు |
| 31 | గుంటూరు | ఏపీ VIII0606 | లేమల్లెపాడు - కోవెలమూడి | 2008-2009 | రద్దయింది |
| 32 | గుంటూరు | ఏపీ 06IXLB03 | వలివేరు నుండి వేటపాలెం రోడ్డు | 2010-2011 | అప్పగించలేదు |
| 33 | ఖమ్మం | ఏపీ 08IXLB02 | నాగుపల్లి - తొట్టిపంపు బీటీ రోడ్డు | 2010-2011 | అప్పగించలేదు |
| 34 | ఖమ్మం | ఏపీ 08LW19 | కేసరం - గూడూరు | 2010-2011 | రద్దయింది |
| 35 | ప్రకాశం | ఏపీ VIII1634 | డీఎస్ రోడ్డు - మద్రిపాలెం | 2008-2009 | రద్దయింది |

**అనుబంధం - 3.1**

**(పేరా 3.3.3, పేజీ 32)**

**టీఎస్‌సీ/ఎన్‌బీఏ పనుల నమూనా తనిఖీ వివరాలు**

| జిల్లా | మండలం | గ్రామ పంచాయతీలు |
|---|---|---|
| అనంతపురం | పుత్తూరు | సి. వెంగన్నపల్లి, చలవేముల, చెర్లోపల్లి, ఎల్లుట్ల, జంగమరెడ్డిపేట, కొండాపురం, కొండేపల్లి, కుమ్మనమల, పుత్తూరు, తక్కళ్ళపల్లి |
| | సెట్టూరు | కనుకూర్, పెరుగుపాళ్యం, ములకలేడు, ఐదుకల్, మాకొడికి, లక్ష్మంపల్లె, తిప్పనపల్లి, యటకాల్, చెర్లోపల్లి, చిన్నంపల్లి |
| | గండ్లపెంట | మద్దివారిగొండి, చామలగొండి, జీనులకుంట, తుమ్మలబైలు, గొడ్డువేలగల, కటారుపల్లి, తూపల్లి, గండ్లపెంట, వేపరాల, కురుమామిడి |
| కృష్ణా | బాపులపాడు | అంపాపురం, బిల్లనపల్లి, బొమ్ములూరు, చిరివాడ, దంతగుంట్ల, కాకులపాడు, మడిచెర్ల, ఓగిరాల, పెరికీడు, రేమల్లె |
| | కంచికచర్ల | బత్తినపాడు, గండేపల్లె, గనియాతుకూరు, కంచికచెర్ల, కీసర, మున్నలూరు, పెరకలపాడు, శేరి అమరవరం, వేములపల్లె |
| | చాట్రాయి | ఆరుగొలనుపేట, బూరుగుగూడెం, చాట్రాయి, చీపురుగూడెం, చిట్టాపూర్, జనార్ధనవరం, కోటపాడు, కృష్ణారావుపాలెం, నరసింహారావుపాలెం, తుమ్మగూడెం |
| మహబూబ్‌నగర్ | అమనగల్ | ఆకుతోటపల్లె, ఆమనగల్, ఎక్వాయిపల్లె, కర్కల్‌పహాడ్, కోనాపూర్, మెద్దిగడ్డ తాండా, పోలెపల్లె, రామనూతుల, శెట్టిరాంనగర్ తాండా, సింగంపల్లె |
| | దామరగిడ్డ | బాపన్‌పల్లె, బొమ్మన్‌పాడ్, దామరగిడ్డ, గడప, గడిముంకన్‌పల్లె, కందన్‌పల్లె, లోకుర్తి, మల్‌రెడ్డిపల్లె, ఉద్మల్‌గిడ్డ, వాతుగుండ్ల |
| | గట్టు | ఆరగిడ్డ, బోయలగూడెం, గట్టు, గోర్లఖాన్‌దొడ్డి, కూచినెర్ల, లింగాపురం, నందిన్నె, పెంచికాలపాడు, తుమ్మలచెరువు, తుమ్మలపల్లి |
| నెల్లూరు | కలిగిరి | అనంతపురం, కలిగిరి, కావలి ముస్తాపురం, క్రాకుటూరు, నాగసముద్రం, పాటికోట, పెదకొండూరు, తూరుపు దూబగుంట, వీరనాకొల్లు, ఎరుకలరెడ్డిపాలెం |
| | ఉదయగిరి | ఆర్లపడియా, దాసరిపల్లె, జి. అయ్యవారిపల్లె, జి. చెరువుపల్లె, గండిపాలెం, కొండాయపాలెం, కృష్ణంపల్లె, పుల్లయపల్లె, తిరుమలపురం, వెంగళరావునగర్ |
| | ఓజిలి | బాట్లకనుపూరు, భువనగిరిపాలెం, చిల్లమనుచేను, కురుగొండ, మాచవరం, ముమ్మయపాలెం, పున్నెపల్లె, రాచపాలెం, రావిపాడు, వెంకటరెడ్డిపాలెం |
| రంగారెడ్డి | హయత్‌నగర్ | అబ్దుల్లాపూర్, బండారావిర్యాల్, బాటసింగారం, బ్రాహ్మణపల్లి, చిన్నరావిర్యాల్, గండిచెరువు, కవాడిపల్లి, ముంగనూర్, పస్మామ్లా, తుర్కయాంజల్ |
| | మహేశ్వరం | అమీర్‌పేట, దుబ్బచెర్ల, ఘాట్‌పల్లి, హర్షాగూడ, కల్వకోల్, మంకల్, నాగిరెడ్డి పల్లి, సిరిగిరిపూర్, శుభంపూర్ తుమ్మలూర్ |
| | షామీర్‌పేట | బొమ్రాస్‌పేట్, దేవరయాంజల్, జగ్గంగూడ, కొల్తూరు, లాల్‌గాడి మలక్‌పేట్, నారాయణపూర్, పోతాయ్‌పల్లె, తూంకుంట, తుర్కపల్లి, ఉద్దెమర్రి |
| వరంగల్ | పాలకుర్తి | బొమ్మెర, కొండాపూర్, మల్లంపల్లె, మంచుప్పుల, ముత్తారం, పాలకుర్తి, సిరిసన్నగూడెం, తీగారం, వావిలాల, విస్నూర్ |
| | ఖానాపూర్ | అశోక్‌నగర్, బుధారావుపేట్, డబీర్‌పేట్, ధర్మారావుపేట, ఖానాపూర్, కొత్తూరు, మంగళవారిపేట్, మనుబోతులగడ్డ తాండా, రంగాపూర్ |
| | శాయంపేట | గంగిరేనిగూడెం, గట్లకానిపర్తి, హుస్సేన్‌పల్లి, కొప్పుల, నేరేడ్‌పల్లి, పత్తిపాక, పెద్దకోడెపాక, రాజుపల్లె, శాయంపేట, తారాపూర్ |

# పొడి అక్షరాల వివరణ

పేజీలు 65 - 67

| | |
|---|---|
| ఏఐపీ | కార్యక్రమం అమలుపై వార్షిక ప్రణాళిక |
| ఏపీఈడబ్ల్యూఐడీసీ | ఆంధ్రప్రదేశ్ విద్య మరియు సంక్షేమ మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ |
| ఏపీఎల్ | దారిద్ర్య రేఖకు ఎగువన |
| ఏపీఎస్‌హెచ్ సీఎల్ | ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ |
| ఏపీఎస్ఆర్ఆర్‌డీఏ | ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామీణ రహదారుల అభివృద్ధి సంస్థ |
| ఏఎస్‌హెచ్ఏ (ఆశా) | నియోజిత ప్రజారోగ్య కార్యకర్తలు |
| ఏటీఆర్‌లు | యాక్షన్ టేకెన్ రిపోర్టులు |
| బీజీ | బ్యాంకు గ్యారంటీ |
| బీపీఎల్ | దారిద్ర్య రేఖకు దిగువన |
| బీఆర్‌సీలు | బ్లాకు రిసోర్స్ సెంటర్లు |
| బీఆర్‌ఓలు | బడ్జెట్ విడుదల ఉత్తర్వులు |
| సీఏజీ | భారత కంప్ట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్ |
| సీసీ | సిమెంటు కాంక్రీటు |
| సీసీడీయూ | ప్రచార, వ్యక్తిత్వ వికాస కేంద్రం |
| సీడీ | క్రాస్ డ్రైనేజి |
| సీడీఎమ్ఏ | మునిసిపల్ పరిపాలన కమీషనర్ మరియు డైరెక్టర్ |
| సీఎన్‌సీపీఎల్ | విస్తృత రహదార్ల ప్రాధాన్యత జాబితా |
| సీపీఎస్ఎమ్ఎస్ | కేంద్రీయ ప్రణాళికా పథకాల పర్యవేక్షణ వ్యవస్థ |
| సీఎస్‌సీలు | సామాజిక మరుగుదొడ్ల సముదాయం |
| సీయూపీఎల్ | విస్తృత రహదార్ల అభివృద్ధి ప్రాధాన్యత జాబితా |
| సీవీపీడీ | ఒక రోజులో తిరిగే వాణిజ్య వాహనాల సంఖ్య |
| డీడీపీ | కరువు ప్రాంత అభివృద్ధి కార్యక్రమం |
| డీపీఆర్ | సమగ్ర ప్రాజెక్టు నివేదిక |
| డీఆర్‌డీఏ | జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ |
| డీఆర్ఆర్‌పీ | జిల్లా గ్రామీణ రహదారుల ప్రణాళిక |
| డీడబ్ల్యూఎస్ఎమ్ | జిల్లా నీటి సరఫరా, పారిశుధ్య సమితి |
| ఈఈ | కార్యనిర్వాహక ఇంజనీరు |
| ఈఎమ్‌డీ | ధరావతుగా జమచేయాల్సిన మొత్తం |
| ఈఎన్‌సీ | ఇంజనీర్-ఇన్-చీఫ్ |
| ఎఫ్‌డీ | కాలపరిమితి డిపాజిట్ |
| ఎఫ్ఎస్‌డీ | అదనపు సెక్యూరిటీ డిపాజిట్ |
| ఐఏవై | ఇందిరా ఆవాస్ యోజన |
| ఐఈసీ | సమాచారం, శిక్షణ, ప్రచారం |
| ఐహెచ్‌హెచ్ఎల్ | వ్యక్తిగత మరుగుదొడ్లు |

| | |
|---|---|
| ఐఎస్‌డీఐఆర్ఏఎమ్ఎమ్ఏ - ఇందిరమ్మ | గ్రామీణ, ఆదర్శ పట్టణ ప్రాంతాల్లో సమీకృత, నవీన అభివృద్ధి |
| ఐఆర్‌సీ | భారతీయ రోడ్ కాంగ్రెస్ |
| ఐఆర్ | తనిఖీ నివేదిక |
| ఐఎస్ఎల్ | వ్యక్తిగత మరుగుదొడ్లు |
| ఐటీడీఏ | సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ |
| ఎమ్ఏ & యూడీ | మునిసిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి |
| ఎమ్‌జీఎన్ఆర్ఈజీఎస్ | మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం |
| ఎమ్ఎల్ఏ | శాసన సభ్యుడు |
| ఎమ్ఓఆర్‌డీ | గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ |
| ఎమ్‌పీడీఓ | మండల పరిషత్ అభివృద్ధి అధికారి |
| ఎమ్‌పీపీ | మండల ప్రజా పరిషత్తు |
| ఎన్‌బీఏ | నిర్మల్ భారత అభియాన్ |
| ఎన్‌జీఓ | ప్రభుత్వేతర సంస్థ |
| ఎన్‌జీపీ | నిర్మల్ గ్రామ పురస్కార్ |
| ఎన్‌క్యూఎమ్ | జాతీయ క్వాలిటీ మానిటర్ |
| ఎన్ఆర్‌డీడబ్ల్యూపీ | జాతీయ గ్రామీణ తాగునీటి పథకం |
| ఎన్ఆర్ఆర్‌డీఏ | జాతీయ గ్రామీణ రహదారుల అభివృద్ధి సంస్థ |
| ఓఎమ్ఎమ్ఎస్ | ఆన్‌లైన్ మేనేజ్‌మెంట్, మానిటరింగ్ సిస్టం |
| పీఏసీ | ప్లాన్ అప్రూవల్ కమిటీ |
| పీసీలు | ఉత్పత్తి కేంద్రాలు |
| పీఐపీ | ప్రాజెక్టు అమలుచేసే పథకాలు |
| పీఐయూలు | ప్రాజెక్టు అమలు యూనిట్లు |
| పీఎమ్‌జీఎస్‌వై | ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన |
| పీఎమ్‌యూ | ప్రాజెక్టు పర్యవేక్షణ విభాగం |
| పీఆర్&ఆర్‌డీ | పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి |
| పీఆర్ఐ | పంచాయతీ రాజ్ సంస్థ |
| పీడబ్ల్యూడీ | ప్రజాపనుల శాఖ |
| ఆర్ఆర్ఎమ్ | గ్రామీణ రహదారుల నిబంధనావళి |
| ఆర్ఎస్ఎమ్‌లు | గ్రామీణ పారిశుధ్య సామాగ్రి దుకాణాలు |
| ఆర్‌వీఎమ్ | రాజీవ్ విద్యా మిషన్ |
| ఆర్‌డబ్ల్యూఎస్&ఎస్ | గ్రామీణ నీటిసరఫరా, పారిశుధ్యం |
| ఎస్‌బీహెచ్ | స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాదు |
| ఎస్‌డీ | స్వచ్ఛతా దూత |

| | |
|---|---|
| ఎస్ఎఫ్‌సీ | రాష్ట్ర ఆర్థిక సంఘం |
| ఎస్‌హెచ్‌జీ | స్వయం సహాయక బృందాలు |
| ఎస్ఎల్ఎస్‌సీ | రాష్ట్ర స్థాయీసంఘం |
| ఎస్ఎల్‌డబ్ల్యూఎమ్ | ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణ |
| ఎస్‌క్యూసీ | స్టేట్ క్వాలిటీ కంట్రోల్ (నాణ్యతా నియంత్రణ) |
| ఎస్‌క్యూఎమ్ | స్టేట్ క్వాలిటీ మానిటర్ (నాణ్యతా పర్యవేక్షణ) |
| ఎస్ఆర్ఆర్‌డీఏ | రాష్ట్ర గ్రామీణ రహదారుల అభివృద్ధి సంస్థ |
| ఎస్‌టీఏ | రాష్ట్ర సాంకేతిక సంస్థ |
| ఎస్‌డబ్ల్యూఎస్ఎమ్ | రాష్ట్ర నీటి సరఫరా, పారిశుధ్య సమితి |
| టీజీఎస్ | సాంకేతిక మార్గదర్శకత్వం, పర్యవేక్షణ |
| టీఎస్‌సీ | సంపూర్ణ పారిశుధ్య పథకం |
| యూసీ | వినియోగ ధృవపత్రం |
| యూఎల్‌బీలు | పట్టణ స్థానిక సంస్థలు |
| యూఎన్ఐసీఈఎఫ్ | ఐక్యరాజ్యాల బాలల నిధి<br>(ఇదివరకు ఐక్యరాజ్యాల బాలల అత్యవసర నిధి అనేవారు) |
| వీఏటీ | విలువ ఆధారిత పన్ను |
| డబ్ల్యూబీఎమ్ | వాటర్ బౌండ్ మెకడమ్ |
| డబ్ల్యూఎమ్ఎమ్ | వెట్ మిక్స్ మెకడమ్ |
| జడ్‌పీపీ | జిల్లా ప్రజాపరిషత్తు |

© భారత కంప్ట్రోలర్ మరియు
ఆడిటర్ జనరల్

www.cag.gov.in

© భారత కంప్ట్రోలర్ మరియు
ఆడిటర్ జనరల్
www.cag.gov.in